సాహిత్య
ప్రస్థానం
జూన్ 2014

సంపుటి : 13 సంచిక : 6

# సంధి సమయంలో సవాళ్ళు

ఎన్నికల పర్వం ముగిసి కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వాన కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అత్యధిక మెజార్టీతో ఏర్పడిన ఆయన పాలన గురించి విపరీతమైన ఆశలు ప్రచారంలో పెట్టింది కార్పోరేట్ మీడియా. గతంలో మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా జరిగిన మత మారణకాండ గురించి ప్రత్యేకంగా సాహిత్యలోకంలో తీవ్రావేశం, ఆవేదన వ్యక్తమైనాయి. ఇప్పుడు ఆయన అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తారని అనుకూల వర్గాలు చెబుతున్నాయి. మరోవైపున ఇంత భారీ ప్రచారార్భాటంతో ఆయనను ప్రతిష్టించిన సంపన్న వర్గాలు తమ కోర్కెలు నెరవేర్చుకునే ప్రయత్నం చేయకుండా వుండవు. మోడీకి ప్రచార దళంగా పనిచేసిన ఆరెస్సెస్ సంఘ పరివార్ వర్గాల మతతత్వ రాజకీయాలు కూడా అందరికీ తెలుసు. మరి ఈ రెండు ప్రభావాలూ దాటుకుని ప్రజాస్వామ్య లౌకిక విలువల పరిరక్షణ ఆయన ప్రభుత్వం ముందు పెద్ద సవాలుగా వుంటుంది. భిన్న మతాలు జాతులు భాషలు విశ్వాసాలతో కూడిన ఈ సువిశాల దేశంలో లౌకిక తత్వం తప్ప మరే మార్గంలోనూ మనుగడ కుదిరేది కాదు. అలాగే నయా ఉదారవాద ఆర్థిక విధానాలను తోసిపుచ్చకుండా అందరికీ అభివృద్ధి ఫలాలు అందడం దుర్లభం. ఇవన్నీ ఎలా పరిణమిస్తాయో ఆచరణలో చూడవలసి వుంటుంది. దేశంలో తొలిసారిగా ఒక ప్రతిపక్ష పార్టీకి పూర్తి మెజారిటీ ఇచ్చిన ప్రజల ఆశలు కొంతైనా నెరవేరాలని ఆశిద్దాం. అందుకు ఆటంకంగా వచ్చే అనర్థాలను తిప్పికొడదాం.

ఇక ఆంధ్ర ప్రదేశ్ అన్నది ఈ సంచిక మీ చేతుల్లోకి చేరేసరికి రెండుగా విభజితమై వుంటుంది. తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలు జూన్ 2 నుంచి ఏర్పడటం ఒక చారిత్రక పరిణామం. ప్రజల తీర్పు మేరకు తెలంగాణలో కె. చంద్రశేఖరరావు నాయకత్వాన టిఆర్ఎస్ ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్‌లో నారా చంద్రబాబునాయుడు నాయకత్వాన టిడిపి బిజెపి ప్రభుత్వం ఏర్పడనున్నాయి. గతంలో వాదవివాదాలు ఎలా వున్నా ఇప్పుడు రెండు చోట్ల గల తెలుగువారి సమగ్రాభివృద్ధికి దోహదపడే విధంగా రెండు ప్రభుత్వాలు వ్యవహరిస్తాయని ఆశించాలి. ఉభయ రాష్ట్రాల అభివృద్ధి ప్రజా సంక్షేమం తప్ప మరే ఇతర అంశాలూ ఈ సమయంలో దృష్టి మళ్లించడాన్ని అనుమతించకూడదు. మోడీ ప్రభుత్వం కూడా ఈ సంధ్యా సమయంలో ఉభయ రాష్ట్రాల పట్ల తన బాధ్యతను నెరవేర్చాలి.

బొమ్మలు : టి. శివాజి, జె. వెంకటేష్, వి. రమేష్

# ఈ సంచికలో...

కవిత... 4
అంతరాలు (కథ) 5
ఖదీర్‌బాబు కథలు–ముస్లిం జీవన చిత్రణ 9
ఒక ధిక్కార స్వరం 'నిచ్చెన మెట్ల లోలకం!' 13
కవిత 15
అభినవ సినీకవి సుద్దాల అశోక్‌తేజ 16
వికృత క్రీనీడ (కథ) 18
కవిత 23
నల్లూరి రుక్మిణి కథలు 24
కవిత 28
చైతన్య జ్వలిత – ఐలయ్య కవిత 29
నాన్నకు నేనెందుకు చెప్పాలి (కథ) 34
కవిత 37
బాధల గాథలు 'గుడిసె ఏసోబు కథలు' 38
ప్రజాశక్తి రేఖా శేఖరుడు 41
స్వీకారం 43
డైరీ 47

సంపాదకవర్గం

తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
వొరప్రసాద్
వల్లభాపురం జనార్దన

కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్,
ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర,
హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,

ఇ.మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

**కవిత**

# రోబో

**- డా॥ ఎన్. గోపి**



రోజూ మా యింట్లో
మైళ్ళకొద్దీ నడుస్తుంటాను
తిరగడానికీ
ఓ అలిఖిత వ్యాకరణం వుంటుంది.
ఎంత తిరిగినా
వస్తువుల మధ్యే
ఎంత వేగంగా నడిచినా
కాళ్లు గోడలకు తాకవు.

బాత్‌రూంలో కెళ్ళి
బ్రష్ నోట్లో పెట్టుకొని
బాల్కనీలో పచారులు చేస్తాను.
కాఫీ కోసం వంటింటిదాకా వెళ్ళొస్తాను.

డ్రాయింగ్ రూంలో
కూర్చొని లేవడానికి
టీపాయిని ఎన్నోసార్లు
జరుపుతుంటాను.

ఇంటిపైన ట్యాంక్‌లోకి
నీళ్ళు ఎక్కించటానికి
ఎలక్ట్రిక్ స్విచ్ ఆన్ చేస్తాను.
టిఫిన్ కోసం కాళ్ళు అప్రయత్నంగా
డైనింగ్ టేబిల్‌వైపు నడుస్తాయి.
అలమారు తెరిచి
పుస్తకాలు తిరగేస్తూ కాస్త నిలబడతాను.

అప్పుడప్పుడు
కాలుగాలిన పిల్లిలా
తిరుగుతుంటాను గాని
అది హాయిగా సాగుతున్న పద్యంలో
యతి భంగంలా వుంటుంది.

ఎంత నడిచినా
మా ఇంట్లో దూరం తరగదు
నడుక ఒడువదు.

ఆదిమకాలంలో
కొండల్లో తిరిగిన నేను
క్రమంగా
నాగరికతకు మరిగిపోయాను.

ఇప్పుడు
కవిత్వమే నా వెంట లేకుంటే
వస్తువుల అరణ్యంలో తప్పిపోయి
అస్తిత్వం కోల్పోయేవాణ్ణి.

---



## మే నెల పురస్కారాలు



**నిడమర్రు టు హైదరాబాద్**
**కథకు : రూ.700/-**
రచయిత : **ప్రసాదమూర్తి**

**పికిలిన దేహాంతరంగం**
**కవితకు : రూ.500/-**
రచయిత : **ఆవుల వెంకటేశులు**

*సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*



**వ్యాసం:**
**మనుషుల అవసరం తీర్చలేని బంగారం**
*రచయిత : **వి. వెంకటరావు***

***ఈ రచయితకు 'కర్లపాలెం రుక్మిణమ్మ స్మారక పురస్కారం' రూ. 500/- అందజేయబడుతుంది.***

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.*

***- ఎడిటర్***

## కథ

# అంతరాలు




- సత్యభాస్కర్

9392649295


*అన్నమయ్య గీతంతో సెల్ ఫోన్ మోగింది.*

*ఆఫీస్ పనిలో బిజీగా వున్న పార్వతి విసుక్కుంటూనే ఫోన్ ఆన్ చేసింది.*

*"కాన్ ఐ స్పీక్ విత్ మిస్ పార్వతి ప్లీజ్"అని అవతలి నుండి అమెరికన్ యాక్సెంట్‌లో మగగొంతు వినిపించింది.*

*ఛీ దరిద్రం! ఇదేదో సేల్స్ టాక్‌లా వుంది. ఇంత బిజీ అవర్‌లో వెధవ డిస్ట్రబెన్స్ అనుకుంటూనే*

'ఎస్'అంది.

"గుడ్‌మార్నింగ్ మేడం! మీ డాటర్ జీత్ అదే జీవిత సిక్ అయింది. మిమ్ములను చూడాలని కలవరిస్తోంది. హాస్పిటల్‌లో అడ్మిట్ చేసాము. అంత ఖంగారు పడాల్సిన పనిలేదు. ట్రీట్‌మెంట్ జరుగుతోంది. మీరు వెంటనే బయలుదేరి రాగలరా!"అని ఆంగ్లంలోనే అవతలి గొంతు వివరించింది.

బ్యాంకు పని నుండి బయటపడి ఈ లోకంలోకి వచ్చింది పార్వతి! ఒక్కసారిగా గుండె వణికింది.

"మీరెవరు మాట్లాడుతోంది! ఏమయింది జీవితకు.. ఎప్పుడు అడ్మిట్ చేసారు" అంటూ ఖంగారుగా అడిగింది పార్వతి. ఒక్కసారిగా ఆమె మొహం పాలిపోయింది. అప్పటిదాకా బ్యాంకులో ట్యూబ్‌లైట్ల వెలుతురులో అందం ఉట్టిపడుతున్న ఆమె మొహం కాస్త కాంతి విహీనంగా మారింది.

"నేను పీటర్‌ని మేడం! జీత్ కొలీగ్‌ను. మీరు బెంగుళూరు ఎప్పుడు వస్తోంది చెబితే నేనే వచ్చి రిసీవ్ చేసుకుంటాను. ఇక్కడకు వచ్చాక అన్ని వివరాలు చెబుతాను. హండ్రెడ్ పర్సంట్ షి ఈజ్ అవుటాఫ్ డేంజర్! మీరు ఏమీ వర్రీ కాకండి. అంకుల్‌కు కూడా మీరే మెసేజ్ ఇవ్వండి. ఈ నెంబర్ ఫీడ్ చేసుకోండి. బై" అని ఫోన్ పెట్టేసాడు.

ఆ ఫోన్ కాల్ షాక్ నుండి తేరుకున్న పార్వతి, వెంటనే విజయవాడలో బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తోన్న భర్త సీతాపతికి ఫోన్ చేసింది.

"ఆ! చెప్పు పార్వతి. ఏమిటి ఈ సమయంలో చేసావ్.." అని గట్టిగా విసుగుతోనే అన్నాడాయన.

విషయం చెప్పింది పార్వతి! అవతల కూడా అంతే షాక్ అయినట్లు స్పందన .

"ఒకే పార్వతి! నీవేమీ వర్రీకాకు. అవుటాఫ్ డేంజర్ అన్నాడుగా! ఏదో జరిగివుంటుంది. బెంగుళూరులో మంచి హాస్పిటల్స్ వున్నాయిలే. ఆయన ఎవరూ.. పీటరా! ఆ ఫోన్ నెంబర్ ఇవ్వు. నేను మాట్లాడుతాను. నీవు వెంటనే పర్మిషన్ పెట్టి బయలుదేరు. నాకు రావడానికి కనీసం ఒకరోజు పడుతుంది. అసిస్టెంట్ మేనేజర్ ఈ రెండురోజులు రానన్నాడు.

బ్యాంక్ కీస్ నా దగ్గరున్నాయి. నేను ఫోన్‌లో టచ్‌లో వుంటాను."అని ధైర్యం చెప్పాడు. పీటర్ నెంబర్ చెప్పింది.

బ్యాంకులో పర్మిషన్ తీసుకుని, తన పని వేరేవారికి అప్పచెప్పేసరికి గంటపైన పట్టింది. కొలీగ్స్ అందరూ ధైర్యం చెప్పారు. వెళ్ళగానే ఫోన్‌చేయమన్నారు. బ్యాంక్ అంతా కస్టమర్లతో కిటకిటలాడుతుండటంతో ఎవరికీ సమయం కేటాయించేటంత తీరికలేదు. అయినా వాళ్ళ సానుభూతిని అర్థం చేసుకుంది పార్వతి. గరుడ బస్ దొరకడంతో సీట్లో చేరబడి ఆలోచనలో పడింది పార్వతి. ప్రయాణంలో చూస్తుండగానే కునుకు పట్టింది. ఆ కొద్దిపాటి నిద్రలోనే భయంగొలిపేలా విచిత్రమైన కలలు, అనుభూతులు. ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచింది. చుట్టూరా చీకట్లను చీల్చుకుంటూ బస్సు గరుడపక్షిలాగానే గమ్యస్థానానికి వెళుతోంది.



బస్‌స్టేషన్‌లో దిగంగానే పీటర్ ఎదురొచ్చాడు. అంతకుముందే ఫోన్‌లో వస్తున్నట్టు చెప్పడంతో సరిగ్గా బస్ స్టాప్‌లోనే నిల్చున్నాడు. అంతపొడుగు కాదు పొట్టికాదు, పిల్లిగడ్డం, ఉంగరాల జుట్టు, కళ్ళజోడుతో బక్కపలచగా చామన ఛాయతో రిచ్‌గా వున్నాడు. వాయిస్‌విని పెద్దాయన అనుకుంది.కుర్రాడే!.

''ఆంటీ! గుడ్ ఈవినింగ్. ఐయామ్ పీటర్" అంటూ ముందుకు వచ్చి పలకరించాడు. తెలుగు బొత్తిగా వచ్చినట్లులేదు. ఆయనను చూడగానే పార్వతికి మళ్ళీ బిడ్డపట్ల ఆతృత, ఆందోళన ఒక్కసారిగా కమ్ముకుంది. తెలియకుండానే కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"వెంటనే హాస్పిటల్‌కు వెళదాం పదండి!"అని తొందరచేసింది.

'ఒకే ఆంటీ!" అని మరోమాట మాట్లాడకుండా బస్‌స్టాండ్ నుండి బయటకు దారితీసాడు. బెంగుళూరు రద్దీ రోడ్లను చీల్చుకుంటూ ఇన్నోవా కారును డ్రైవ్ చేస్తున్నాడు పీటర్.

ఏమయిందని ఎన్నిసార్లు అడిగినా ''షి ఈజ్ ఆల్‌రైట్"అని అంటాడే తప్ప మరో మాట మాట్లాడకుండా డ్రైవ్ చేస్తున్నాడు. మితభాషిలాగున్నాడని పార్వతి అడగడానికి కూడా ఇబ్బంది పడింది.

హాస్పిటల్ ముందు ఆగంగానే పార్వతి దిగి రిసెప్షన్‌లో పోయి కూర్చుంది. తాను కారు పార్క్‌చేసి వచ్చాడు. రిసెప్షన్‌లో పర్మిషన్ తీసుకుని ఇద్దరూ లిఫ్ట్ ఎక్కి 3వ ఫ్లోర్‌కు వెళ్ళారు. చాలా పెద్ద హాస్పిటల్. కార్పొరేట్ రిచ్‌నెస్ అడుగడుగునా కనబడుతోంది. డాక్టర్లు, అటెండెంట్లు హడావుడిగా తిరుగుతున్నారు. అడుగడుగునా సెక్యూరిటి సిబ్బంది కాపలా వున్నారు.

ఆతృతగా రూంలో అడుగుపెట్టిన పార్వతికి బెడ్‌మీద గాఢంగా నిద్రపోతున్న జీవిత కనబడింది. చేతికి సెలైన్ పెట్టివుంది.పక్కన బల్లమీద ఏవో మందు బాటిల్స్ వున్నాయి. తెల్లటి తెలుపులో బెడ్‌షీట్‌లు, కర్టెన్లు, ఒక రకమయిన ప్రశాంత వాతావరణాన్ని, నిశ్చింతను కలుగచేస్తున్నాయి. బెడ్ పక్కన వున్న కుర్చీలో కూర్చుని జీవిత చేతిని తన చేతిలోకి తీసుకుని ఒక్కసారిగా భోరుమంది పార్వతి.

పీటర్ గది బయటనే ఆగిపోయాడు.ఎప్పుడు వచ్చిందో నర్సు "ఏమీ కాలేదమ్మా! ఖంగారుపడకండి. అరగంటలో మేలుకుంటుంది. అప్పుడు మీరు మాట్లాడవచ్చు''అని వెనకనుండి తెలుగులో అంది.

"ఏమయింది నాబిడ్డకు"అని వణికే కంఠంతో అంది పార్వతి.

''ఒంట్లో బాగాలేదని నిన్న తీసుకువచ్చి జాయిన్ చేసారమ్మా! రాత్రి ఎమర్జన్సీగా ఆపరేషన్ చేసారు."అందామె.

"ఆపరేషనా! ఎందుకు?" అని నిశ్చేష్టురాలయింది. అన్ని వివరాలు చెప్పడం ఇష్టంలేనట్లు మొహం పెట్టి "అక్కడ రూంలో డ్యూటి డాక్టరుంటారమ్మా ఆవిడను అడగండి. నాక్కూడా అన్ని విషయాలు తెలియవు. మీరు పక్కకు జరిగితే పేషెంటుకు ఒక ఇంజక్షన్ ఇవ్వాలి"అని అడిగింది.

డాక్టరును కలవాలనే ఆలోచన రానందుకు తనని తాను తిట్టుకుంటూ గదిబయటకు నడిచింది పార్వతి.

బయట పీటర్ కనబడలేదు. బహుశ ఇంటికి వెళ్ళి వుంటాడు. పాపం! రాత్రంతా ఇక్కడే వున్నట్టున్నాడు. దేవుడిలాగా సాయం చేసాడు.

''రామ్మా! జీవిత తల్లిగారా!" తన వయస్సు వుంటుందేమో! చాలా సీనియర్ డాక్టర్‌లాగా కనబడుతోంది. డా॥దేవకి అని బ్యాడ్జి తగిలించుకొని వుంది.

"మేము హైదరాబాద్‌లో వుంటామండి. ఆయన విజయవాడలో వుంటారు. ఇద్దరం బ్యాంక్ ఎంప్లాయిస్‌మే. జీవితకు ఏమయింది డాక్టర్!" అని ఆతృతగా ప్రశ్నించింది.

"మీకు విషయం ఏమీ తెలియదా! జీవితకు అబార్షన్ అయింది... తల్లిదండ్రులకే తెలియకుండా చేయించారా! బయట ఎక్కడో హాస్పిటల్‌లో చేయించారు.అనుకోకుండా కొన్ని కాంప్లికేషన్స్ రావడంతో నిన్న ఎమర్జన్సీలో ఆమె భర్త అదే

పీటర్ తీసుకువచ్చి జాయిన్ చేసాడు. షి ఈజ్ ఆల్‌రైట్! రెండు రోజుల్లో పంపించి వేస్తాము. వారంరోజులు రెస్ట్ తీసుకుంటే మళ్ళీ ఆఫీసుకు వెళ్ళిపోవచ్చు”అని చెప్పింది డాక్టర్.

డాక్టర్ చెబుతున్న విషయానికి నెత్తిన పిడుగు పడ్డట్టయింది పార్వతికి.

అబార్షన్ ఏమిటి? తన పిల్లకు పెళ్ళే కాలేదు. ఆ పిల్లిగడ్డం వాడు జీవితకు మొగుడా!? ఫ్రెండ్, కొలీగ్ అని చెప్పాడే!? తన చుట్టూరా ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్టయింది. ఒక్కసారిగా తూలి టేబుల్‌మీద పడినట్లయింది.

“అయ్యయ్యో!.. ఇంత చిన్నదానికే షాక్ అయ్యారా! మీరు ఎడ్యుకేటెడ్ అయుండి చిన్న చిన్న ఆపరేషన్‌లకే భయపడితే ఎలామ్మా! సమయానికి ఆమె భర్త తీసుకు రావడం మంచిదయింది. నౌ షి ఈజ్ కంప్లీట్‌లీ నార్మల్! అవుటాఫ్ డేంజర్”. పక్కనున్న సిస్టర్‌తో “ఈవిడను జాగ్రత్తగా తీసుకువెళ్ళి పెషెంట్ పక్కన బెడ్‌మీద కూర్చోపెట్టు... ఒకే అమ్మా! నాకు రౌండ్లకు వెళ్ళే టైం అవుతోంది. మళ్ళీ అవసరం వుంటే నాకు కాల్ చేయండి. సిస్టర్ నా ఫోన్ నెంబరు ఇస్తుంది.’”అని భరోసా ఇస్తూ కుర్చీలోంచి లేచింది.



❖❖❖

స్పృహలోకి వచ్చిన జీవితకు కళ్ళ ఎదురుగా స్టూల్ మీద తల్లి కనబడటంతో ఒక్కసారిగా జీవం వచ్చినట్లయింది.

‘‘ఎప్పుడొచ్చావమ్మా!’’అని సంతోషంగా చేయిపట్టుకుని అడిగింది.

“రెండుగంటలయిందమ్మా! నీకు ఎలా వుందే! ఇదంతా ఏమిటే? మేము చచ్చామనుకున్నావా! ఒక్క ఫోన్ చేస్తే వచ్చి వాలే వాళ్ళంగా!” అని దు:ఖంతో పూడుకుపోతున్న గొంతుతో అంది పార్వతి.

తల్లి కళ్ళలోకి చూస్తూ ఏమీ మాట్లాడకుండా ఉండిపోయింది జీవిత.

“నీకు పెళ్ళయిందని కూడా మాకు చెప్పలేదేంటమ్మా! ఎప్పుడయినా నీ ఇష్టాన్ని కాదన్నామా! ఒక్కగానొక్క బిడ్డవు నీకు ఏనాడయినా ఏమైనా లోటు చేసామా! చెక్కిళ్ళమీద ధారగా కన్నీళ్ళు కారిపోతున్నాయి. ఆవిడ జీవితంలో ఏనాడు అంత క్షోభ అనుభవించలేదు.

ఎంతో శక్తి కూడగట్టుకున్నట్టుగా జీవిత ఒక్కొక్క పలుకు పలికింది. ఆపరేషన్‌వల్ల కలిగిన నీరసం నుండి కోలుకొని మాట్లాడటం కోసం మానసికంగా ఎంతో శక్తిని పోగుచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లుగా వున్నాయి ఆమె పలుకులు.

‘‘నేను పెళ్ళి చేసుకున్నానని నీవు ఎలా అనుకుంటున్నావమ్మా! చేసుకుంటే తప్పక నిన్ను పిలిచేదాన్ని”అని అంది.

“అదేంటే! మరి ఇదంతా ఏమిటి? వాడెవడో నీ కొలీగ్‌నని చెప్పాడు. వాడే నీ భర్తని అడ్మిట్ చేసాడటగదా!” ఆపుకోవాలన్నా ఆపుకోలేని విధంగా ఆవిడ గొంతులో కోపం ధ్వనిస్తోంది. ఒకవైపు తల్లిగా ఆమెను మమకారం కట్టి పడేస్తోంది. కాని బిడ్డ చేసిన పనికి ఆవిడలో నిలువెత్తు అసహ్యం కనబడుతోంది. ఇంటికెళ్ళాక మాట్లాడుదామనుకొని తీసుకున్న నిర్ణయం ఆ కోపం ముందు తేలిపోయింది.

“ఇప్పుడు నా ఆరోగ్యం కన్నా అవే ముఖ్యమా అమ్మా!”అని అంటూ ఒక్కసారి కళ్ళు మూసుకుంది జీవిత.

“ఇక నువ్వేం చెప్పకు. చేసిన వెధవ పని చాలు కాని, డిశ్చార్జి కాగానే మనింటికి వెళ్ళిపోదాం. ఉద్యోగం లేదు సద్యోగం లేదు. నువ్వు ఉద్యోగం చేసి ఎవ్వరిని పోషించక్కర్లేదు. నాన్నగారికి తెలిస్తే నానా రాద్ధాంతం అవుతుంది. నేనే ఏదో చెప్పి మేనేజ్ చేస్తాను. ఆయన కోపం తగ్గేక అన్ని చెబుదాం. నువ్వు తొందరగా కోలుకో.”అని అనునయంగా చెప్పింది. పార్వతి. తల్లి స్థానంలో వివేకంగా ప్రవర్తిస్తోన్న వ్యవహారకర్తలా మాట్లాడింది.

అంత నీరసంలోను జీవిత తల్లి మాటలకు ఫక్కున నవ్వింది.

“అది సాధ్యమయ్యే పని కాదమ్మా! నేను ఈ లైఫ్ స్టయిల్ నుండి వెనక్కు రాలేనంత దూరం వచ్చేసానమ్మా! నీకు అన్ని చెబుతాను. ప్రశాంతంగా విను. నేను, పీటర్ ఇద్దరం కొలీగ్స్‌మి. ఇద్దరం ఒకరంటే ఒకరం ఇష్టపడ్డాం. ఒక సంవత్సరంగా డేటింగ్ చేస్తున్నాం. ఈ మధ్యనే లివ్ ఇన్ రిలేషన్‌లోకి ఎంటరయ్యాం. ఒకే ఫ్లాట్‌లోకి మారాం.దాని ఫలితమే ఇది. ప్రికాషన్ తీసుకోకపోవడంతో పొరపాటు జరిగింది. ఇద్దరం కలిసే అబార్షన్ చేయించుకోవాలని నిర్ణయం తీసుకున్నాం. ఎందుకంటే ఈ ఇయర్ ఎండింగ్‌లో స్టేట్స్‌కు వెళ్ళిపోతున్నాం! పీటర్ పేరెంట్స్ అక్కడే వుంటారు.మేం అక్కడకు వెళ్ళంగానే మేరేజ్ చేసుకోవాలనుకున్నాం. మా పిల్లలు అమెరికన్ సిటిజన్స్ కావలని మా కోరిక” అని వివరంగా

చెప్పింది.

“ఛి! ఛీ! ఇలా ఎవడితో పడితే వాడితో పెళ్ళికాకుండానే కాపురాలు చేస్తున్నారా! మా పెంపకంలో ఏం లోపం వున్నదని ఇలా తయారయ్యావు? మన కులం మతం కాని వాడితో కాపురమా! మన పరువేం కావాలి! మేమంటే లెక్కలేకుండా పోయిందా నీకు! నాన్నగారు ఎంత బాధపడతారో ఒక్కసారయినా ఆలోచించావా?” తల్లిగా ఆక్రోశించింది.

తల్లి మాటలను ప్రశాంతంగా వింది జీవిత. ఆమె మొహంలో ఎలాంటి ఆందోళన కానీ, అపరాధ భావన కాని లేవు. చిరునవ్వును కూడా కోల్పోలేదు.

“వాట్ మమ్మీ! ఇంత సిల్లీగా మాట్లాడకు. కులం, మతం, పరువు ఇవేవీ మా సర్కిల్‌లో వినపడవు. అవన్నీ మీ తరంతోటి ఆఖరు. మీరేగా నన్ను జీవితంలో గొప్పగా పైకి రావాలని నర్సరి నుండే మోటివేట్ చేసారు. చిన్నప్పటినుండి బేబీకేర్‌సెంటర్‌లో పెరిగాను. రెసిడెన్షియల్ స్కూళ్ళలోనే నా బాల్యం అంతా గడిచింది. ఇంజనీరింగు కూడా ఐఐటిలో చేసా. మీరు ఆశించినట్టే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సెలెక్టయ్యాను. ఏనాడయినా మిమ్మల్ని డిజప్పాయింట్ చేసానామ్మా! 28ఏళ్ళు వచ్చినా పెళ్ళి చేసుకోలేదు. స్టేట్స్ వెళ్ళి సెటిల్ అవ్వాలని ఆ తర్వాతనే నాకు పెళ్ళని మీకు చెబితే మీరే ఎంతో సంతోషంగా అంగీకరించారు కదా! ఇప్పుడు ఈ చిన్న విషయంలో ఎందుకంత అప్‌సెట్ అవుతున్నావు! రిలాక్స్ మమ్మీ! ట్రై టు అండర్‌స్టాండ్ మి” అని సముదాయించింది జీవిత.



“ఇది చిన్న విషయమంటావేమిటే? వాడు నిన్ను మోసం చేయడని నమ్మకమేమిటి? ఇప్పుడు నిన్ను వదిలేస్తే నీ గతేం కాను?” అని కోపం, అసహ్యం మిళితమయిన కంఠంతో అడిగింది పార్వతి.

“నెవర్ మమ్మీ! పీటర్‌కు నేనంటే ప్రాణం. వాళ్ళ పేరెంట్స్ ఎప్పుడో అమెరికాకు వెళ్ళిపోయి సెటిల్ అయ్యారు. పీటర్ కూడా నాలాగే చిన్నతనం నుండి రెసిడెన్షియల్ స్కూళ్ళలోను, కాలేజిల్లోను చదివాడు. చాలా తెలివయినవాడు.సాఫ్ట్‌వేర్‌లో నాకంటే ఎక్స్‌పర్ట్. హి ఈజ్ ఎ జీనియస్! మా ఇద్దరిది ఒకటే బ్యాక్‌గ్రౌండ్ అవడంతో పరిచయం కాగానే ఇద్దరం చిన్నపిల్లల్లాగా కలిసిపోయాం. మా అభిప్రాయాలు బాగా కలిసాయి.”అని విశ్వాసంగా పలికింది జీవిత.

“ప్రేమ మత్తులో పడితే ఇలాగే వుంటుందమ్మా! రోజూ పేపర్లలో, టివీల్లో ఎన్ని వార్తలు చూడడం లేదు. వాడి మాటల్ని నువ్వు గుడ్డిగా నమ్ముతున్నావు.” అని ఈసడింపుగా అంది పార్వతి.

“నో మమ్మీ! అలా మాట్లాడకు. ఒకవేళ నువ్వన్నట్లుగానే జరిగినా బెదిరిపోవడానికి నేనేమీ ఆర్డినరి ఇండియన్ గర్ల్‌ని కాను. వివాహ బంధాన్ని మీ జనరేషన్‌లాగ మేము చూడడం లేదు మమ్మీ! మీలాగ మేము జీవితాంతం కలిసి వుంటామని కూడా అనుకోవడం లేదు. మాలో ఎవరికి ఈ బంధం అడ్డంకి అనుకున్నా ఇద్దరం ఫెయిర్‌గా మాట్లాడుకుని విడిపోయి ఎవరి జీవితాలు వాళ్ళు బతకగలం. ఆ కాన్ఫిడెన్స్, అండర్‌స్టాండింగ్ మాకుంది. వియార్ ధరోలీ అమెరికనైజ్డ్, గ్లోబల్ జనరేషన్ మమ్మీ!”అని అంది

“ఏమిటే నాపెంపకం చివరికి ఇలా తగలడిందా!” అని మరోసారి భోరుమంది పార్వతి.

ఆవిడను సముదాయించడానికి కూడా ప్రయత్నించలేదు జీవిత! అలా చూస్తూనే ఉండి పోయింది.

కొద్దిసేపటికి తేరుకుని ఒకసారి ఆగమని తల్లికి సైగ చేస్తూ ఇలా అంది. “మీ పెంపకం ఎక్కడుంది మమ్మీ! పసిబిడ్డగా నీ ఒడిలో వున్నకాలం తప్ప! నా జీవితం అంతా హాస్టళ్ళలోనే గడిచింది. ఒక్కోసారి శెలవలక్కూడా ఇంటికి వచ్చేదాన్ని కాదు గుర్తుందామ్మా! నాన్నా, అమ్మ కావాలని చిన్ననాడు ఎంతగా తల్లడిల్లిపోయానో! అప్పుడు మీరిద్దరూ ఏమనేవారో గుర్తుందామ్మా! జీవితంలో పైకి రావాలంటే త్యాగాలు తప్పనిసరి అని అనేవారు. ఇప్పుడు జీవితంలో పైకొచ్చాక, మళ్ళీ పెంపకం, విలువలు అంటూ నాకు అర్థం కాని విషయాలు మాట్లాడుతున్నావు” అని నిష్టూరంగా అంటూ, అమాయకంగా కళ్ళతోనే ప్రశ్నించింది జీవిత.

కలలో కూడా తన బిడ్డ నుండి ఆ ప్రశ్నను ఊహించని పార్వతి దిగ్భ్రాంతితో ఆ కుర్చీకి అతుక్కుపోయినట్లుగా స్థాణువయ్యింది. తన చేతిలో చేయివేసివున్న తన బిడ్డ పూర్తిగా పరాయిదానిలాగా ఆమెకు కనబడుతోంది. తన కడుపుచించుకొని పుట్టిన ఆ బిడ్డ చేతిలో తన రక్త స్పర్శ లేనట్లుగా మొట్టమొదటిసారిగా ఆమెకు తోచింది.



# ఖదీర్‌బాబు కథలు - ముస్లిం జీవన చిత్రణ

- సి.హెచ్.యేసయ్య
8500562820

***ముస్లిం జీవన ప్రవంతిని మాండలిక పదజాలంతో అల్లడం వల్ల అందమైన మాలలుగా ఈ కథలు అవదరించాయి. పాఠకులు ఈ రెండు పుస్తకాలను ఇష్టపడటానికి కొన్ని కారణాలున్నాయి– మధ్యతరగతి కుటుంబ జీవితానికి చెందిన కథలుండటం, కథల్లోని వాక్యాలన్నీ మధ్యతరగతి ప్రజలు మాట్లాడుకునే మాటలుకావడం, ఉర్దూ, తెలుగు మాండలిక పదాల కలయికతో నూతనోత్తేజాన్ని కల్గించడం, ఈ కథలన్నీ కూడా ఉత్తమపురుషలో, రచయితే బాల్యంలో ఉండి చెప్పడం. ఈ రెండు సంపుటాల్లోని కథల్ని విశ్లేషించి. వాటి ప్రత్యేకతను వివరించడమే ఈ వ్యాసోద్దేశం.***

మహమ్మద్ ఖదీర్‌బాబు రాసిన 'దర్గామిట్టకథలు' ఆంధ్రజ్యోతి ద్వారా 1999 లో తెలుగు కథాప్రియులకు పరిచయమైనాయి. మరో ఐదేళ్లకు 2004 లో 'పోలేరమ్మ బండ కథలు' వచ్చాయి. 'విశాలాంధ్రబుక్‌హౌస్' లో ఇప్పటికీ ఈ రెండు సంపుటాలు సందడి చేస్తున్నాయి. కథాపాఠకుల ప్రేమను పొందగోరుతున్నాయి. జీవమున్న కథలు మరణించవు, జీవమున్న కథలొస్తున్నంత వరకూ వాటిని చదివే పాఠకులకూ కొదువుండదు అనడానికి ఈ కథలే తార్కాణం

ఆధునిక తెలుగు కథాసాహిత్యంలో ప్రాంతీయ జీవన విధానాన్ని చిత్రిస్తూ అనేక కథలు వచ్చాయి. కథల్లో నెల్లూరు మాండలిక పదాలను ప్రవేశపెట్టడం కరుణకుమార (కందుకూరి అనంతం)తో మొదలైంది. ఈ ధోరణి అనేక మంది రచయితలను ఆకట్టుకుంది. కళింగాంధ్ర మాండలికంలో కథలు రాసిన "ఆంధ్రాచెహోవ్" చాసో (చాగంటి సోమయాజులు), 'అమరావతి కథలు' రాసిన శంకరమంచి సత్యం ప్రాంతీయతకు ఒక నిండుతనాన్ని చేకూర్చారు.

ఇటీవల రాయలసీమ మాండలిక కథల్ని ఎందరో రాస్తున్నా, వెదురుతో నేర్పుగా బుట్టలల్లినట్లు తెలుగు కథాప్రియులందరూ ఇష్టపడేలా చిత్తూరు మాండలికంలో కథలల్లిన రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడు. ప్రాంతీయ వాతావరణం, భాషల్లో రాసే ఏ కథా రచయితైనా నామిని ప్రభావం నుంచి వేరుపడటం కష్టమే.

'పచ్చనాకు సాక్షిగా', 'సినబ్బకథలు', 'మిట్టూరొడి కథలు', 'మునికన్నడి సేద్యం', 'పాలపొదుగు' మొదలైన రచనలు నామినిని మాండలిక కథాసాహిత్యంలో ప్రత్యేక రచయితగా చేశాయి.

నామిని వారసత్వాన్ని అందిపుచ్చుకుని కథలల్లిన ఖదీర్‌బాబు కూడా ఆయన ఆలోచనాసరళి నుంచి బయటపడలేక పోయాడు. ఐతే ముస్లిం జీవన ప్రవంతిని మాండలిక పదజాలంతో అల్లడం వల్ల అందమైన మాలలుగా ఈ కథలు అవదరించాయి. పాఠకులు ఈ రెండు పుస్తకాలను ఇష్టపడటానికి కొన్ని కారణాలున్నాయి– మధ్యతరగతి కుటుంబ జీవితానికి చెందిన కథలుండటం, కథల్లోని వాక్యాలన్నీ మధ్యతరగతి ప్రజలు మాట్లాడుకునే మాటలుకావడం, ఉర్దూ, తెలుగు మాండలిక పదాల కలయికతో నూతనోత్తేజాన్ని కల్గించడం, ఈ కథలన్నీ కూడా ఉత్తమపురుషలో, రచయితే బాల్యంలో ఉండి చెప్పడం. ఈ రెండు సంపుటాల్లోని కథల్ని విశ్లేషించి. వాటి ప్రత్యేకతను వివరించడమే ఈ వ్యాసోద్దేశం.

ఖదీర్‌బాబు కథలు ముఖ్యంగా చదువుకు సంబంధించినవి, వృత్తి పనులకు సంబంధించినవి, సంస్కృతి సంప్రదాయాలకు చెందినవి, పండుగలకు చెందినవిగా వర్గీకరించవచ్చు.

**చదువుకు సంబంధించిన కథలు:** దర్గామిట్ట, పోలేరమ్మబండ కథల్లో చదువుకు సంబంధమున్నవి అనేకం ఉన్నాయి. ముఖ్యంగా 'పోలేరమ్మబండకథలు' విద్యార్థిదశలో సాగిన కథలు కాబట్టి భాషను గురించి, ప్రార్థన గురించి, పుస్తకాలనుగురించిన కథలు ఈ సంపుటంలో చూడొచ్చు. భాషను గురించిన కథ "అలీఫ్ బే తే", "మా నాయినమ్మకి గోరీకడితే" లో మాతృభాష ప్రాశస్త్యాన్ని, మాతృభాష నేర్చుకోని వారిని సమాజం ఎగతాలిగా ఎంతగా ఎత్తిచూపుతుందో ఈ కథ తేటపరుస్తుంది. భాషపట్ల పెద్దవారికుండే మమకారం, పట్టు ఖదీర్ నాయినమ్మ పాత్రద్వారా తెలుస్తోంది. అంతే కాకుండా భిన్న భాషల్లో పరిపూర్ణత లేకుండటం వల్ల ఈ

ఆధునిక ప్రపంచీకరణ నేపథ్యంలో కలిగే ఇబ్బందుల్ని కూడా చూపిస్తుందీ కథ. ఇప్పటికీ మాతృభాష ఉర్దూ నేర్చుకోలేని ఖదీర్ తన బాధను – "కానీ యిన్నేళ్ల తురువాత, హైదరాబాద్ ప్రెస్ క్లబ్బుల్లో ఇరానీ హోటళ్లలో పరిచయమయ్యి చాయ్‌లు తాగుతా సిగరెట్లు ఊదుకుంటూ కవిత్వాలు చెప్పే షోదానాయాళ్లంతా నీకు మగ్దూము తెలుసా? ఫయాజ్ అహ్మద్ ఫయాజు తెలుసా? జిలానీ బానో తెలుసా? సిరాజుద్దీన్ మౌలా తెలుసా? మాకెట్టా అభాగ్యంలేదు. సాయిబైపుట్టి కూడా ఉర్దూలో ఏమి కవిత్వం మిస్సయి పోయినావు బాస్ అంటా జాలిపడతా వుంటే ఆనాడు బతిమాలో బామాలో తేనెలాంటి ఆ భాషని నేర్పించనందుకు మా నాయినమ్మకు నిజ్జంగానే గోరీ కట్టాలనిపించింది" అనే మాటల్లో వ్యక్తం చేస్తాడు.



ఖదీర్‌బాబు

వెలివృత్తులెన్నైనా కులవృత్తికి సాటిరావని గువ్వలచెన్న శతకం చెప్తుంది. గుడ్డలమ్మడం, గెనిసిగెడ్డ లమ్మడం, పూలమ్మడం, మెకానిక్ వంటి వృత్తుల్లోని జీవితాల్ని నవ్వుతో కలబోసి సమాజానికి సుతిమెత్తని సందేశాల్ని అందించారు. ఖదీర్‌బాబు ఈ రెండు సంపుటాల్లో.

**ప్రార్థన గురించిన కథ:** బడిలో ప్రార్థన చేయించాలనీ, యానివర్సరీకి నాటకాలు వేయాలనే ఉబలాటం ప్రతి విద్యార్థికి ఉంటుంది. కానీ అయ్యవార్లు మాత్రం అందరికీ అవకాశం ఇవ్వరు. తమకిష్టమైన, బాగా చదివే విద్యార్థుల చేత మాత్రమే ప్రార్థనా కార్యక్రమం చేయిస్తారు. అంటే పక్షపాతం చూపిస్తున్నట్టేగదా. "మా యిస్కూలు యానివసరీకి దుమ్ము లేపేసినా" కథల్లో తెలుగురాని ఖదీర్‌ని రమాదేవి టీచరు కిందలు చేసిన పద్ధతీ మనకు నవ్వు తెప్పిస్తుంది. డ్రామా వేసే చాన్స్ కోసం మీసాల సుబ్బరాజు అయ్యవారు దగ్గర 'గబ్బర్‌సింగ్' డైలాగ్ చెప్పినప్పుడు ఖదీర్ ప్రతిభకు మనకళ్లలో కూడా ఆనందపు తడి చేరుతుంది. ఒకే కథలోనే నవ్వు, ఏడుపు, ఆనందం, కళాత్మకతలను మిళితం చేసి చెప్పిన ఈ కథ ఎండాకాలంలో మధ్యతరగతి వారు తాగే ఫ్రూట్ జ్యూస్ లాంటిదని చెప్పకతప్పదు.

**పుస్తకాల గురించి కథ :–** 'ముక్కాలు, ఆఫ్‌రేటు, బజ్జి బజ్జి' అనేది విద్యార్థులకి చిన్నప్పుడు పాఠ్యపుస్తకాల మీద గల ప్రీతిని తెలియజేసే కథ. కొత్త పుస్తకాలను ముక్కు దగ్గరకు తీసుకొని వాసన చూసినంత అనుభూతి కల్గుతుంది. ఈ కథ చదివితే. ఒక పేద విద్యార్థికి కొత్త పుస్తకాల్నే తక్కువ ధరకి దక్కించుకోవాలనే ఆశ పేదరికం వల్లే కల్గుతుందనే అంశాన్ని తెలియబరిచే కథ ఇది. "మా పరమాత్ముడు డ్రాయింగ్ అయ్యోరు" "అబ్బా తిన్నాడు గదరాదెబ్బ" ఈ రెండు కథలు అయ్యవార్ల గురించిన కథలు.

**వృత్తిపనులకు సంబంధించిన కథలు:** వెలివృత్తులెన్నైనా కులవృత్తికి సాటిరావని గువ్వలచెన్న శతకం చెప్తుంది. గుడ్డలమ్మడం, గెనిసిగెడ్డలమ్మడం, పూలమ్మడం, మెకానిక్ వంటి వృత్తుల్లోని జీవితాల్ని నవ్వుతో కలబోసి సమాజానికి సుతిమెత్తని సందేశాల్ని అందించారు. ఖదీర్‌బాబు ఈ రెండు సంపుటాల్లో.

మా ఇళ్లకాడ గెనిసిగెడ్డల సందడి' కథల్లో నిత్యం పూజా కార్యక్రమాల్లో మునిగి తేలుతూ తక్కువ కులస్థులని తాకితే అంటు తగులుతుందని నమ్మే మురళివాళ్ల తాత, గెనిసిగెడ్డలమ్ముకునే పిల్లోడికి తేలుకుడితే ఆ గాయాన్ని నోటితో కొరికి విషపురక్తన్ని పీల్చి అతన్ని బ్రతికించే సన్నివేశం మన హృదయాన్ని తాకుతుంది. ఇక్కడ "అంటు' అంటూ మురళితాత చెప్పినది సమాజంలో తన గౌరవం కోసం. కానీ ఆపదలో అంటుని మరిచి వ్యక్తిని బ్రతికించడమే ఆయన అసలు వ్యక్తిత్వానికి నిదర్శనం.

'మా అమ్మ పూలయాపారం' కథ కవితాత్మకంగా సాగుతుంది. చివరికి పూలు అమ్ముకునే వాళ్ల మానసిక స్థితిని మనముందుంచుతుంది.

".....నిజంగానే కర్మ పట్టుందకా మాకు. మొన్న మా ఇంటాయన శ్రావణమాసం సీజను గదా రెడీమేడ్ దండలు అమ్ముడు పోతాయని అరువులో పూలు తెచ్చినాడు. బేరాలు రాలా... మరుసటి రోజు అమ్ముకునే దానికి అవి కట్టెలు కాదుకదకా. ఏం చేసేది? కట్టిన దండలన్నింటినీ చేతులారా వరవలో పారేసాను" అనే రిహానా మాటలకి మన రెండుకళ్లు చెమ్మగిల్లక తప్పదు.

**బాంధవ్య లోతుల్ని తెల్పే కథలు:** అన్యోన్యం, ఆత్మీయత గల కుటుంబాలే పల్లెకు వెలుగు. అటువంటి పల్లెలే దేశ సమైక్యతకు బాట. అలాంటి దేశమే స్వర్గసీమ. ఆ స్వర్గాన్ని నిర్మించే వారే అమ్మమ్మలు. నాయినమ్మలు, అత్తమ్మలు, తాతయ్యలు. బాంధవ్యం లేకున్నా ఇరుగు పొరుగు వారు కూడా వరసలతో పిలుస్తూ ఈ చట్రంలో ఒదిగి పోయేవారు కూడా లేకపోలేదు. వీళ్ల గురించి ఖదీర్‌బాబు ఏ విధమైన కథలల్లారో చూద్దాం.

అమ్మ: అమ్మ గురించి ఎంతమంది రాసినా రాయవలసిందేదో మిగిలే ఉంటుంది. ఎప్పటి వరకు మిగిలుంటుందంటే... ఈ విశ్వంలో మానవజాతి శకం వున్నంత వరకు, జీవి కొన ఊపిరితో ఉన్నంతవరకు.

ఈ రెండు సంపుటాల్లో చాలా కథల్లో తల్లి పాత్ర ఉన్నా ప్రత్యేకంగా రెండు కథల్లో మాత్రం అమ్మను గురించి రాశారు ఖదీర్. అవి– 'పాపాలన్నీ మాయమ్మకేనంట', 'మా అమ్మ పూలయాపారం'.

కుటుంబ పోషణలో తల్లిపడే బాధను తెలిపే కథే ‘పాపాలన్నీ మాయమ్మకేనంట’. ఇది రంజాన్ నెలలో ముస్లింలు వుండే రోజాలకు (ఒక్కపొద్దులు) సంబంధించిన కథే అయినా, ఇందులో సన్నివేశం మాత్రం పేదల ఇళ్ళల్లో ప్రతి తల్లి పడే బాధను కళ్ళముందుంచుతుంది. భర్త రోజంతా ఎటు తిరిగినా పరవాలేదు. కానీ భార్య మాత్రం సమయానికి వంటచేసి పెట్టాల్సిందే. ఐతే వంట చేయడంలో ఆడవారు ఎన్ని తిప్పలు పడ్తారో ఈ వాక్యాలు చెప్తాయి.

“..... నీకు సలాం పెడతా నాయినా! ఆ మాట వదిలిపెట్టు. నీకేమీ... రోజూ తెల్లారి లేచి కూటికీ నీళ్లకీ అయిదు రూపాయిలిస్తే యిస్తావు. లాకుంటే లా. నేను కదా అప్పో సప్పో చేసి, శెట్టికి యిప్పుడిస్తా అప్పుడిస్తానని అబద్దాలు చెప్పి టయానికి అన్నం దబరని దించి పెట్టాల్సింది.... అంతెందుకా? యీ నెల రోజుల్లో యీ మామిడికాయలు నూక్కుండా మనింట్లో పచ్చడి చెయ్యడం నావల్ల కాదంటే నావల్ల కాదే...” ఇలా మనదేశంలో బాధలుపడే తల్లులు ఎంతమంది లేరూ! అలాంటి తల్లి హృదయాలన్నీ ఈ కథలో మనకు కన్పిస్తాయి.

> ***ఖదీర్‌బాబు రాసిన “మంచుకన్న తెల్లనైన మనసులున్నదెవరికి” అనే కథ చదివితే బాల్యంలో అచ్చం మనం పొందిన అనుభూతినే యథాతథంగా రాసాడేమోననిపిస్తుంది బడిలో పాటలపోటీల సందర్భాన్ని గుర్తుచేసిన కథ ఇది.***

అమ్మ గురించి ఖదీర్‌బాబు చెప్పిన మరో కథ “మా అమ్మ పూలయాపారం’. ఈ రెండు సంపుటాల్లో కలిసి ఇదే పెద్ద కథ. తల్లిని దైవసమానురాలుగా చెప్పిన కథ ఇది. సన్నజాజి చెట్టును ఆమె తన మరో సంతానంగా భావిస్తున్నట్టు రచయిత చెప్పడం ఓ మధురమైన భావుకత. ప్రకృతికి మనిషి ఎందుకు రుణపడాలో చెప్పేకథ. ఒక కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సన్నజాజి చెట్టు ఎంతగా తనపూల ద్వారా సహకరించిందో తెల్పిన కథ.

“మా దాదీమా వాళ్ల నానమ్మ నడుమ బామ్మ’ కథ ద్వారా బామ్మలు, నానమ్మల వల్ల కుటుంబానికెంత రక్షణగా, ఉపయోగకరంగా ఉంటుందో తెలుస్తోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో వృద్ధ శరణాలయాలు పెరిగిపోతున్న వ్యవస్థకు చెంపదెబ్బ లాంటి హెచ్చరిక ఈ కథ.

తన చదువాపేసి తండ్రికి చేదోడువాదోడుగా సాయపడే పెద్దకొడుకు కథే ‘మా అన్నేగాని చదివుంటే’. ఒక కుటుంబం ఎదగాలంటే ఎవరో ఒకరు త్యాగానికి సిద్ధపడే మన సంస్కృతిని తెలిపే కథ ఇది. అత్త గురించి చెప్పిన కథే ‘మా జరీనాంటీ స్పెషలు సెలవుల కత’. తాగుడికి బానిసైన భర్తవల్ల భార్య, ఆమె కుటుంబం ఎలాంటి దారిద్ర్యంలోకి నెట్టబడుతుందో వివరించిన కథ ఇది. యిలా బంధువులు- ఇరుగుపొరుగు వాళ్ల గురించి మన హృదయాల్ని కదిలించేలా కథలల్లారు ఖదీర్.

**సంస్కృతీ సంప్రదాయాల గురించిన కథలు:** ఖదీర్ ఒక ప్రత్యేక సంప్రదాయ కుటుంబం నుండి వచ్చాడు. అందుకే ఆయన కథల్లో తన వారి సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన అంశాలనే ఎక్కువగా చర్చించాడు. కొన్నింటిని సున్నితంగా విమర్శించాడు. అట్లని తన భావాలన్నీ వాస్తవమని చెప్పే ప్రయత్నం చేయలేదు.

**పండుగలకు సంబంధించిన కథలు:** ఖదీర్ కథల్లో వర్ణించిన పండుగలన్నీ నెల్లూరు జిల్లాలోని ముస్లిం జీవితంతో పెనవేసుకొన్నవే. రంజాన్, పీర్ల పండుగ, రొట్టెల పండుగల గురించి ఖదీర్‌బాబు రాసిన కథలు మళ్లీ మళ్లీ చదివిస్తాయి. యేటా నెల్లూరులో జరిగే రొట్టెల పండుగలో రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ ముస్లిం భేదం లేకుండా అన్నిమతాల వారు తరలి వస్తారు. “మతాలు వేరైనా పరమాత్ముడొక్కడే” అనే సూక్తి “దర్గామిట్టలో రొట్టెల పండుగ తీరు” కథాంతరార్థం.

ముస్లింలు జరుపుకునే ప్రత్యేక పండుగ ‘పీర్ల పండుగ’. సావిడిలో పీర్లు పెట్టడం, కణకణమండే నిప్పుల మీద నడవడం (గుండం తొక్కడం), పులి, ఎద్దువేషాలు వేయడం, సాముగరిడీలు ఆడడం వంటి జానపద కళలకు ఆటపట్టైన ఈ పండుగ అన్ని మతాల వారిని ఆకట్టుకుంటుంది.

అలాంటి సర్వజన సమ్మేళనంతో జరుపుకునే పీర్లపండుగ ఈ రోజుల్లో అంతరించి పోయిందనే ఆర్ద్రతతో ఖదీర్‌బాబు రాసిన కథే ‘చోంగా బుత్తీ షక్కర్ షర్బత్’.

‘కసాబ్ గల్లీలో సేమ్యాల ముగ్గు’ - రంజాన్ పండుగలో ప్రతి ముస్లిం ఇంట్లో సేమ్యాలు అల్లే విధానాన్ని వర్ణించిన కథ.

“ఎప్పుడూ నమాజు చేయని ఆడోళ్లు కూడా అయిదు పూటలా నమాజు చేస్తా... వీధిలోకి సోడా బండ్లొస్తే సోడాలు తాగుతా.... తియ్యటి వాసనల మల్లెపూల బుట్టలొస్తే గీచిగీచి బేరాలు చేస్తా. పిల్లకాయల మందరం కరెంటు స్తంభాల కింద ఆడుకుంటా.... ఆ నెలంతా మా వీధిలో పగలూ రాత్రికి తేడాలా” అని సహజంగా వర్ణించాడు ఖదీర్.

**సాంస్కృతిక కార్యక్రమాలకు చెందిన కథలు:** కథకులెందరో ఆట, పాట, సినిమా, ప్రార్థన, విహారయాత్ర, వీడ్కోలు సమావేశం వంటి కథలు రాసారు కానీ ఖదీర్‌బాబు రాసిన “మంచుకన్న తెల్లనైన మనసులున్నదెవరికి” అనే కథ చదివితే బాల్యంలో అచ్చం మనం పొందిన అనుభూతినే యథాతథంగా రాసాడేమోననిపిస్తుంది బడిలో పాటలపోటీల సందర్భాన్ని గుర్తుచేసిన కథ ఇది. పాటలపోటీల్లో ఆనవాయితీగా అయ్యవార్ల పిల్లలకే వచ్చే బహుమతుల్ని. ఇతర పిల్లలు తెలివిగా ఎటువంటి పాటలు పాడి బహుమతి

## నివాళి

# అణచివేతలను ఎదిరించిన స్వరం



మల్లాది సుబ్బమ్మ 1924, ఆగస్టు 2వ తేదీన గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పోతార్లంకలో జన్మించారు. బాపట్ల వాస్తవ్యులైన మల్లాది వెంకట రామమూర్తిని వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు సంతానం. 1992లో సంపూర్ణ మద్య నిషేధ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. కుల తత్వానికి, ఛాందస భావాలకు వ్యతిరేకంగా, మూఢవిశ్వాసాల నిర్మూలనకు, కుటుంబ నియంత్రణ, స్త్రీ విద్య కోసం ఆమె కృషి చేశారు.

బాపట్లలో ఐదేళ్ల స్త్రీ హితైషిణి మండలి కార్యదర్శిగా, బాలికా పాఠశాలకు మేనేజర్‌గా, శారదా మహిళా విజ్ఞాన సమితికి అధ్యక్షురాలిగా పనిచేశారు. ఫిలిం సొసైటీకి ఛైర్మన్ అయ్యారు. 1978లో లండన్‌లో జరిగిన ప్రపంచ హ్యూమనిస్టు సభల్లో పాల్గొన్నారు. 1980లో మహిళాభ్యుదయం అనే సంస్థను స్థాపించారు. అభ్యుదయ వివాహ వేదిక ద్వారా అతి తక్కువ ఖర్చుతో రెండు దండలు, రెండు ఫొటోలతో ఆదర్శ వివాహాలు జరిపించారు. మహిళాభ్యుదయ గ్రంథాలయం, కుటుంబ సలహా కేంద్రం, స్త్రీ విమోచన శిక్షణ కేంద్రం, వరకట్న హింసల దర్యాప్తు సంఘం, స్త్రీల హక్కుల పరిరక్షణ కేంద్రం, శ్రామిక మహిళా సేవ, మల్లాది సుబ్బమ్మ ట్రస్ట్ ద్వారా మహిళలకు సేవ చేశారు. మహిళాభ్యుదయ పురస్కారం నెలకొల్పారు. 1979 నుంచీ ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘానికీ, 1989 నుంచీ అఖిలభారత హేతువాద సంఘానికీ ఉపాధ్యక్షులుగా ఉన్నారు. మల్లాది సుబ్బమ్మ మహిళా ఒకేషనల్ జూనియర్ కళాశాలను 2000లో ప్రారంభించారు. ఆమె తన యావదాస్తిని "మల్లాది సుబ్బమ్మ ట్రస్టు" కి రిజిష్టరు చేశారు. ఆమె చేసిన సంఘసేవకు ఎం.ఎ.థామస్ జాతీయ మానవహక్కుల అవార్డు లభించింది.

1970లో విజయవాడలో "వికాసం" అనే పత్రిక నడిపారు. తర్వాత "స్త్రీ స్వేచ్ఛ" అనే మాసపత్రికకు సంపాదకురాలిగా ఉన్నారు. 80కి పైగా రచనలు చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లో మహిళా ఉద్యమం-మహిళా సంఘాలు 1960-1993" అనే పుస్తకం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ గ్రంథం అవార్డు పొందింది. "వైవాహిక కుటుంబ సలహా", "వ్యభిచారం ఎవరి నేరం?", "ఇస్లాం-స్త్రీలు", "క్రైస్తవం-స్త్రీలు", "హైందవం-స్త్రీలు", "ప్రేమ-సెక్స్", "హేతువాదం", "ఈ దేశం నాదేనా?", "మూఢనమ్మకాలు నశించేదెలా?", "వివాహం నేడు-రేపు", "మాతృత్వానికి మరో ముడి", "మానవహక్కులు-మహిళల హక్కులు" తదితర పుస్తకాల్ని ఆమె రచించారు.ఆమె ఈ నెల 15న తుదిశ్వాస విడిచారు. జీవితాంతం అవిశ్రాంత పోరుసలిపిన యోధురాలు మల్లాది సుబ్బమ్మకు సాహితీస్రవంతి, ప్రస్థానం తరపున నివాళి అర్పిస్తున్నాం.

---

పొందవచ్చో వివరించిన కథ ఇది.

తెలివిగా బడి మానేసి సినిమాకి ఎలా వెళ్ళాలో తెలిపే కథ "జయక్రిష్ణాహాలుకి జయము జయము" చదువుకునే రోజుల్లో సినిమాలు కూడా తెలివిని పెంచుతాయని చెప్పినకథ ఇది. అంతేకాక ఊరుబయట సినిమాహాలు నిర్మించి దివాలా తీసిన ఐటిఐ కృష్ణమూర్తి కథను కూడా లోకానికి చెబుతుందీ కథ.

బడిరోజుల్లో విద్యార్థులకు విహారయాత్ర అమితానందాన్ని కల్గించడమే కాదు, అపారమైన జ్ఞానాన్నిస్తుందని తెలిపే కథ "మా ఎస్కర్షన్ టూరప్పుడు". అందుకే గిజూబాయి, జిడ్డుకృష్ణమూర్తి విద్యావేత్తలు బోధనా విధానంలో విహారయాత్రలకి ప్రాధాన్యం ఇచ్చారు.

'ఫేర్‌వెల్ పార్టీలో కొటేషన్లు అదుర్స్', "మా పరమాత్ముడు డ్రాయింగ్ ఐవోరు" వంటి కథలు చదివినప్పుడు పాఠకులు తమబాల్యంలోకి వెళ్ళివిహరించక తప్పదు.

అయితే 'దర్గామిట్టకతలు' అనే పేరు చూడగానే పాఠకులు ఇవి 'దర్గామిట్ట' ప్రాంతపు కథలేమో అని భ్రమపడే అవకాశముంది. నెల్లూరు నగరంలో ఎక్కువగా ముస్లింలు నివసించే ఒక ప్రాంతం 'దర్గామిట్ట'. "దర్గామిట్టలో రొట్టెల పండుగ తీరు" తప్ప ఈ సంపుటిలోని కథలన్నీ 'కావలి' పట్టణంతో ముడిపడిన కథలే. వీటికి రచయిత 'దర్గామిట్ట' పేరు పెట్టడం కేవలం ప్రతీక (సింబాలిక్) మాత్రమే.

అలాగే 'పోలేరమ్మబండ కథలు' అనే శీర్షికను చదవగానే.... ఇవేదో పోలేరమ్మ బండకు చెందిన కథలేమో అని పాఠకుడు ఆలోచన సాగించవచ్చు. వాస్తవానికి ఈ సంపుటిలో 'పోలేరమ్మబండ' ను గురించి గానీ, పోలేరమ్మ దేవత గురించిగానీ ఒక కథ కూడాలేదు.

కావలి విష్ణాలయం వీధికి కొంచెం తూర్పున నాలుగురోడ్ల కూడలిలో పోలేరమ్మబండ ఉంది. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎన్నో హిందూ ముస్లిం కుటుంబాలు పెనవేసుకుని జీవిస్తున్నాయి. అందుకని తన కథా సంపుటానికి 'పోలేరమ్మబండ' ను ప్రతీకగా తీసుకున్నాడు రచయిత.

'దర్గామిట్టకతలు' ఒక ముస్లిం కుటుంబంతో ఆత్మీయంగా అల్లుకున్న ఇరుగుపొరుగు వాళ్ల కథలు. 'పోలేరమ్మబండకథలు' నలుగురి స్నేహితుల మధ్య జరిగిన బాల్య జీవితం.అయినా ఈ రెండు సంపుటాల్లో సామాజిక చిత్రణ, సాంఘిక పరమైన ఆలోచన, సమాజం పోకడలు ప్రతిబింబిస్తున్నాయి. మన సంస్కృతి సంప్రదాయాలు ముస్లింలలో ఎలా చోటు చేసుకుని ఉన్నాయో అర్థమవుతోంది.

## పరిశీలన




# ఒక ధిక్కార స్వరం నిచ్చెన మెట్ల లోలకం !

డా॥ రాధేయ

*9985171411*

ఇవాళ తెలుగు కవిత్వం చారిత్రక మలుపు తిరుగుతోందనేది వాస్తవం. ఎవ్వరినీ బాధ పెట్టకుండా, ఏ సమూహాన్నీ ప్రేమించకుండా కన్పించని శత్రువుతో ఘర్షణ పడడం, వర్తమాన కవికి అసాధ్యం కూడా. ఏ సమాజంలో జీవిస్తున్న రచయితైనా తనదైన దృక్పథంతో, భావజాలంతో రచన చేస్తాడు. అతడు తీసుకునే వస్తువునూ, భావజాలాన్నిబట్టి ఆ రచనాతత్వం మనకు ఇట్టే తెలిసిపోతుంది. మానవుణ్ణి కేంద్రబిందువుగా తీసుకొని అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిచ్చే దిశలో సామాజిక వాస్తవిక దృష్టితో సాగిపోయేదే ఆధునిక కవిత్వం. సాహిత్య సృజన ఒక బాధ్యతాయుతమైన, సామాజిక ప్రయోజనానికి సాధనంగా ఉపయోగపడాలన్నది బహుజన సాహిత్య లక్ష్యంగా నిర్దేశిస్తుంది. చాతుర్వర్ణ వ్యవస్థ ప్రకారం అన్ని వృత్తులూ సమానమైన గౌరవాన్ని పొందాలే తప్ప కొన్ని వృత్తులకు ఉన్నతమైన గౌరవం, మరికొన్నింటికి నీచత్వం ఉండకూడదని ఈ వాదం తెల్పుతుంది.

ఇవాల్టి కవి, అందులోనూ రాయలసీమ కవి, ఇంకా చెప్పాలంటే కరువులతోనూ, కన్నీళ్ళతోనూ, వలసలతోనూ అంటకాగుతున్న 'అనంత' కవి జోలిలోని అరిగిపోయి, శిధిలమైన పనిముట్లు తప్ప అనుభూతుల, సౌందర్య సాధనాలు ఉండవు.

అనంతపురం ఆత్మను మునివేళ్ళతో ముట్టుకొని చూడాలన్నా, అనంత ప్రజల అంతర్‌బహిర జీవన సంఘర్షణను వినాలన్నా జూపల్లి ప్రేమ్‌చంద్ కవిత్వం 'నిచ్చెనమెట్ల లోలకం' లోనే సాధ్యమౌతుంది.

ప్రేమచంద్ ప్రతిభావంతుడైన అనంతకవి. 1999 లోనే తన మొదటి కవితా సంపుటికి 'అవేద' కు ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డును సాధించాడు. ఈ అవార్డు పొందిన వారంతా అగ్రశ్రేణి కవులుగా ప్రతిష్ఠ పొందిన వారే. ఇప్పటివరకు ఈ అవార్డును పొందిన 25 మంది కవుల్లో రాయలసీమకు చెందినవారు ఇద్దరే ఇద్దరు. ఒకరు సౌభాగ్య, మరొకరు జూపల్లి ప్రేమ్‌చంద్. అవేద కవిత్వం ద్వారా దళిత తాత్త్విక నేపథ్యంతో ధిక్కార స్వరం విన్పించారు. మళ్ళీ పదమూడేళ్ళ తర్వాత 'నిచ్చెనమెట్ల లోలకం' ద్వారా మనముందు కొస్తున్నారు. ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉన్నారు ? మౌనంగా లేరు అనేక అస్థిత్వ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటూనే వున్నాడు. తన స్వరం విన్పిస్తూనే ఉన్నారు కాబట్టి అవి మౌనం అనేకంటే పదునెక్కడమనే నా భావన.

''గాయాలు చిట్లిన నిశ్శబ్దంలో / నేనూ గాయాన్నైపోయాను.

కవిత్వమా నన్ను చూపించవూ / నా ఉనికి చూపించవూ?"

– అంటూ కవిత్వాన్ని వేడుకుంటున్నాడు.

నన్ను అణగారిన కులంగా చేసిన / నిచ్చెన మెట్ల లోలకం ఈ నిచ్చెన మెట్లను కూల్చేసే రస్తానవుతాను / నా దేహమ్మీద అణగారిన ఆర్తులంతా సాగిపోండి! అంటూ దళిత, బహుజన ఆర్తులకు ఆత్మవిశ్వాసాన్ని హామీగా ఇస్తున్నాడు. పుట్టిన రోజునే పాడెను సిద్ధం చేద్దాం రండని పిలుపునిస్తున్నాడు.

మనిషి సాటి మనిషిని అంటరాని వాడిగా మార్చితే
అంటరానివాడిగా మార్చినవాడే అంటరానివాడని
ప్రకటించడం ఇవాళ కొత్త కాదు....
అంతేకాదు ఇప్పుడు మా చూపుడు వేళ్ళన్నీ నీవైపు

ఎక్కుపెట్టిన బాణాలే. అందుకోసం సమైక్యశక్తితో కదను తొక్కమని పిలుపునిస్తున్నారు కవి.

ఇవాళ నా పుట్టినరోజు అంతేకాదు నేను చచ్చిన రోజు కూడా నేనెందుకు పుట్టాను. ఎవరు నన్ను నివురు గప్పిన నిప్పును చేశారు. రగులుతున్న అగ్నిగుండంలోంచీ కణకణమండే సరికొత్త ఆయుధంలా నా వారంతా రూపొందాలి. అప్పటివరకూ ఓ జీవితకాలం నా పుట్టిన రోజు వాయిదా వేస్తున్నానంటూ తన ఆత్మగౌరవాన్ని జెండాగా ఎగురవేస్తున్నాడు కవి.

ఇప్పుడు నిన్ను నన్నూ వేధించేవాడు కనిపించని శత్రువు అరచేతిలో స్వర్గాన్ని చూపించే ప్రపంచీకరణ, సుతారంగా కొల్లగొట్టి దొల్లతనాన్ని మిగిల్చే సరళీకరణ. చాపకింద నీరులా ఈ దాడిని ఎలా ఎదుర్కోవాలి?



జూపల్లి ప్రేమ్‌చంద్

ఇప్పుడు నిన్ను వేధిస్తున్న ఒకే ఒక ప్రశ్న
డాలర్ చెట్టుకు ఉరివేసుకోవడమా?
కూకటి వేళ్ళతో పెకలించటమా?
నేడు ప్రపంచమంతా ఒక పల్లెటూరు
మార్షల్ మాక్ లూహన్"

శభాష్ సద్దాం అంటూ సద్దాం వీరత్వాన్ని కీర్తిస్తాడు

"తలను తాకట్టుపెట్టి ఏజాతీయ జెండా తలవంచదు
శభాష్ సద్దాం"

'కడాకు' కవితలో అనంత మాండలికాన్ని అక్షరబద్ధం చేశాడు కవి. ఈ కవితలో అనంత జనజీవన విషాదకర దృశ్యాల్ని మనముందు పరిచాడు.

"ఏమప్పా /యాపొద్దునా / ఉగాదులూ, పొద్దు పాడుపులూ చూసిందామా / బతుకంతా బందెల దొడ్డికదరా / ఊరంతా వల్లకాడేగదా/ తినేసి తిండిగింజలే కరువాయే / కడకు అర్ధాకలితో గదా సస్తాందాము / కడుపు నిండుకూ కూడు తినిందే దెబ్బుదు/"

అనంతపురానికి సాగునీరు తాగునీరూ కావాలి. అందుకోసం రాజకీయ నాయకులను నిలదీయమంటాడు కవి. అంతేకాదు పుస్తకాన్ని అమృతభాండమన్నారు. పుస్తకపఠనాన్ని మర్చిపోవద్దు పుస్తకమంటే అమ్మ చిటికెన వేలు అంటూనే...

జీవితం ప్రతి మలుపుతో నిలబడి దిగంతాలకు
చాచిన హస్తాల్తో పుస్తకాన్నందుకో
కలలు కనటం మానొద్దు
పుస్తకప్రపంచం ముందు వినమ్రంగా మోకరిల్లు
దిశా నిర్దేశం చేస్తుంది
జీవితాన్ని అర్థవంతం చేస్తుంది

రైతులవైపు నిలబడి వారికి బతుకు పట్ల భరోసా నింపుతాడు. వారి చెమట చుక్కల ముందు దోసిలివొగ్గి, ఆర్తిగా ఆవేదన చెందుతాడు కవి.

'వాళ్ళు పుట్టుకతో దిగంబరులు
ఊర్లిడిసి, జిల్లాలిడిసి
నగరాలకు వలసపట్టిన
రెక్కలు తెగిన పక్షులు
ఔను / వాళ్ళు ఇప్పుడు మురికివాడలు
నగరాలు మింగుతున్న పల్లెటూళ్ళ
దేశమంతటా విస్తరిస్తున్న ఎడారులు"

ఒకానొక అజ్ఞాత రైతు ఎలా వుంటాడు? మోడువారని ఎండుటాకులా వుంటాడు. తన శిరస్సును అర్థాంతరంగా తనను తాను నేల తల్లికి అర్పించుకుంటాడు. అనంతజిల్లా జీవితమంతా శిధిలవసంతమే, ఇక్కడి కోటలు, దుర్గాలు, ఒకనాటి పాలెగాండ్ల నెత్తుటి కేకలు ఇక్కడ ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులుసైతం కుంభకర్ణుడిలా నిద్రలేవవు.

"నన్ను నేను ఒలుచుకు తినటానికి
గూటి బయటకు తోవచూపరా గువ్వలచెన్నా"

అంటూ నిరసనతో కూడిన వ్యంగ్యాన్ని ప్రదర్శిస్తాడు కవి.

ఓ బీజం నేల రాలితే మట్టి పరవశిస్తుంది మరో మొక్కకు జన్మనిస్తుంది. పునరపి జననం పునరపి మరణం జీవితం అంటూ

"అణువంత బీజంలో మహావృక్షం నిక్షిప్తమైనట్టు
బోధి వృక్షం నీడలోనే జ్ఞానోదయం"

జ్ఞానోదయ మార్గానికి బౌద్ధ ధర్మాన్ని వేదికగా నిలుపుతాడు కవి. చెట్టుకవి ఇస్మాయిల్‌ను స్మరిస్తాడు. "నిచ్చెనమెట్ల లోలకం"లో కవి జూపల్లి ప్రేమ్‌చంద్ సమాజంలో ఒక మనిషిగా, సామాజిక బాధ్యత గల ఒక కవిగా వర్గాలుగా, వర్ణాలుగా చీలి వున్న వ్యవస్థలో 'ధిక్కారస్వరం' విన్పిస్తున్నాడు. తనదైన ఉనికినీ తాత్త్వికతను మర్చిపోలేదు. అందుకే ఒక్కోచోట ప్రేమమూర్తిగానూ, మరోచోట భావోద్రేకంగాను, మనకు కనిపిస్తాడు. ఒక్కోసారి ఈ కవిత్వం సాదా సీదా వచనంలా కన్పించినా భావోద్వేగం పతాకస్థాయిలో గర్జిస్తుంది. మొత్తంమీద ఈ కవిత్వం 'అంతర్మధనం' లోంచి దుఃఖ తీవ్రత మనకు స్పష్టంగా అగుపిస్తుంది. ఈ నిరంతరాన్వేషణతోనే ముందుకు సాగాలని, ప్రేమ్‌చంద్‌ను మనసారా అభినందిస్తున్నాను.

# ఫిల్మోత్సవ్

హిందీ: గుల్జార్
తెలుగు: డాక్టర్ దేవరాజు మహారాజు
9908633949



ఉత్సవం ఇది ఎంతో విశిష్టమైంది
ఎంతో విభిన్నమైంది.
తమను తామే ఆహ్వానించుకుని
తమను తామే అభినందించుకుని
సూర్యుడూ భూమి తామే అయిపోయి
తమ చుట్టు తామే తిరుగుతూ
ఎన్నుకున్న కేంద్రం చుట్టూ తిరుగుతూ
ఎవరికి వారు తమలో తాము
ఒక పూర్తి సౌరకుటుంబాన్ని ఇముడ్చుకున్న
ఉత్సవం ఇది- ఎంతో విభిన్నమైంది!
అంతరద్దీలో తమకు తాము సుస్వాగత గీతాలు
ఎలా పాడుకుంటారూ?
70 యం.యం ప్రముఖులు
రెక్కలు కట్టుకుని వచ్చి వాలే 8 యం.యం పక్షులు
అందరూ ఠీవిగా మునివేళ్ళ మీద నడుస్తారు
ఎదిగామనుకున్న రెండుమూడు అంగుళాలకే
మహోన్నత శిఖరాలను చేరినట్టు మురుస్తారు
రంగురంగుల వెలుగులు కళ్ళలో నింపుకుని
ఒక్కొక్కరు ఒక్కో చిత్రం వైపు మొగ్గుతుంటారు
సోడా గ్లాసు కళ్ళాద్దాలేసుకుని
వెలుగు నీడల్ని ఏరుకుంటూ కూర్చుంటారు
ఒక బొమిక విరిగిన చప్పుడో
ఒక రక్తం చుక్క జారిన చప్పుడో విని,
ఉద్వేగంతో ఆనందోత్సాహాలు వెల్లడిస్తారు.
దర్జీవాడి కత్తెర్లు రెండు దగ్గరుంచుకుని
పత్రికల వాళ్ళు శీర్షికల డిజైన్లని
అందంగా 'ట్రిమ్' చేసుకుంటారు
కాఫీ హౌజుల్లో కప్పులన్నీ చలన చిత్రాల చర్చతో
గొప్ప గందర గోళం చేస్తాయి
పండగలో రోజులు వారాలేకాదు
పండగలో పండగలే గడిచిపోతాయి
అప్పుడు అందరూమేల్కొని
కళ్ళు నలుపుకుంటారు
ఏమైంది?
ఏమైందో తేలకుండానే ఫిల్మోత్సవం అయిపోతుంది
ఉత్సవం ఇది విశిష్టమైంది! విభిన్నమైంది!!

***(కవి, చలనచిత్ర దర్శకులు గుల్జార్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం లభించిన సందర్భంగా)***

---

# చీమలు

- ఆచార్య పసుల వెంకటరెడ్డి
9966884047



చీమల పుట్ట శ్రమ జీవుల సమాహారం
అసాధారణ శ్రమశక్తికి ప్రతీకలు
అవి ఎప్పుడూ ఓటమిని అంగీకరించవు
ఎల్లవేళలా శ్రమపై ఆరాధనా భావమే
చీమల తత్వరహస్యం
కర్తవ్య పరాయణత్వమే
ఎన్ని అవరోధాలు ఎదురైనా
నిశ్చేతన్యంగా నిలిచి ఆలోచించవు
నిస్పృహతో చతికిల పడవు
ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తూ
క్రింద మీద చుట్టూరా తిరిగైనా
నిర్ధిష్ట గమ్యం చేరుకొంటాయి
ఎండాకాలమైనా చలికాలమైనా
కాలచక్రంలో కష్టసుఖాల్లా
వస్తూపోతుంటాయని చీమలకు తెలుసు
ముందుచూపుతో కాలాన్ని ఆకళింపు చేసుకొంటాయి
సూర్యకిరణాలు సోకితే చాలు
బిలబిల మంటూ ఉత్సాహంగా బయటికి వస్తాయి
చేతనైనంత ఆహారాన్ని సేకరిస్తాయి
ఆహారం కొరకు అత్యుత్సాహంతో
పరుగులు తీసే చీమలబారులు
కష్టపడి సేకరించిన ఆహారంతో
ఎదురొచ్చే చీమలబారులు ప్రక్క ప్రక్కనే ఉంటాయి
అక్కడ రణగొణ ధ్వనులు ఉండవు
చీమలు నడక వేగాన్ని నియంత్రించుకొంటాయి
చీమలు అల్పజీవులు కావు
వాటి ప్రజ్ఞాసక్తి అవగతమైతే
అవి మారే పరిస్థితులకు అనుగుణంగా
సర్వోత్కృష్ట పరిష్కారాలను గుర్తిస్తాయి
మనిషి మేధో సంపత్తికి స్ఫూర్తిదాయకంగా
సంక్లిష్ట కంప్యూటర్ సమస్యలకు
చిక్కుముడులు విప్పుతాయి

విశ్లేషణ

# అభినవ సినీకవి సుద్దాల అశోక్‌తేజ



- డా॥ ద్వానా శాస్త్రి
9849293376

***ఇతను మరొక శ్రీశ్రీ. మరొక శబ్ద బ్రహ్మ. ఇతనికీ శబ్దాలు పరుగెత్తుకుంటూ వస్తాయి. ఎటువంటి భావాన్ని అయినా బలంగా వ్యక్తీకరించే శిల్పం ఈయన సొత్తు. ప్రజల నాడిని బట్టి పాటలు రాయడం సహజమే. కానీ ఈ సుద్దాల భాష నాడిని పట్టుకొని పాట రాస్తాడు. అదీ విశిష్టత! మాటలకు పరువూ బరువూ ఉంటాయన్న శ్రీ శ్రీ కి పాటల రచనలో అచ్చమైన అనుయాయుడు అయితే శ్రీశ్రీ తో ఆగిపోలేదు సుమా! సమకాలీనతతో తన పాటల తోటను సృష్టించుకొన్నాడు.***

సుద్దాల అశోక్ తేజ. ఈ పేరే స్పందన కలిగిస్తుంది. ఉత్తేజపరుస్తుంది. అనురాగాన్ని పెంచుతుంది. వినయాన్ని నేర్పుతుంది. సుద్దాల అశోక్‌తేజ. నిజమే, ఇతను మరొక శ్రీశ్రీ. మరొక శబ్ద బ్రహ్మ. ఇతనికీ శబ్దాలు పరుగెత్తుకుంటూ వస్తాయి. ఎటువంటి భావాన్ని అయినా బలంగా వ్యక్తీకరించే శిల్పం ఈయన సొత్తు. ప్రజల నాడిని బట్టి పాటలు రాయడం సహజమే. కానీ ఈ సుద్దాల భాష నాడిని పట్టుకొని పాట రాస్తాడు. అదీ విశిష్టత! మాటలకు పరువూ బరువూ ఉంటాయన్న శ్రీ శ్రీ కి పాటల రచనలో అచ్చమైన అనుయాయుడు అయితే శ్రీ శ్రీ తో ఆగిపోలేదు సుమా! సమకాలీనతతో తన పాటల తోటను సృష్టించుకొన్నాడు. అదీ విలక్షణత "అశోక్ తేజకు కవిత్వం మట్టివాసల నుంచి, తండ్రి హనుమంతు నుంచి అనువంశికంగా అబ్బినవిద్య. తెలంగాణా జానపద మాండలీక సాహితీసొబగులకు, సౌందర్యానికి తన గీతాల ద్వారా ప్రాచుర్యం కలిగిస్తున్నారు. సందర్భ, సన్నివేశ, కథాగమన, పాత్రలను బట్టి గీతం వ్రాస్తే అది పది కాలాలపాటు బ్రతుకుతుందని నిరూపించిన వారుగా 'సినీ విజ్ఞాన విశారద' ఎస్వీ రామారావు పలకటం వాస్తవమే.

సుద్దాల అశోక్‌తేజ 'నెమలి కన్నోడు'! నెమలికన్ను ఎంత అందమైనది! మరెంత స్మృతిసుగంధం గలది! ఆబాల గోపాలన్ని అలరించే వైవిధ్యం, వైశిష్ట్యం గలది. అశోక్ సినీ కవిత్వమూ అంతే- ఆధ్యాత్మికత, శృంగారం, ప్రగతిశీలం, అనురాగం, అనుబంధం, విప్లవం- ఇవన్నీ కలిస్తే అశోక్ తేజ సినీకలం- సంస్కృతం, తెలుగు, అచ్చ తెలుగు, మాండలికం, తెలంగాణ తెలుగు, జానపదుల తెలుగు - ఇవన్నీ కలిస్తే అశోక్‌తేజ సినీగళం. ఎలా వచ్చింది ఈ బహుముఖీనత? శబ్దాలతో 'చెడుగుడు" ఆడుకుంటాడు కాబట్టి భావాలతో 'కబడ్డీ' ఆడుకుంటాడు కాబట్టి. బతుకమ్మ ఆటుపోటు తెలుసు కాబట్టి, అక్షరాన్ని ఆరాధిస్తాడు కాబట్టి

"పక్కన నువ్వుంటే - నాకు రెక్కలు ఉన్నట్టే
రెక్కలు నాకుంటే - నేను సుక్కలో ఉన్నట్టే"
(ఝుమ్మంది నాదం)

భావ కవిత్వం ఛాయలు గల పంక్తులివి. అనురాగాన్ని బాగా ఆకాంక్షించే వారి అంతరంగం ఇలాగే వుంటుంది. సుద్దాల రకరకాల మొగుళ్ళని సృష్టించాడు. అన్నమయ్య కొండవిష్ణు పాదం వంటి వాటిని నోరారా కీర్తిస్తే, అశోక్‌తేజ మన మొగుడు"ల్ని వైవిధ్యభరితంగా చూపించాడు-

"ఏ దొంగ మొగుడు - మొండి మొగుడు- మోటుమొగుడో
మాయమొగుడు - మంకుమొగుడు-పిరికిమొగుడో
మాటల్తోనె మత్తెక్కిచ్చే మాయమొగుడహో"

అంటూ పద్నాలుగు రకాల మొగుళ్ళని కనుక్కొన్నాడు. ఎంతటి పరిశీలన ఉండాలి ఇలా రాయటానికి! ఉపమానాలు వెయ్యడంలో దేశికవి అశోక్‌తేజ-

"పచ్చెన్న ముద్దరా సొగసు"
"కంది పువ్వోలె నవ్వు"
"నేరేడు పళ్లూ నీ నీలాల కళ్లు"/ "తెలుగింటి తులసివమ్మా"/ "కాగితం పడవల్లే ఏమై పోతావూ"

## కవిత

# అస్థిమితంగా మనిషి

- నూతలపాటి వెంకటరత్న శర్మ
9866376050



నిత్యం ఆందోళనల మధ్యన
లెక్కలేనన్ని గడబిడలతో
అస్థిమితంగా మనిషి
నిరంతరం తిరిగే భూగోళంలా!

వేళగాని వేళ
నాలుగు నల్లమబ్బులు
పంటచేల మీద దాడి చేస్తుంటే
పల్లె మనసులో గుబులు మొదలై
స్థిమితం లేకుండా చేస్తుంది
చేతికందివచ్చిన పంట
నోటిదాకా రాదేమోనని!

ఒకరోజు బంద్ పిలుపుకి
జన సంచారం స్తంభించి
రోడ్లన్నీ ఒంటరిగా బిక్కుబిక్కు మంటుంటే

జన జీవనం అస్తవ్యస్తమై
బ్రతుకు భద్రతపై
దిగులు ఛాయలు కమ్ముకుని
స్థిమితం లేకుండా చేస్తయ్
రేపటి బ్రతుకు చిత్రం
కళ్ళముందు అస్పష్టంగా కనపడుతూ!

అనుకున్నది అనుకున్నట్టు జరిగితే
మనిషి ఎవరిని మాత్రం లెక్కచేస్తాడు?
ఊహల్లో కలలు కనడం
గాలిమేడలు కట్టటం
వాస్తవంలో జీవించటం
అందుకే అస్థిమితంగా మనిషి!

---

"రాజు భాయ్" సినిమాలో ఎన్నో రకాల చేపల్ని చూపించి" కొర్రామీను సొరా సేపల కళ్యాణం" అంటూ రాసిన పాట సుద్దాల కొత్త చూపుకి మరో నిదర్శనం శృంగారం రసరాజం. శృంగారం రసజ్ఞతకి మచ్చు తునక-శృతిమించనంత వరకు!!

సుద్దాల పాటల్లో అంత్య ప్రాసలు సహజమే. ఏ సినీ కవైనా రాసేవే. కానీ

అచ్చా బుచ్చీ ఆటలను రావేలచ్చీ/వచ్చీ మెచ్చీ అడిగితే వస్తా నచ్చీ/ చకోర పచ్చీ ఎందుకే నాపై పిచ్చీ/ కుచ్చీ కుచ్చీ కుదిపితే చెప్పను పో ఛీ!! (పెళ్ళి సంబంధం)

అంటూ ఆది ప్రాసలూ, అంత్య ప్రాసలూ ఒకే గీతంలో వాడటం విశేషం. ''రఘుమ్మంది నాదం'' సినిమాలో "లాలిపాడుతున్నది గాలీ/ ఆ లాలి రాగాలలో నువు ఊయల లూగాలీ"

అనే పాట తెలుగుదనానికి నిలువుటద్దం. మన గ్రామీణ సంస్కృతి తెలిసిన వాడు కాబట్టి.

"ఉంగా ఉంగా" అని ప్రయోగించాడు. గోరుముద్దల్ని గుర్తు చేశాడు. "బాలశిక్ష" ప్రాధాన్యాన్ని వెల్లడించాడు. గంధాలు, పారాణులు, చెక్కిట చుక్కలు, గోరింటలు... ఇటువంటి తెలుగు సంస్కృతీ సౌరభం గుభాళించే పాటలు రాసిన మన తెలుగోడు సుద్దాల.

"అవ్వ నీకు దండమే-అక్క నీకు దండమే
ఆలి నీకు దండమే - అర్ధాంగి నీకు దండమే"

వంటి పాటలు ఆత్మీయ అనుబంధాల్ని వెల్లడిస్తూ స్త్రీ ప్రాశస్త్యాన్ని తెలియజేస్తాయి. తెలుగుపై ఎంత మక్కువ ఉన్నా సన్నివేశాన్ని బట్టి, భావాన్ని బట్టి సంస్కృత సమాసాలనూ గుప్పించగల శబ్దవేది సుద్దాల. మచ్చుకి-

"అసహన సహస్ర ఫణ ఫూత్కృతుల అగ్నివై
ధ్వంస మొనరించు భీష్మించుక్రతు ధ్వంసివై
హింసారి రంసాది కంస విధ్వంసివై
కరకు కర్క శుల ఖడ్గమున...."

అశోక్‌తేజ వ్యక్తిత్వ వికాసానికి చెందిన పాటలు రాశాడు. నేటి యువతకి ఈ పాటలు గుణపాఠాలుగా ఉంటాయి. "భద్రాచలం" సినిమాలోని ఈ పాట శిఖరాయమానం-

"ఒకటే జననం - ఒకటే మరణం
ఒకటే గమనం - ఒకటే గమ్యం
గెలుపు పొందేవరకూ అలుపులేదు మనకూ"

సినిమా పాటల్ని ఒక గమ్యంగా, ఒక లక్ష్యంగా, ఒక బాధ్యతగా రాయటం వల్లనే 'వెన్నెలా' అంటాడు. 'గుమ్మడీ' అని పలవరిస్తాడు. 'పోరగాడూ' అని మురిసిపోతాడు. కొమరం భీమ్ పోరును 70 ఎం.ఎం.లో చూపిస్తాడు. గాంధీ, వివేకానందుల వారసులం కావాలని ఆశిస్తాడు. అభ్యుదయ గీతాలను ఎంత మమేకంగా రాస్తాడో భక్తి గీతాలను అంత తన్మయత్వంతో రాస్తాడు. దుష్టరాజకీయాలపై నిప్పులు కురిపిస్తాడు. మత సహనాన్ని ప్రవచిస్తాడు. అమ్మ పేగుముడినీ... నేలమ్మ ఒడినీ గుండెల్లో దాచుకొనే సుద్దాల అశోక్ తేజ- 'రాంసక్కనోడమ్మ'! 'నెమలి కన్నోడమ్మ'!.

కథ

# వికృత క్రీనీడ

**పాలకొల్లు రామలింగస్వామి**
9441416049



*"మామ తేజగాడేడ్రా... సెలవా?"*

***బెర్తుల్ని దాటుకుంటూ ముందుకు సాగుతోన్న మోహన్‌ని అడిగేడు శేఖర్. అతన్నో సారి చూసి ఒక్క ఉదుటున నవ్వేడు మోహన్.***

***"వాడు రాకపోవడ మేట్రా... ఇక్కడే ఎక్కడో ఉంటాడు. చూడు.."***

***బెర్త్ సీటుకి చేరబడి చేతులు కట్టుకుని అన్నాడతను. ఖాళీగా ఉన్న అప్పర్‌బెర్త్‌పై బేగుల్ని ఉంచుతూ.. అతనికెదురుగా నిలబడ్డాడు శేఖర్.***

"అదిగోరా... నువ్వడిగిన హీరో!" దూరంగా చేయి చూపించేడు మోహన్.

కిల్లర్ బ్లూకలర్ జీన్స్‌పై ఫుల్‌హేండ్స్ ఆరెంజ్ రంగు టీషర్ట్ వేసుకుని... స్పైక్ హెయిర్‌కట్‌తో... చెవుల్లో హెడ్‌సెట్ పెట్టుకుని మెరిసిపోతున్నాడు.

"సారు... తెల్లారేసరికే డ్యూటీ ఎక్కేసినట్టున్నారు."

శేఖర్ కొంటెప్రశ్నకు జతగా నవ్వేడు మోహన్.

''మనోడికి... అది తప్ప మరింకేం పని!?'' బదులిచ్చాడతను.

కిటికీల్లోంచి మెల్లగా వీస్తోన్న చల్లగాలికి కొందరు కునుకు తీస్తున్నారు. మరికొందరు ముచ్చట్లలో మునిగి కాలాన్ని కరగదీస్తున్నారు. టీ కాఫీ సమోసాల వాలాలు కాలుగాలిన పిల్లులే కాదు చెవికోసిన మేకలూ అవుతున్నారు.

ఉదయం 7 గంటలు... బొకారో ఎక్స్‌ప్రెస్ పట్టాలపై వేగంగా పరుగులు పెడుతోంది.

"నువ్వెప్పుడొచ్చావురా మామ... మాకు కనబడలేదు."

కాసేపటికి దగ్గరకి వచ్చిన తేజని అడిగాడు మోహన్.

"దటీజ్ సీక్రెట్." తన బేగ్‌ని కూడా బెర్త్‌పై కెగదోస్తూ అన్నాడతను.

"ఏంటో..."

"ఏముంది... కదుల్తున్న,బండిపైకి పట్టాలమీంచి డోరెక్కి ఉంటాడు."

"ఒకవేళ డోరు మూసి ఉంటే..."

''ఫుట్‌పాత్‌పై నిలబడి... మీలో ఎవరికైనా ఫోన్ చేసుండేవాణ్ణి. ఏం... తలుపు తీయరా?"

"అయినా... అంత రిస్క్ అవసరమా?"

"లైఫ్‌లో రిస్కుంటేనే గదరా... కిక్ వచ్చేది."

పాపులర్ పెర్ఫ్యూమ్ బాడీ స్ప్రే ద్వారా... ఫేవరెట్ హీరో మానరిజమ్‌ను బాడీ లాంగ్వేజ్ ద్వారా... అతనిలో ఒక్కసారిగా ప్రస్ఫుటమయ్యాయి.

‘‘ఇంతవరకూ యాడ్స్‌లో చూపించేవన్నీ అబద్ధాలనుకునేవాణ్ణి. కాని వాటిలో కూడా నిజాలుంటాయని ఇప్పుడే తెలిసిందిరా... బాబు.” అన్నాడు మోహన్.

“ఏంటది?”

“ఏక్స్ బాడీస్ప్రేకు అమ్మాయిలంతా అబ్బాయిల వెంట పడతారని టివీల్లో చూసాను. ఈ రోజు కళ్ళారా చూసేను.” ఆ మాటకి పెద్దగా నవ్వాడు తేజ.

“ఓస్.. అదా! ఆ అమ్మాయేదో కాలేజి గురించి అడిగిందిరా. జస్ట్.. చెప్పానంతే!” భుజాలెగరేశాడు. అతని వివరణకు శేఖర్ సంతృప్తి చెందలేదు.

“ఆ అమ్మాయి వెనక పడిందో... మనోడు పడ్డాడో... ఎవడికి తెల్సు!”

“అంత సీన్ లేదు.”

‘‘ఛ... నిజమా!’’ శేఖర్ వెటకారానికి ఉడికిపోయాడు తేజ. రోషంతో ముఖం ఎర్రబడింది. గమనించేడు మోహన్.

“కూల్ మామ... కూల్!” భుజం తట్టి సర్ది చెప్పేడు.

“నువ్వుండు మామ... నేనేంటో వీడికి తెలియాలి. కావాలంటే పందెం. నువ్వు ఏ అమ్మాయినైనా చూపించు. నెలరోజుల్లో పడగొట్టి చూపిస్తా. లేదంటే నా పేరు మార్చుకుంటా... ఏం... రడీయేనా!?” అతన్లోని యవ్వనమదం ఉరకలేసింది. వాళ్ళిద్దరిలో... మౌనం...

అతన్లో పొగరుంది. డబ్బుందనే అహముంది. అంతకు మించి రాజకీయ పలుకుబడి తండ్రికుందన్న మదం ఉంది. వీటన్నింటిని మించి... ఆడదంటే నమిలిపారేసే బబుల్‌గమ్ అనే చులకనభావం ఉందతనిలో. అతన్లోని ఈ పైత్యప్రకోపం... ఇప్పటిది కాదు. చిన్నప్పట్నుంచి అతన్లో ఎదుగుతూ వచ్చింది. ఇప్పుడిలా... సందర్భోచితంగా బయటపడింది.

❖❖❖

తేజ తండ్రి... రెవెన్యూశాఖలో కీలక ఉద్యోగి. ఉదయం పదింటికి ఆఫీసుకు బయల్దేరితే... మళ్లీ రాత్రి ఏ పదింటికోగాని ఇంటికి చేరడు. కుటుంబ బాధ్యతంతా ... పాపం వాళ్ళమ్మదే! ఆమె దృష్టిలో... అదొక గర్వకారణమైన హోదా! కాఫీలో చక్కెర తక్కువైనా... కూరలో ఉప్పు ఎక్కువైనా... సకాలంలో ఏ సేవ అందకపోయినా... అతను బూతుపురాణం విప్పుతాడు. ఆమె బాధపడదు. సేవాలోపం ఎప్పుడూ చేయదు.



‘ఆడది.. మగాడికి బానిస.’ అన్న భావానికి తేజలో అలా అంకురార్పణ జరిగింది. అతన్ని కార్పోరేట్ స్కూల్లో చేర్పించి... చెల్లెలు లావణ్యను మున్సిపల్ స్కూల్లో వేసినప్పుడు ... ఒక్క రోజంతా ఏడ్చిన చెల్లెలుతో–

‘వాడు మగపిల్లాడు. వాడితో నీకు పోటీ యేంటి!?” అని అమ్మ వెనకేసుకు వచ్చినప్పుడు–

‘అబ్బాయిలే... అమ్మాయిల కంటే ఎక్కువ! అన్న అభిప్రాయం అతన్లో ఎదిగే మొక్కయ్యింది. కుటుంబ వ్యవహారాల్లో... కళాశాల కార్యకలాపాల్లో... అబ్బాయిలకి అధిక ప్రాధాన్యత ఇచ్చి అమ్మాయిల్ని తక్కువ చేసి చూసినప్పుడు– ‘మగాడే గొప్ప. అధికుడు. ఆడది అణిగిమణిగి ఉండాల్సిందే!” అన్న నియంతృత్వ ధోరణి అతన్లో శాఖోపశాఖలై విస్తరించింది.

అప్పట్లో–

కాలేజి రోజుల్లో టీనేజ్ లవ్ చేయని ‘యవ్వనప్రాయం’ దండగని తెగ ఊదరగొట్టే ‘యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్లు’ అతన్ని ఎక్కడికో తీసుకువెళ్లేయి. సదరు సిన్మాల్లోని హీరోగారికి వీరాభిమానై అతగాడి విపరీత చేష్టలకి ‘బ్రాండ్ అంబాసిడార్’ గా మారేడు.

‘హీరోయిజం’ ముసుగులో చూపించే ‘సిక్స్ పేక్ బాడీ’ మగతనానికి గుర్తుగా ‘ఈవ్ టీజింగ్’ మగజన్మకు హక్కుగా... తన ఈడు కుర్రాళ్ళతో అన్ని రకాల ‘ఎంజాయ్‌మెంట్స్‌కు’ అలవాటు పడ్డాడు.

పదమూడేళ్ళ ప్రాయంలో... తండ్రి మంచం కిందనున్న ‘బూతు పుస్తకాల్ని’ దొంగతనంగా చూడ్డంతో మొదలైన అలవాటు... పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో ‘ఫోర్న్‌ఫిలిమ్స్’ను ఎగ్జయిటింగ్‌గా వీక్షించడంలో ఆరితేరాడు.

‘ఏభయ్యేళ్ల తండ్రి ‘సెకండ్ సెటప్’ వ్యవహారం కూడా అతని వ్యవహారశైలికి ఊతమిచ్చే అంశమైంది... క్రమేపి...

‘సేవలందుకోవడం మగాడి హక్కు. దాన్ని అందించడమే ఆడ జన్మకు సార్థకత’ అన్న వైఖరి అతన్లో నరనరాన జీర్ణించుకుపోయింది.

దాంతో.. రెండేళ్ల ఇంటర్ కాస్త నాలుగేళ్లు పట్టింది.

తండ్రి... తన పలుకుబడితో... ఎక్కడో దూరంగా ఉన్న ఓ అనామక ఇంజనీరింగ్ కాలేజిలో పేమెంట్ సీటుని కొని తేజని చేర్పించాడు.

అతని స్వభావం తెలిసి... అదే ఊర్లో అతన్ని ఉంచి చదివించే సాహసం మాత్రం చేయలేకపోయాడు. ఉదయం

ట్రైనుకు బయల్దేరి సాయంత్రానికల్లా ఇంటికి తిరిగొచ్చేలా 'అప్పెండవును' చదువుకే మొగ్గు చూపేడు.

కాని... తేజ చెల్లెలు అలాకాదు. చాలా తెలివైంది. పదోతరగతిలో పదికి పదిపాయింట్లు సంపాదించుకుంది. వైజాగ్‌లోని ఓ కార్పోరేట్ సంస్థ... తమ కళాశాల్లో ఫ్రీ సీటిచ్చి మరీ ఇంటర్ చదివించింది.

అందులోనూ... ఆమె టాపరే! ఇంటరు తర్వాత.. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకుంది. యూనివర్శిటీ కాంపస్‌లోనే ఇంజనీరింగ్ చేస్తోందామె.

❖❖❖



బొబ్బిలి స్టేషన్‌లో బండాగింది. తేజ ఒక్కడే కిందకు దిగి ఎవరికోసమో చుట్టూర కలియజూసేడు. ఎవరో యువతి ఎదురొచ్చింది. ఆమె పేరు మధులత. ఇద్దరూ కలిసి మరోపెట్టె ఎక్కేరు. ఎక్కడా ఖాళీ లేదు. ఓ మూల చేరి పక్కపక్కనే నిల్చున్నారు. బండి బయల్దేరింది. గంపతోటి జామకాయలు లోపలకు వచ్చేయి. కొన్నాడతను.

"మధూ... మన పెళ్లెప్పుడు?" తింటూ అడిగేడతను.

"ఫైనలియర్ పరీక్షలవనీ... ఉద్యోగం సంపాదించేక చేసుకుందాం." తింటూ బదులిచ్చింది మధులత.

"అమ్మో... ఉద్యోగమే... ముసలాడిని అయిపోనూ..."

"అయిపో... నాకేం సంబంధం..."

"మరీ... అలాగంటే... ఎలా మధు?"

"అయితే... నన్ను మర్చిపో..." కళ్లల్లోకి చూస్తూ చిలిపిగా అందామె.

చంద్రబింబం లాంటి మోము... ఎర్రని పెదాలు... కొటేరేసినట్లు నాసిక... పల్చని చెక్కిళ్లు... ఇంకా చాలా చాలా అందాలు.. అతి చేరువుగా కవ్విస్తూ.. అతన్లో మోహావివశం... సెల్‌ఫోన్లో చూసిన నగ్నదృశ్యాలు... ఎంత కాదనుకున్నా అతన్ని రెచ్చగొడుతూ.. నిగ్రహం సాధ్యం కాక.. అమె కళ్లల్లోకి నేరుగా చూడలేక... చూపుల్ని ఎటో తిప్పుకున్నాడతను... తేజలో ఆలోచన్ల హోరు...

ఇక మాటలనవసరం... కమాన్ తేజ...వేకప్..! అంది వచ్చిన అవకాశాన్ని వదులుకోకు.. కళ్ళెదుట నిల్చున్న ఈ నిలువెత్తు సౌందర్యాన్ని జుర్రుకోవాలనే గదా... ప్రేమంటూ ఇన్నాళ్లు ఎదురు చూసి... ఇంత డబ్బు ఖర్చు చేసి.. వదులుకోగూడదు.

ఏమవుతుంది...? మహా ఐతే ఏడుస్తుంది... తిడుతుంది... తను పెళ్లి చేసుకుంటానని నచ్చ చెబుతాడు. కాళ్లు పట్టుకుంటాడు (అవసరమైతే)

ఒకవేళ 'సేఫ్ పిరియడ్' కాకపోతే 'ఐపిల్స్' అని 'అన్‌వాంటెడ్ టాబ్లెట్స్' అనీ మార్కెట్లో ఎన్నని లేవు...!? మింగిస్తే సరి...పనయిపోతుంది.

థాంక్స్ టు మెడికల్ సైన్సెస్... మెనీ థ్యాంక్స్ టు యాడ్స్..(వాటి ద్వారానే ఈ మెడిసన్స్ గురించి తెల్సింది)

చెప్పేయ్... రేపే పుట్టిన రోజని... కూల్‌డ్రింక్స్‌లో మత్తుమందు కలిపి... ఫ్రెండ్‌రూమ్‌లో ఎంజాయ్... లెటజ్ ఫిక్స్‌ద...ప్రోగ్రామ్ మరింకేం... మధుతో చెప్పు... ఇప్పుడే!

ఇంతలో

అదేపనిగా సెల్ మోగింది. తీసి చూసాడతను. చిత్రంగా... మమ్మీ నెంబరు... మూడ్ అప్‌సెట్టయ్యింది. అయిష్టంగానే ఎత్తాడు.

అట్నుంచి అతని తల్లి... ఏడుస్తూ మాట్లాడుతూ...ఏక ధాటిగా రోదిస్తూ... లావణ్యకు ప్రమాదమేదో జరిగిందని ప్రస్తుతం వైజాగ్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స జరుగుతోందని, డాడీతో కలిసి ప్రయాణమార్గంలో ఉన్నానని, ఉన్నఫళాన తేజను అక్కడికి వచ్చేయమని దాని సారాంశం....

కాళ్లకింద భూమి కంపించినట్టు ఉలికిపాటు అతనిలో...

"మీకీ విషయం ఎలా తెల్సింది?" తడారిన గొంతునుంచి మాట పెగలడమే కష్టంగా ఉందతనికి.

"సి.ఐ. గారు ఫోన్ చేశారు"

"ఎప్పుడు జరిగింది?"

"ఉదయం ఏడింటికట"

"ఇప్పుడే బయల్దేరుతున్నా. కంగారు పడకండి."

అదిరే చేతుల్తో జేబులో సెల్ పెట్టుకున్నాడతను. అతని ముఖంలో తీవ్ర ఆందోళన.చేతుల్లో సన్నని వణుకు... మనసులో ఏదో... అనుమానం...

జరిగిందేంటో టూకీగా మధులతతో చెప్పేడు. మరుక్షణం చైన్‌లాగి పరుగులాంటి నడకతో కనుమరుగయ్యాడు.

❖❖❖

సెవెన్‌హిల్స్ ఆసుపత్రి... ఐసీయు వార్డులోని... ఒక చాంబర్‌లో... ఆధునిక పరికరాల మధ్య అపస్మారకంగా లావణ్య... బయట లాన్‌లో గుమిగూడిన విద్యార్థులు... ఎవర్నీ లోపలకు అనుమతించడం లేదు.

తేజ అక్కడికి చేరేసరికి... తల్లిదండ్రులు పోలీసుల్తో మాట్లాడుతూ కనిపించేరు.

అతన్ని చూడగానే గొల్లుమన్నారు.

అతను ఊహించింది నిజమే...

తన ప్రేమను నిరాకరించిందనే కసితో వెంకట్ అనే సీనియర్ విద్యార్థి కత్తితో ఆమె గొంతు కోసాడని... రక్తపు మడుగులో ఉన్నామెను స్నేహితులు ఆసుపత్రిలో చేర్పించారని, నేరస్తుడు తమ అదుపులోనే ఉన్నాడని సి.ఐ. వివరించాడు. కంఠనాళాలు తీవ్రంగా కోసుకుపోవడంతో... 72 గంటలు గడిస్తేగాని ఏ విషయం చెప్పలేమని నిర్ధారించేరు డాక్టర్లు. స్పృహ కోల్పోయిందతని తల్లి. ఆమెకూ వైద్యం ప్రారంభించాడు డాక్టర్లు.



పరామర్శల వెల్లువ... అంతటా ఒక విషాద వాతావరణం...

తేజకు పిచ్చెక్కేలా ఉంది. ఆవేశంతో రక్తం మరిగిపోతోంది. తన చెల్లెల్నీ స్థితికి తెచ్చినవాడిని నరికి చంపేద్దామన్న ఆవేశం పెరిగిపోతోంది. మరోపక్క ఏం చేయలేని సగటు మానవ నిస్సహాయత... సెగలు కక్కుతోన్న అగ్ని పర్వతంలా... ఉందతని పరిస్థితి...

"మీరు... లావణ్య అన్నయ్యే కదూ...!?" దగ్గర్లో వినిపించిందొక గొంతు. తలెత్తి చూసేడతను. ఎదురుగా అమ్మాయిలు. అవునన్నట్టు తలాడించేడు తేజ.

"లావణ్య గురించి కొన్ని విషయాలు మీతో చెప్పాలండి... తను చాలా మంచమ్మాయి. ఎవరితోను ఎటువంటి గొడవ పెట్టుకొనే రకం కాదు. అలాంటమ్మాయి వెనుక ఈ స్కౌండ్రల్ ప్రేమిస్తున్నానని వెంట పడ్డాడు. ఆఖరికి తనకి చదువు తప్ప మరేది ఇష్టం లేదని ఎన్నిసార్లు చెప్పినా విన్లేదు. తను కాలేజికి రావడానికే భయపడేది. వాడో జులాయి వెధవ. ఒకమ్మాయి జీవితాన్ని నాశనం చేసిన క్రిమినలట. సీనియర్స్ చెప్పేరు. వాళ్ల డాడీ కార్పోరేటరట. అందుకే వాడికా పొగరు. ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేసినా... ఏం చేయలేకపోయారు. పోలీసు కంప్లయింట్ ఇద్దామంటే లావణ్య భయపడేది. అల్లరవుతుందని, ఇంట్లో తెలిస్తే చదువు మాన్పించేస్తారని ఏడ్చేది. అన్నయ్యకంతా చెబుతానని, వాడొచ్చి సమస్య సాల్వ్ చేసేస్తాడని నిన్ననే మీ గురించి గొప్పగా చెప్పింది. కాని ఇంతలోనే ఇలా జరగుతుందని ఊహించలేదు. పైగా తనని కాదన్నందుకు బతకనిచ్చేదిలేదని.., బయటకొచ్చి పోలీసుల్తో అన్నాడంటే... చూడండి వాడెంత దుర్మార్గుడో... వాడ్ని వదల కూడదన్నయ్యా నడిరోడ్డున ఉరితీయాలి..." దుఃఖంతో గొంతు పూడుకుపోయి... వాళ్లేం మాట్లాడలేకపోయారు.

బాధను ఉగ్గబట్టకోలేకపోయాడతను. చేతుల్లో ముఖం దాచుకుని బోరుమన్నాడు. ఎప్పుడూ.. సరదాగా, చలాకీగా ఉండే చెల్లెలింత నరకయాతన అనుభవించిందా... చదువుల తల్లి అయిన... తన చిట్టి చెల్లెలు ఇంతటి విపత్కర పరిస్థితిని ఎదుర్కోదా...!? మగాళ్ల వేధింపులకు గురయ్యే ఆడాళ్ల మనోవేదన ఇంతలా ఉంటుందా...!? ఇంతకీ వాళ్ళిద్దరు చెప్పింది...ఎవరి గురించి... అతనిలాంటి తన గురించి, తనలాంటి అతని గురించి కాదూ... ఈ రోజు వెంకట్ నేరస్తుడు... మరి నేర తలపుల్లో... కార్యోన్ముఖుడైన... తనేం ఉత్తముడా...తనెందుకు శిక్షార్హుడు కాదు!? తనకి దక్కనిదాన్ని ధ్వంసం చేయాలనుకున్నాడతను.... మోజు తీర్చుకుని మోసం చెయ్యాలని పథకం వేసేడు తను... మరి రెండింటికి తేడా ఏముంది..? ఆడవాళ్లంటే... కేవలం లైంగిక సుఖానికే పరిమితమైన ఆటబొమ్మలా...? ఈ విషభావాలు తనలోకి ఎలా ప్రవేశించాయి... ఎవరు నేర్పారు?

కుర్చీ వెనక్కి చేరబడి విసురుగా తలపట్టుకున్నాడతను. మెదడులో నరాలు చిట్లిపోతాయోమోనన్నంత టెన్షన్... చెవుల్లోంచి, కళ్లల్లోంచి వెచ్చని ఆవిర్లుగా బయటపడుతోన్న ఉద్వేగం....

పుట్టుక, బాల్యం, కౌమారం, యవ్వనంలోని వివిధ దశలలో... ఇంటా బయటా పక్కదోవ పట్టించే.. మనుషుల బలహీనతలు... సామాజిక న్యాయాలు.... వ్యక్తుల బంధాలు, సినిమాలు, పాటలు, యాడ్స్, సీరియల్స్, చౌకబారు సాహిత్యం, అంతర్జాల సదుపాయాలు, ... అన్నీ లీలగా అతన్లో కదలాడేయి. ఏ ఒక్కదాన్లో కూడా... స్త్రీని సమానంగా సగౌరవంగా, సలక్షణంగా ఎక్కడా చూపించలేదని... తనలాంటి కుర్రకారు వక్రమార్గంలో... నేరగాళ్లవుతున్నారని ఆవేదన చెందకపోవడానికి...

యువతలో... మదోన్మాదం నింపడమూ కాసులు కురిపించే నేపథ్యంలో... మహిళను మహిళగా గుర్తించి... గౌరవించే సంప్రదాయం వస్తుందా...!?

హత్యాయత్నానికి గురైన లావణ్యకు న్యాయం జరగాలని... ఒకపక్క ఆందోళనలతో... మరోపక్క రిలే

నిరాహార దీక్షలతో... విద్యార్థి మహిళా లోకాలు ఉద్యమాలతో హోరెత్తించాయి. లావణ్య ఆరోగ్యం కొద్దికొద్దిగా కుదుటపడసాగింది. వచ్చినవారిని చూసి మూగగా గుర్తుపడుతోంది. ప్రాణానికేమీ ముప్పులేదని మరో వారం తర్వాత... స్వల్పంగా మాట్లాడగలదని ప్రకటించారు డాక్టర్లు.

ఒక వెచ్చని ఆశాకిరణం... ఆ ముగ్గురిలో!

"ఆ రోగ్... ఎక్కడ ఉన్నాడన్నయ్యా?" ఉన్నట్టుండి... మాటల మధ్యలో అడిగిందొక రోజు లావణ్య.

"ఏమ్మా... ఎందుకు?" అడిగాడు తేజ.

"జైలుశిక్ష చాలా చిన్నదన్నయ్యా. మరో అమ్మాయి వేపు చూడనంతగా శిక్ష పడాలి. అది నేను చూడాలి.. " అందామె. అతని గుండె బరువెక్కింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆమె తలమీద అనునయంగా చేయివేసేడు.



''ఇవేమీ మనసులో పెట్టుకోకమ్మా... ప్రశాంతంగా ఉండు."

ఉగ్గబట్టుకున్న ఆవేశంతో ఓదార్చి... భారంగా బయటకు దారి తీసాడతను.

టీ తాగుదామని కిందకు దిగాడు.

ఉదయం పన్నెండు గంటలు... ఓ.పి... గ్రౌండ్ ఫ్లోర్‌ంతా రద్దీ...

రిసెప్షన్ కౌంటర్‌కు ఎదురుగా ఉన్న టి.వి.లోని ... ఏదో ఛానల్‌లో... ఏదో చర్చా కార్యక్రమం... అప్పుడు గుర్తొంచిందతనికి. ఉదయం మధులత ఫోన్ చేసిన సంగతి... స్క్రీన్‌పై దృష్టి సారించాడతను.

'స్త్రీలను కించపరిచే సిన్మాలు, సంస్కృతి రోజు రోజుకీ ఎక్కువవుతోంది. ముఖ్యంగా సిన్మాలపై, ఛానళ్ళపై, అశ్లీల సైట్లపై... ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి. అశ్లీల సైట్లను తక్షణం నిషేధించాలి. నిర్వాహకుల్ని తక్షణం అదుపులోకి తీసుకోవాలి. అన్నింటిని మించి స్త్రీలను గౌరవించే సంప్రదాయం మనలో పెరగాలి. ఇంటిని ఉద్ధరించేది మగాడు... పరాయి మనిషి ఆడపిల్లన్న భావజాలం మనలో తొలగాలి. ఇద్దర్నీ ఒకేలా చూసి పెంచగలగాలి. తద్వారా ఆధిపత్య ధోరణుల్ని తొలగించగలుగుతాం. రేపటి తరాల్లో స్త్రీలను గౌరవించే సంస్కృతిని పాదుకొల్పేలా ప్రతి ఒక్కరం నేటినుంచే బాధ్యత తీసుకోవాలి. అలా చేయనినాడు ఈవ్ టీజింగ్ రోగాలూ, భ్రూణ హత్యలూ, ఆడశిశువుల్ని పెంటకుప్పల్లో పారేయడాలు, బాలికల్ని వదిలించుకోవడాలు, ఆడపిల్లల అమ్మకాలు వంటివి నిరోధించడం మన తరం కాదు..."

ఎవరిదో అమ్మాయి అభిప్రాయం.... కొత్తగా ఆలోచనాత్మకంగా!

తేరిపార చూసాడావె వైపు... ఆమె మధు, ఆశ్చర్యపోలేదతను.

నిజమే... స్త్రీలపై అకృత్యాల్ని అరికట్టడానికి పోలీసు వ్యవస్థ ఉంది. శిక్షించడానికి- న్యాయ వ్యవస్థ ఉంది.

కాని మగాళ్ళ హింసా ప్రవృత్తికి మూలకారణాలైన... చులకన భావాన్ని, లింగవివక్షతని, శారీరక అవహేళనని, ఆధిపత్య ధోరణిని, మొగ్గలోనే తుంచివేయగల పెంపకం మనలో ఏది? అబల కూడా అన్నింటా సబలేనన్న నిజాన్ని ఉగ్గుపాలనుంచి నూరిపోసే చిత్తప్రవృత్తి మనలో వస్తుందా..!?

జవాబుకందని .... ప్రశ్నలెన్నో...

ఇంతలో సెల్ మోగింది. తీసి చూసేడు... మధులత. ఇందాకటి కార్యక్రమం గురించి ఏదో మాట్లాడుతూ... అవేవి అతని బుర్రకెక్కడం లేదు.

''మధు... నన్ను క్షమించగలవా?'' అన్నాడతను ఉన్నట్టుండి. అతనలా - ఎందుకన్నాడో ఆమెకు తెలీదు. కనీసం ఊహకు కూడా అందలేదు.

"దేనికి..." అందామె.

"అవేవి...ఇప్పుడు చెప్పలేను... ప్లీజ్!"

స్వరంలో వేడుకోలును బట్టి అతని మానసిక స్థితిని కొంతవరకు అర్థం చేసుకోగలిగిందామె.

"నీ తప్పుకు పశ్చాత్తాపం నీ గొంతులో వినిపిస్తోంది... సరే... మరోసారిలా... జరగకూడదు. జైలుకు వెళ్ళాల్సి ఉంటుంది. గుర్తుంచుకో..."

నిష్కర్షగా అందావె. ఆమె మాటలు అతన్ని నొప్పించలేదు. పైగా గుండెల్లో భారం దిగినట్టు తేలికపడ్డాడు.

"థ్యాంక్స్.. మధు."

సంభాషణ ముగిసింది. సెల్‌ను జేబులో పెట్టుకుని... దీర్ఘంగా ఊపిరి తీసి వదిలాడు. ఇప్పుడతనికెంతో ఉపశమనంగా ఉంది.

తన చెల్లెలి కోరిక ప్రకారం...

వెంకట్‌ని శిక్షించే పరిస్థితి లేకపోయినా... కనీసం తనలో మృగాడ్ని అయినా చంపగలిగినందుకు!

**కవిత**

# రండి! - నిషేధిద్దాం

- భండారు విజయ
8801910908

నగరం నగారా... మ్రోగించింది!
ఆకాశం మేఘాల తునకలను
తనివితీరా వదిలించుకొని
తెగిపడిన నక్షత్రాల్లా
భూమి పై మల్లెల ఆనవాళ్ళను గుమ్మరించి
శ్వేతాంబరై స్వచ్ఛంగా ఉంది.

నగరం.... నిద్దుర మేల్కొంది!
నిన్న పుట్టిన పసికందు
అమ్మ చనుదోయిపై చేయివేసి
ఆబగా మధురామృతాన్ని గ్రోలుతోంది
రేపటి రోజును మరచి
తన చిన్ని పిడికిళ్ళతో
ఈ రోజే శాశ్వతమని
లేత కన్నీళ్ళతో... ఆశగా..... చూస్తోంది!
బయటకు వెళ్ళిన మరో ఉదయం
కాంక్రీటు మనసుల మధ్య
తన సహజత్వాన్ని వదిలించుకొని
రాక్షస రంగులను అద్దుకొని
ప్రేమోన్మాదంతో పడతులపై
యాసిడ్లను కుమ్మరిస్తూ.....
మృగోన్మాదంతో......పసివాడని
వయసులను సైతం... చెరచి
పాశవిక ఆనందాన్ని పొందుతోంది!



నగరం... నాటుసారా తాగిన
నయవంచకునిలా.... నిద్దురోతోంది
నగ్నంగా... తన జీవనాన్ని మార్చిన
డాలరు దయ్యాన్ని ...... ఆక్కున చేర్చుకొని
మారిన మైండ్ సెట్‌ను...
బురద కంపులో త్రొక్కిపడుతూ......
తనువంతా.... పుండ్లు కాగా...
మైనంపూతలు పూసుకుంటూ.....
కాలం ఒడిలో...... కదిలిపోతోంది

నగరం..... నజారా... ప్రకటించింది
ఈనిన చీమల పుట్టలా....
రోజు.....రోజూ పెరిగిపోతున్న
మృతదేహాలను కదపలేక
నల్లని తారును తనువంతా పూసుకుంటూ
తెల్లబోయి..... తనింకా..... జీవించి ఉన్నానా?.... అని
తన శరీరాన్ని తానే.... గిచ్చుకొని చూసుకొంటుంది.

రెండు జంట పక్షులు
అప్పుడే పుట్టిన రెక్కలను విదిలించుకుంటూ
టప! టప! శబ్దాలను చేస్తూ
రాలిపడిపోయిన ఆకాశాన్ని
రక్తాన్ని వెదజల్లిన
నక్షత్రాలను పట్టుకోవటానికై
అతివేగంగా ఎగిరిపోతున్నాయి.

నగరం మాత్రం..... నింపాదిగా
తన సహజత్వానికి జూలు విదిలించి
మళ్ళీ రేపటి మార్పుకై
రాతిగుండెను సానబెడుతూ....
క్రొత్త వెలుతురుకై..... తపనతో..
మళ్ళీ! మళ్ళీ! ఎదురుచూస్తోంది.

కోపానికి సమిధ అయిన ప్రకృతి
వాడిపోయిన తన మోమును
ఫ్లైవోవరుల అద్దాలలో మూగగా చూస్తూ
తన ఎత్తును వెతుక్కుంటూ
వెదజల్లబడిన రక్తపుచారికలను
తన నోటితో.... కడిగేప్రయత్నంలో ఉంది.

రండి!... నగరాన్ని... పహారా! గాద్దాం
కనీసం అమ్మాయిల అత్యాచారాలను
హత్యోన్మాధాల రక్తపు చారికలను
తారురోడ్డుపై విడువబడ్డ వలువలను
కాపాడుకుందాం! అంతులేని శోక సంద్రాలను...
ఎదిరించైనా... నిషేధిద్దాం!




# నల్లూరి రుక్మిణి కథలు వ్యవసాయరంగ సంక్షోభాలు జీవన గమనాలు

- నూతంకి గౌరి

9949015632

***భారత దేశానికి వెన్నెముక వంటి రైతు నేడు ఎన్నో విధాలుగా నష్టాలను చవిచూసి ఆత్మహత్యలకు సైతం పూనుకొంటున్నాడు. తాను నమ్ముకొన్న భూమి గర్భంలో పచ్చని పైరును పండించి పెంచి పోషించి కన్న బిడ్డకంటే అపురూపంగా రక్షించి ఆహారాన్నందించే రైతన్నకే ఆకలి చావులు ఎదురవుతున్నాయి. దీనికి గల కారణాలు అనేకం. ఈ రకమైన అన్ని రకాల ఆలోచనల క్రోఢీకరణ రుక్మిణి గారి కథల్లో అంతర్గతాంశాలు.***

నల్లూరి రుక్మిణి ప్రకాశం జిల్లా కూనంనేనివారిపాలెంలో జన్మించారు. విద్యార్థి దశ నుంచి ఉద్యమాలలో పని చేయడం వల్ల విప్లవ భావాలతో ప్రభావితమై స్రీవాద ఉద్యమనేపథ్యం తరువాతే విరివిగా రచనలు సాగించారు. గతపాతికేళ్లుగా విప్లవ రచయితల సంఘంలో క్రియాశీలక సభ్యురాలైన రుక్మిణి నవలా రచయిత్రిగా, కథారచయిత్రిగా, వ్యాసకర్తగా, మహిళా ఉద్యమ కారిణిగా, వివిధ సామాజిక అంశాలపై స్పందించే ఆలోచనా పరురాలిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తమ ప్రతిభను అనేక కోణాలలో ప్రదర్శించారు.

నల్లూరి రుక్మిణి కథలన్నింటిలో ప్రధానంగా వ్యవసాయ జీవన గమనాలు దర్శితాలే. వ్యవసాయం పై ఆధారపడి జీవించే వారి జీవితాలలో ప్రధానంగా సంభవించే ఏ మార్పుకైనా కారణం వ్యవసాయ రంగంలో ఏర్పడ్డ సంక్షోభాలే. ఈ సంక్షోభాలు ప్రధానంగా కరువు కాటకాలవల్ల కలగడం సహజం. అయితే జీవితాల అస్థిత్వ ఆకాంక్షలను స్థిరీకరించుకోవడానికి సాగించే పోరాటంలో రైతుల దీనావస్థలు పలు సందర్భాలలో వీరి రచనల్లో గమనించవచ్చు. వ్యవసాయం ప్రజల ప్రధాన వృత్తి మాత్రమే కాక అది వారి జీవన సంస్కృతీ సాంప్రదాయ విధానాలకు వ్యవసాయ కాలాలకు, పనులకు, ఉత్పత్తులకు అనుగుణంగా జీవన విధానాలను సాగించే కోణం కూడా వీరి కథల్లో ఉంది.

"రుక్మిణి మాటల్లోనే చెప్పాలంటే పంట పొలాలు, నీటికాలువలు, వీటి మధ్య సుళ్ళు తిరిగిన మనుషుల పతనాలు, పైకెగయడాలు ఈ కథల్లో ఉన్నాయి" అంటారు రాజయ్య 'గీతలకావల' నల్లూరి రుక్మిణి కథా సంకలనం ముందుమాటలలో. నిజంగా ఈ మాటలు రుక్మిణి రచనా విధానాన్నే అద్దం పడుతున్నాయి. భారత దేశానికి వెన్నెముక వంటి రైతు నేడు ఎన్నో విధాలుగా నష్టాలను చవిచూసి ఆత్మహత్యలకు సైతం పూనుకొంటున్నాడు. తాను నమ్ముకొన్న భూమి గర్భంలో పచ్చని పైరును పండించి పెంచి పోషించి కన్న బిడ్డకంటే అపురూపంగా రక్షించి ఆహారాన్నందించే రైతన్నకే ఆకలి చావులు ఎదురవుతున్నాయి. దీనికి గల కారణాలు అనేకం. ఈ రకమైన అన్ని రకాల ఆలోచనల క్రోఢీకరణ రుక్మిణి గారి కథల్లో అంతర్గతాంశాలు.

వ్యవసాయరంగంలో ఏర్పడిన సంక్షోభాల కారణంగా అనేకుల జీవితాలలో ఏర్పడిన కల్లోలాలు వీరి కథలన్నింటిలో గమనించవచ్చు. అయితే ప్రధానంగా 'ఆగిసాగిన అడుగులు', 'అగ్నిస్పర్శ', 'సిండికేట్', 'బీటలెత్తిన బీళ్ళ శోకం', 'మోయలేని నిజాలు', కథల్లో కళ్ళకు కట్టినట్లు వాస్తవాల చిత్రీకరణలున్నాయి.

'ఆగి సాగిన అడుగులు' కథలో ఆరులైన్ల రోడ్డు ఏర్పడటం మూలంగా రైతులు తమ భూములు కోల్లోయి, దాని కారణంగా వారివారి జీవన విధానాలలో ఏర్పడిన మార్పులను ఆహ్వానించలేక నిరాశ, నిస్పృహ, నిర్లిప్తతతో కూడిన ఓ దయనీయ జీవన స్థితి ఈ కథలో కీలకాంశం. కథలో నాగన్న రెండెకరాల భూమి గల రైతు. తాతముత్తాతల కాలం నుండి వ్యవసాయమే జీవనాధారంగా గడిపారు. కానీ, తమ గ్రామంలో వేసిన ఆరులైన్లరోడ్డు మూలంగా నాగన్న తనకు గల రెండెకరాల భూమిని కోల్పోయాడు. దీనికి గాను నష్టపరిహారంగా ప్రభుత్వం అందించిన డబ్బుతో తన కొడుకు

మోహనరావు ఎరువుల వ్యాపారం ప్రారంభించాడు. నాగన్న చిర కాలంగా ఆధారపడ్డ పంట భూమిలేదు, పనీలేదు. క్రమంగా ఇంట్లో తన మాటకూ, చేతకూ విలువలేని పరిస్థితి కలిగింది. దీన్ని భరించలేని నాగన్న ఎలాగైనా తనకాళ్లపై తను నిలబడాలని, రెండెకరాల భూమిని కౌలుకు తీసుకొని దున్నుకొని జీవనం సాగించాలని తన ఆలోచనల్ని స్థిరీకరించుకొని ఆ దిశగా అడుగులేశాడు. వ్యవసాయంపై ఆధారపడిన వారి జీవితాలు తదనుగుణమైన ఆలోచనల్తోనే ఉంటాయి. వారి మాట తీరు, వారి ఆలోచనలు ఆరకమైన పోకడలకు అనుగుణంగానే ఉంటాయి. కాయకష్టంలో ఆనందాన్నే ఆస్వాదిస్తారు. తల్లి నుంచి బిడ్డను వేరు చేస్తే ఆ బిడ్డ తల్లికోసం ఏ విధంగా ఆరాటపడుతుందో, నమ్ముకొన్న భూమి తల్లి తనకు దూరమయిందనే దిక్కుతోచని స్థితి నుండి నాగన్న తన జీవితాన్ని మళ్లీ భూమి మీదకే మరల్చాడు. పుట్టుక నుండి మరణం దాకా వ్యవసాయ రంగంతో ముడిపడిన జీవితాలు ఏ దశలోనైనా ఆ వాతావరణాన్ని వీడమనలేని కోణం ప్రస్ఫుటంగా వ్యక్తీకరించిన కథ ఇది.



**నల్లూరి రుక్మిణి**

> ***'భూ నిర్వాసితులైన రైతులు' తమ జీవితాలలో ఏర్పడ్డ మార్పులను ఇముడ్చుకోలేక సాగుబడి భూమిలేక అల్లాడిన స్థితి 'ఆగిసాగిన అడుగులు' 'అగ్నిస్పర్శ' కథల్లో కనిపిస్తోంది.***

'అగ్నిస్పర్శ' కథలో పద్మశాలి కుటుంబానికి చెందిన బాలయ్య రామకోటమ్మలకు నలుగురు సంతానం. వీరు పద్మశాలీలే అయినప్పటికీ, తమకు గల ఐదెకరాల భూమినే ఆశ్రయించి జీవనం సాగించారు. అయితే తమ్మిలేరు ప్రాజెక్టు స్థాపనా కార్యక్రమంలో భాగంగా బాలయ్య తన ఐదెకరాల భూమిని కోల్పోయి ఆ దిగులుతోనే మరణించాడు. దాని తర్వాత కుటుంబ మంతా కులవృత్తి అయిన మగ్గం మీద ఆధారపడ్డారు. అందులోనూ నష్టాలే కనిపించాయి. డాక్టరవ్వాలని ఆశించిన బాలయ్య చిన్న కూతురు సునీత జీవితంతో పాటు అందరి జీవితాలు ఛిద్రమైపోయాయి. కాబట్టి వ్యవసాయం మీద ఆధారపడిన వారవరైనా మరేకోణంలో నుండి కానీ తమ జీవితాలను స్థిరపరచుకోలేరని నిరూపించిన మరో కథ ఇది. కథలో బాలయ్య తన కుల వృత్తి అయిన 'చేనేత' పై ఆధారపడలేదు. వ్యవసాయమే చేశాడు. అంత వరకు సాఫీగా సాగిన జీవితాలలో ప్రాజెక్టు పేరుతో కోల్పోయిన భూమి వల్ల నిరాశ్రయులయ్యారు. బాలయ్య చివరకు ఆత్మహత్యే శరణ్యంగా భావించాడు. కుటుంబ మంతా కష్టపడ్డారు. చేనేత వృత్తులవారు అనుభవించే కష్టాలతో పాటు, వ్యవసాయ భూమిని కోల్పోతే కులవృత్తి కలిగిన వారినైనా కల్లోల పరచే కీలకాంశాలు కథాంతర్గతాలుగా ఉన్నాయి.

ఈ కథల్లో అభివృద్ధిలో భాగంగా ఆరు లైన్ల రోడ్డు మూలంగా తన భూమిని కోల్పోయిన రైతు సుబ్బయ్యయితే, తమ్మిలేరు ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా వ్యవసాయ భూమిని కోల్పోయిన మరోరైతు బాలయ్య "దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకైన వ్యవసాయ రంగం ఉసూరుమంటుంటే మిగిలిన రంగాలన్నీ క్రుంగిపోతాయి. ఈ వాస్తవాన్ని నేతలు విస్మరిస్తున్నారు. నేటికీ దేశ జనాభాతో 72 శాతం భూమినే నమ్ముకొని బ్రతుకుతున్నారు" –అంటారు డా.యలమంచిలి శివాజీ (అన్నదాతా సుఖీభవ – రైతన్నను దెబ్బతీసే సంస్కరణలు. పుట. సం.218) కాబట్టి ' భూ నిర్వాసితులైన రైతులు' తమ జీవితాలలో ఏర్పడ్డ మార్పులను ఇముడ్చుకోలేక సాగుబడి భూమిలేక అల్లాడిన స్థితి 'ఆగిసాగిన అడుగులు' 'అగ్నిస్పర్శ' కథల్లో కనిపిస్తోంది. అన్నంపెట్టే రైతన్నల భూములన్నీ పట్టణాభివృద్ధి దిశగా, ప్రాజెక్టుల రూపకల్పనలో భాగంగా, రియల్ఎస్టేట్ వ్యాపారంతో మటుమాయమైపోతే ఒక్కసారిగా భవిష్యత్తు తరాలన్నీ ఆకలితో నకనకలాడిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇది ఊహ మాత్రమే కాదు రాబోయే తరాలకు ఎదురయ్యే కీలక ముప్పు.

రైతులు వ్యవసాయపరంగా నష్టపోతే వారు జీవితంలో అప్పుల బారినపడి, ఆ అప్పులు తీర్చడానికి తమ భూములను సైతం కోల్పోయి నిరాశ్రయులవడంతోపాటు, నగల్ని బ్యాంకులో తాకట్టుపెడితే సిండికేట్ మూలంగా ఆ నగలను విడిపించుకోవడానికి ఎదుర్కొనే వేదన, అయోమయస్థితిని చూపిన మరో కథ 'సిండికేట్' ఈ కథలో సుబ్బయ్యకు రెండెకరాల భూమి ఉంది. వ్యవసాయంపై ఆధారపడే జీవించాడు. కూతురి పెళ్లికోసం అప్పులు చేశాడు. పంటపై వచ్చే లాభంతో అప్పులు తీర్చాలనుకొన్నాడు. వర్షాలు సకాలంలో కురవలేదు. పంటలు పండలేదు. అప్పులు అలాగే నిల్చిపోయాయి. తన కూతురి నగలను బ్యాంకులో తాకట్టుపెట్టాడు. ఆ నగల్ని విడిపించుకోవడం కోసం తనకున్న పొలాన్ని సైతం తనఖా పెట్టాడు. కానీ, సుబ్బయ్య బ్యాంకులో 'సిండికేట్' కు లోనై ఆ నగల్ని విడిపించుకోవడానికి అనేక రకాల బాధలు పడ్డాడు.

రైతుకు పంట నష్టమయితే ఆ పంట పండించే భూమిని అమ్మాల్సిన స్థితి రావడమనేది కథలో కనిపించే ముఖ్యమైన విషయం. "చిన్న బీదరైతులు ఏ ఒక్క సంవత్సరం పంట నష్టమైనా తట్టుకోలేరు. మధ్యతరగతి రైతుల్లో పై స్థాయి వారు,

ఆ పై స్థాయి ధనిక రైతులు, భూస్వాములు రెండు మూడు సంవత్సరాలైనా తట్టుకోగలరు. ఆపైన వారూ చేతులెత్తవలసిన స్థితి. దుర్భిక్ష స్థితి నెదుర్కొనేందుకు పంటల ఇన్సూరెన్సు కొన్ని సంవత్సరాల నుండి దేశంలో ప్రారంభమైంది. కానీ, మన ప్రకృతి వైపరీత్యాలు కల్గించే నష్ట స్థాయికీ ఇన్సూరెన్సు వ్యవస్థ కల్పించే రక్షణ స్థాయికీ ఏ మాత్రమూ పొంతన లేదు" అంటూ సాధు సుబ్రమణ్యం శర్మగారు (మేటి భారతదేశం-చారిత్రక తాత్విక స్ప్రింగ్‌బోర్డు పరిశీలన.పుట.529.530) పంటల నష్టాన్ని గూర్చి తెలిపారు. కావున పంట నష్టం కలిగి రైతులు పడే అవస్థలకు అనుగుణంగా వ్యవసాయరంగంలో మరింత మెరుగైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలి. దుర్భిక్ష పరిస్థితుల్లో రైతులకు ఋణ సౌకర్యాలను అధికంగా కల్పించి ఆదుకోవడం చాలా అవసరం.

"బీటలెత్తిన బీళ్ళ శోకం' కథలో సుబ్బయ్య ఓ రైతు వ్యవసాయం ప్రధాన వృత్తి. తాతల కాలంలో ఎంతో హాయిగా, ఆహ్లాదభరితంగా సాగిన వ్యవసాయ జీవనం తన కాలంలో కరువు బారిన పడి భూములన్నీ బీటలు వారడంతో తమ ఆకలి ఎలా ఉన్నా, పశువుల ఆకలి తీర్చడం ప్రధాన బాధ్యతగా మారింది. సుబ్బయ్యకు ప్రాణాలకు సైతం తెగించి అడవుల లోలోపలికి వెళ్ళి మరీ పశువులను మేపాడు. వాటిని బ్రతికించుకోవాలని ఆరాటపడ్డాడు. అయితే మూగజీవాల ఆకలి తీర్చే తరుణంలో తానే సమసిపోయాడు.

> ***ఈ కథలో పశువుల ఆకలిని తీర్చాలని, వాటిని బ్రతికించుకోవాలని ఆరాటపడే సుబ్బయ్య మనసును గమనిస్తే ఓ రైతుగా అతని వ్యక్తిత్వం అర్థమవుతోంది. ఇంతటి లోతైన పరిశీలనను రైతులపరంగా, పశువుల ఆహారపరంగా ఆలోచించారు రచయిత.***

మన వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో జంతుసంపద ఒక ముఖ్య పాత్రను పోషిస్తున్నది. చిన్న ఉపాంత రైతులకు వ్యవసాయ పనులలోనూ, వ్యవసాయానికి అవసరమైన ఎరువులకోసం ఇప్పటికీ పశుశక్తే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. వీటితో పాటు పాల ఉత్పత్తులకోసం కూడా పశువుల అవసరం ఉంది. కానీ మన రాష్ట్రంలో పశువుల మేత సదుపాయాల కొరత ఉంది. కరువు ప్రాంతాలలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ కథలో కూడా సుబ్బయ్య ఎదుర్కొన్న సమస్య ఇదే. ఆకలి మన మనుషులకైనా, పశువులకైనా సమానమే అని ఆలోచించి పశువులను మేపుతున్న సుబ్బయ్య అడవిలో ఒంటరిగా సంచరిస్తుండడంతో పోలీసులు నక్సలైటుగా భావించి కాల్చేశారు. ప్రధానంగా ఈ కథలో పశువుల ఆకలిని తీర్చాలని, వాటిని బ్రతికించుకోవాలని ఆరాటపడే సుబ్బయ్య మనసును గమనిస్తే ఓ రైతుగా అతని వ్యక్తిత్వం అర్థమవుతోంది. ఇంతటి లోతైన పరిశీలనను రైతులపరంగా, పశువుల ఆహారపరంగా ఆలోచించారు రచయిత.

'మోయలేని నిజాలు' కథలో రచయిత కరువు ప్రళయ తాండవ స్వరూపాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. అనంతపురం ప్రాంతంలోని కరువును, అక్కడి ప్రజల దయనీయస్థితిని, పశుగ్రాసం కరువవ్వడం వల్ల పశువులు, ఆకలితో అల్లాడిపోయి చివరికి కళేబరాలుగా మారిన తీరును చూపారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన గడ్డి కేంద్రాల వద్దకు గుంపులు గుంపులుగా సంసారాలతోపాటు వచ్చి చేరిన జనం ఆకలితో ఆక్రందనలు చేస్తూ తమ తమ కష్టాల కడగండ్లను వ్యక్త పరుస్తోంటే ఎందుకింత ధీనాతిదీనమైన స్థితి కలుగుతోంది? అనే ప్రశ్న ఏ సగటు మానవుని కైనా కలుగకమానదు. కరువనేది వ్యవసాయ విధానాన్ని, దాని స్వరూప స్వభావాలను సైతం మార్చేసి జీవితంలో ఏ రైతు ఊహించని ఓ దయనీయ స్థితిలోకి వారి వారి జీవితాలను నెట్టేసే స్థితి కథలో ఉంది. మనుషుల ఆకలితోపాటు, మూగ జీవాలు పడే ఆకలి గోడును ఎంతో అద్భుతంగా దర్శింపజేశారు రచయిత. కథలో రచయిత తాను స్వయంగా దర్శించిన అంశాలను, ఎంతో మంది మనోభావ దర్శితాలను వివరించారు. కథ చదువుతున్నట్లు కాక ఆయా వ్యక్తుల ఆకలి కేకలు మనముందు, మన చెవిలో ఘోషిస్తున్నట్లు ఆక్రందనలతో కూడిన స్మశాన ఘీంకారంలా అనిపించింది. జీవచ్ఛవాల లాగా బ్రతుకుతూ చేయూత కోసం, సాయంకోసం ఎదురుచూసే జనాల జీవితాలు ఎంతో దుర్భరం. ఈ కథలో కరువు చూపించే వికృత రూపాన్ని గమనిస్తే ఎవరి హృదయమైనా ద్రవించక మానదు.

మన రాష్ట్రంలోని మొత్తం 23 జిల్లాల్లోని 8 జిల్లాల్లో కరువు అధికంగా ఉంది. అవి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు (రాయలసీమ ప్రాంతం), రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ (తెలంగాణా ప్రాంతం), ప్రకాశం (కోస్తాంధ్ర ప్రాంతం) ఈ జిల్లాల్లో మొత్తం 30 మిలియన్ల ప్రజలు నివసిస్తుండగా రాష్ట్రవ్యాప్తంగా కరువుల వల్ల ఏర్పడే పంట నష్టంలో 70 శాతం వీటిలోనే ఏర్పడుతోంది. ఈ జిల్లాల్లోనే రాష్ట్రంలోని కొన్ని అత్యంత పేద ప్రాంతాలు, వర్గాలు ఉన్నాయి.

వాతావరణ శాస్త్రపరంగా "అవపాతంలో చాలాకాలం పాటు ప్రాంతీయంగా ఉన్న కొరతను కరువు"గా చెప్పవచ్చు. భారత వాతావరణ శాఖ (ఐ.ఎమ్.డి) పేర్కొన్న వాతావరణ శాస్త్రపరమైన కరువు నిర్వచనం ప్రకారం నిర్ణీత ప్రాంతంలో ఒక వాతావరణ సబ్-డివిజన్ స్థాయికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు (ఎల్.టి.ఎ)లో 25శాతం కంటే ఎక్కువగా వర్షపాతం కొరతగా ఉన్న పరిస్థితే కరువు. ఈ కొరత కనుక

## కవిత

# ఖాళీ

- పాయల మురళీకృష్ణ
94410 26977

ఈ గది ఖాళీ చేయబడింది
కళ్ళతో చూస్తుండగానే
చేయబడ్డ ఖాళీ గురించి
మాట్లాడటమంటే
వెంబడిస్తున్న శూన్యాన్ని
ముందుకు వేస్తున్న అడుగులతో
భర్తీ చేసుకోవడమే

ఒక్కోసారి తప్పునిదే అనిపించినా
మరికొంత కాలం
'ఖాళీ' వెనక్కి వెళ్తే
బాగుణ్ణనిపించింది

ముందుగానే
ఎవరో చెప్పారు
ఇక తప్పదని

అప్పుడు గదినిండా
ఆవేదనలు, సానుభూతులు,
ప్రయత్నాలు
ఖాళీ అయ్యే దుర్భర స్థితి వరకు
సమయాలన్నీ
మృత్యువును క్షణాల్లో నింపుకుని,
చుట్టుముట్టి
గదిని స్వాధీనం చేసుకున్నాయి



అవ్యాజమైన ప్రేమ
ఎవరెవర్నో తీసుకొస్తూ
ఏదో ఒకటి చేయమని
గుండెల్ని పిండేసుకుంటుంటే
ఓ శ్రావ్యమైన గొంతులోంచి
స్వరాలన్నీ మెల్లమెల్లగా
మాయమైపోయాయి

పెరికి వేయబడుతున్న నాలుక
ఆనవాలు మిగుల్చుకునే తపన
నిస్సహాయతతో నివ్వెరబోతుంది

శరీరం చేసే పోరాటం సైతం
ఒక్కో కణంగా విడిపోతూ
విచారం ముంగిట ఆకస్మాత్తుగా
అచేతనమయ్యింది

గదిలో ఒక రిఫరెన్సు పుస్తకం
మెల్లగా తెరవబడి
పేజీలు పేజీల్లా విడిపోయి
దూదిపింజల్లా ఎగిరిపోయింది

స్పందించడం మానేసిన
కొన్ని నయనాలు
ఖాళీని స్మరిస్తూ
రాత్రంతా మేలుకున్న మృదంగానికి దూరమై
తోలుకవచాల్లో నిద్రను నటించాయి

ఆ తెల్లవారు జామున
మృదంగం గది ముందోసారి
మోకరిల్లి వెళ్ళిపోయింది

ఖాళీ అయిందనుకున్న గదిలోనుండి
రెక్కలు కట్టుకున్న పాటొకటి ఉద్భవించింది...

అది గదినే కాదు
ఖాళీ గుండెల్ని కూడా
నిరంతరం
భర్తీ చేస్తూనే ఉంది

---

26 శాతానికీ, 50 శాతానికి మధ్య ఉన్నట్లయితే 'కరువు' ఒక మోస్తరు ఉందని పేర్కొంటారు.

ఇలాంటి కరువు వల్ల పంటలు నష్టమై వ్యవసాయమే విచ్ఛిన్నమైపోవడం వల్ల బ్రతుకులు భారంగా మారిన అత్యంత దీనావస్థలు, జీవితాలు, 'బీటలెత్తిన బీళ్ళశోకం" మోయలేని నిజాలు కథల్లో గమనించవచ్చును.

వర్షపాత కొరత, భూగర్భ జలాలు తగ్గుతూ ఉండడం, దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల కరువు ఏర్పడి రైతులు దుర్భర జీవితాలను గడపాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అలాగే ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రోడ్లు, ప్రాజెక్టుల రూపంలో భూములు కోల్పోయిన రైతులు మరో రకమైన కోణంలో జీవితాలను ఎంతో దయనీయంగా గడపాల్సి వస్తోంది. ఈ రెండు రకాల పరిస్థితులలోనూ రైతులు వ్యవసాయరంగ పరంగానే ఎదురుదెబ్బలు తిన్నారు. నల్లూరి రుక్మిణిగారి ఈ కథల్లోని అంతరార్థాన్ని గమనిస్తే దేశాభివృద్ధిలో భాగమైన ప్రాజెక్టులు, రోడ్లు, వీటిమూలంగా రైతులు కోల్పోయే భూముల వలన వ్యవసాయం లేక అనేక అవస్థలు పడడమే కాక, తమ తమ ఉనికికే కోల్పోయిన కోణం రైతుల పరంగా ప్రస్ఫుటంగా తెలుస్తోంది. అలాగే కరువనేది కరువు ప్రాంతాలలో ఎంత భీకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుందో కూడా చూడొచ్చు.

ఆహార సంక్షోభాన్ని అధిగమించడానికి దేశంలో వ్యవసాయరంగాన్ని మరింత పటిష్టవంతం చేయాలి. అందుకు రైతులను, వారి భూములను రక్షించాల్సిన అవసరం చాలా ఉంది. దేశం క్షామానికి గురి కాకుండా వ్యవసాయరంగంలో ఏర్పడే అనేక రకాల సంక్షోభాలను రూపుమాపి, రైతులను "రారాజుల్లా" వెలుగొందనివ్వాలి. అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందినట్లవుతుంది.

## కవిత

## తరగ

- ఎన్.సిహెచ్. చక్రవర్తి
9399958069

జలధి అంతరంగమై
అవ్యక్తమైన భావాలెన్నో వెల్లడిస్తుంది
తరగ తరగతో ముడివడి
తుళ్లిపడుతూ జీవితానికి అర్థం చెప్తుంది
తరం దటినా దాని
అంతరంగం మారదు
క్షణమాగకుండా
బిరబిరా తరలివచ్చి కనువిందు చేస్తుంది
కడలి ఎద సవ్వడులను కడకు చేరేస్తుంది
తీరాల పాదాల చెవిలో ఊదిపోతుంది
ఎగసిపాటు మొదలై దరి చెలియను కౌగలించి
ప్రేమ బిందువులను కక్కి
నవ్వుల జలతారు పండించి పోతుంది
తరగ...
అతిథులను-ముక్కూమోహం తెలీకపోయినా- ఆహ్వానిస్తూ
కాళ్లు కడిగి నీళ్లతో ఆకర్షిస్తూ
ఇసుక తిన్నెలను ఆవహించి, ఆహ్లాదిస్తుంది
గాలిగుండెలో ఊసులకు శ్రుతికలిపి
గిలిగింతల రొదచేసి పోతుంది
ఆడుతున్న అడుగుల మత్తులకు
దరువేస్తూ వంత పాడుతుంది
ప్రణయ విహారాలతో
వలపుల ఊయలలూగుతూ తన్మయులను చేస్తుంది



నావలను గాఢంగా ముద్దాడి
ముత్యాల ముగ్గుల బాటలు వేస్తూ
తీరాలకు చేరుస్తుంది
తరంగం...
ముద్దూ ముచ్చట తీరనిక్షణాన
పసివాని ఉక్రోషంగా బుంగమూతితో
నింగి ఎదలో పొంగాలని సింగారించుకుని
ఉవ్వెత్తున ఎగసిపడి
అల్లకల్లోలపు అల్లరిచేసి తుర్రుమంటుంది
పట్టుకుందామంటే చిక్కక
అంతుచిక్కని అగాధంలోకి పారిపోతుంది
ఆనవాలు చిక్కని చిరునామాగా
ఆదరువై ఆసరా యిస్తుంది
తనగర్భంలోని శాబకాలను
కేరింతలు కొట్టిస్తుంది
జలధరాల నాట్యాలకు
సొంపుగజ్జెలు కడుతుంది
వెన్నెల తట్టులను ఎదపైనిలిపి
అందాన్ని వంపుకుంటుంది
ఉదధి సామ్రాజ్యాన్ని ఏర్పరుచుకుని
పహారా కాస్తుంటుంది
నాల్గు చెఱగులా పట్టుకుచ్చెళ్ళ జడలు వేసి
జారుతున్న వడ్డాణంలా మెరుస్తుంది

---

## ఆకలి సెగలో

- కాశిరాజు
9701075118

ఇల్లుమొత్తం నిండుకున్నా
లేనితనం ఎప్పుడూ లేదు
మాటో, పిలుపో, సర్దుబాటో చేసిపోతావ్
అమ్మేమో అప్పైనా తెచ్చివండేస్తది

బదులివ్వడం తెలిసిన బతుకుల్లో
లేదన్న బాధ తెలీదని
అమ్మ కొసరి వడ్డిస్తున్నపుడే తెలుస్తాది.
ఆకలిగా ఆవురావురంటూ తిని,
కాస్త నిండాక కాళ్ళుసాపుకు తిని
అమ్మా నువ్వుకూడా తిను అన్నప్పుడు
నాకు నిండిందని నిర్ధారించుకున్న మీరిద్దరూ
మాకు ఆకలైనపుడు మెతుకుల్లాగా మారిపోయారు



బడికెళ్ళలేదేరా అని అడుగుతుంటే
బియ్యం లేవన్న సమాధానం
అమ్మ సెప్పిందో,
నా ఆకలే సెప్పిందో తెలీలేదు
ఆ పూట మనం కాలుచుకుతిన్న
పచ్చి చిక్కుడుకాయల
ముదురు గింజలన్నీ
కమ్మదనాన్ని కాదు గాని,
అమ్మదనాన్నే తెలిపాయి.

ఆ పొయ్యి సెగకి
నువ్వు కాస్త నా పక్కకు జరిగాక.
నాన్నా!
ఆకలితో కాదు మనం,
అమ్మతో నిద్దరోయాం.

## విశ్లేషణ

# చైతన్య జ్వలిత - ఐలయ్య కవిత






- పండిట్ ఎలగొండ రాములు

9618598847

***20 కవితలు గల సంపుటి “రహస్య చిత్రం“లో కవితా వస్తువు అనుభవాలు, వాస్తవిక సంఘటనలే. దళిత చైతన్యం వస్తువుగా కలిగిన లాంగ్ పోయెమ్ “నిప్పు కణిక“. “నిప్పు కణిక“ తెలుగు - ఇంగ్లీషు భాషల్లో వచ్చిన ద్విభాష దీర్ఘ కవిత. తెలుగు సాహిత్యంలో రెండు భాషల్లో వెలువడ్డ దీర్ఘ కవిత బహుశా ఇదే మొదటిది కావచ్చు. “దరకమే ఐక్య వేదిక“ కలిగించిన దళిత సాహిత్యోద్యమ ప్రభావంతో సాగిన రచన “నిప్పు కణిక“. తెలుగు నాట దళిత చైతన్యాన్ని తట్టి లేపిన దీర్ఘ కావ్యమిది.***

“మేం నలుపు/ మా శ్వాసలు కారు నలుపు/ మా శిరస్సు మీది ఆకాశం/ మరీ మరీ నలుపు/ మా కనుపాప నలుపు/ చివరికి చరిత్రంతా నలుపు నలుపుల చరిత్రే/ చరిత్రంతా నలుపు మలుపుల చరిత్రే”

అంటూ సెల్ఫ్‌రెస్పెక్ట్ ను ప్రకటించిన వర్తమాన కవి ఐలయ్య.

“జ్వలించు, ప్రజ్వలించు, మండూ, మండిపడూ దగ్ధమై విదగ్ధమై వెలుగివ్వు” అని అట్టడుగు జనాల్ని చైతన్య పరిచే జ్వలన కవనం ఐలయ్య సృజనం.

తెలంగాణా కళల కాణాచి అయిన ఒరంగల్లు నడిగడ్డ పై గల కాకతీయ యూనివర్సిటీ తెలుగు శాఖ ప్రొఫెసరు బన్న ఐలయ్య లేఖిని నుంచి కవిత్వం రెండు పుస్తకాలుగా జాలువారింది.

మొదటిది “రహస్య చిత్రం“ 1989లో, రెండవది “నిప్పుకణిక“ 1998లో ప్రచురితం.

“రహస్య చిత్రం“ కవితల సంపుటి కాగా “నిప్పుకణిక“ దళిత దీర్ఘ కవిత. సాహిత్య రంగంలో ఐలయ్యది. కవిగా మొదటి అడుగు “రహస్య చిత్రం“, రెండవది “నిప్పు కణిక”.

ప్రముఖ కవి అఫ్సర్, ఆచార్య పేర్వార్వం జగన్నాధం మొదటి గ్రథానికి, మద్దూరి నగేష్‌బాబు రెండోదానికి ముందు మాటలు రాసిండ్లు.

నంగునూరి నారాయణరావు లాంటి దొడ్డ దొరల్ని రాజకీయంగా మట్టి కరిపించి, నర్సంపేట మండల ప్రజా పరిషత్తు ప్రప్రథమ అధ్యక్షుడిగా, ప్రధమ పౌరుడిగా ఎదిగిన దళితోద్యమ చైతన్య దీప్తి కె. మల్లయ్యకు “రహస్య చిత్రం“ అంకితం ఇవ్వబడ్డది. రెండో పుస్తకం “నిప్పు కణిక“ కవికి సోదరుడైన బన్న నర్సయ్యకు అంకితం.

20 కవితలు గల సంపుటి “రహస్య చిత్రం“లో కవితా వస్తువు అనుభవాలు, వాస్తవిక సంఘటనలే. దళిత చైతన్యం వస్తువుగా కలిగిన లాంగ్ పోయెమ్ “నిప్పు కణిక“.

“నిప్పు కణిక“ తెలుగు - ఇంగ్లీషు భాషల్లో వచ్చిన ద్విభాష దీర్ఘ కవిత. తెలుగు సాహిత్యంలో రెండు భాషల్లో వెలువడ్డ దీర్ఘ కవిత బహుశా ఇదే మొదటిది కావచ్చు. “దరకమే ఐక్య వేదిక“ కలిగించిన దళిత సాహిత్యోద్యమ ప్రభావంతో సాగిన రచన “నిప్పు కణిక“. తెలుగు నాట దళిత చైతన్యాన్ని తట్టి లేపిన దీర్ఘ కావ్యమిది.

“రహస్య చిత్రం“ పుస్తకంలోని కవితల్లో “చీకటి ఒంటరిది కాదు“ అద్భుత కవిత.

మా స్ట్రీటు లైటు ఆగి ఆగి
కన్ను గీటుతూ ఉంటే
చూసి నవ్వుకుంది చీకటి

..........................................

స్వచ్ఛమైన స్మగ్లింగ్‌కు ఇదే సమయం,/ మా గజ దొంగ గంగన్న ను/ చీకటి బతికిస్తుంది, కానీ/ ఈ దేశం మాత్రం కాదు./.........../ దిక్కు లేక దీనంగా రోడ్డు శిలువకు/ బిగించిన బాల క్రీస్తులు/ చీకటి దుప్పటిని కప్పుకొని ఉన్నారు,/ చెట్టుకు పాకే పడుచు పాముకు/ ఎప్పుడూ పాడు బుద్ధులే/

కాకి గుడ్లను తిందామని – ఇలాంటి వెన్నో ఘటనలు చీకటిలోనే జరుగుతున్నయని, అందుకే చీకటి ఒంటరిది కాదంటాడు కవి. చీకట్లో జరిగే సంఘటనల్ని కవితాత్మకంగా చెప్పినప్పుడు,ఆ సంఘటనల గురించి కాస్త లోతుగా ఆలోచింపజేస్తుంది. స్ట్రీటు, లైటు, స్మగ్లింగ్, గజదొంగ గంగన్న, స్ట్రీటు చిల్డ్రన్, పడుచు పాము మొదలగునవి కవితా రూపంలో అద్భుతంగా చెప్పబడ్డయి. వ్యవస్థలోని అవస్థల్ని ప్రశ్నించి, పాలకులు ఈ సమస్యల్ని పరిష్కరించాల్సిన అవసరాన్ని ధ్వన్యాత్మకంగా చెప్పిందీ కవిత. చీకటి గురించి ఇంత బాగా చెప్పిన ఈ కవిత డా॥ దాశరథి చెప్పిన దట్టమైన చీకటి “తామసి“ని జ్ఞప్తికి తెస్తుంది. అదే విధంగా “దరసం“ సాహితీ సంస్థ ప్రచురించిన “దళిత దేశం“ కవితా సంకలనంలో 1997లో ప్రచురితమైన పిట్ట సాంబయ్య కవిత “ఈ చీకటి“తో బన్న ఐలయ్య కవిత పోలిక ఉండటం ఈ సందర్భంగా గుర్తుకు రాకుండా ఉండదు.


బన్న ఐలయ్య

**‘‘సూర్యోదయాలు/ సూర్యాస్తమయాలు వెల్తురూ పోతూ పోతూ సమస్త వర్ణాలని నలుపులోకి మార్చి పోయిన తరువాత నీ గుండె కుంచె ఏ బొమ్మని చిత్రించుకో లేక పోయిందో ఇప్పుడైనా తెలుకున్నావా?‘‘ అంటూ ‘‘మృత్యు రహస్యం“ కవితలో నలుపు గొప్పతనాన్ని తెల్పటం ధన్యాత్మకంగా అట్టడుగుకు అణగదొక్క బడిన సామాజికుల్ని చైతన్య పరచటమే.**

‘‘ఊపిరిని మింగిన ఉరితాళ్ళు చెప్పే రాలిన శిరస్సుల కథలు వింటూ తెరలు దింపుకుంటుంది కాలం, చెవులూ మూసుకుంటుంది, వింటూనే కునుకు లేస్తుంది““ (కన్నీటి కల)“ నిరపరాధులకు “ఉరి“ వేసి, అన్యాయంగా చంపే అమానవీయ దుష్ట సంస్కృతిని ఉన్నదున్నట్లుగా చెపిందీ కవిత. రాజ్య వ్యవస్థను ప్రశ్నిస్తూ రాజ్యానికి ప్రతీకగా కాలాన్ని చెప్పడం విశేషం. మానవీయత పరిఢవిల్లాలనేది దీన్లోని ధ్వన్యార్థం.

“సూర్యోదయాలు/ సూర్యాస్తమయాలు వెల్తురూ పోతూ పోతూ సమస్త వర్ణాలని నలుపులోకి మార్చి పోయిన తరువాత నీ గుండె కుంచె ఏ బొమ్మని చిత్రించుకో లేక పోయిందో ఇప్పుడైనా తెలుకున్నావా?“ అంటూ “మృత్యు రహస్యం“ కవితలో నలుపు గొప్పతనాన్ని తెల్పటం ధన్యాత్మకంగా అట్టడుగుకు అణగదొక్క బడిన సామాజికుల్ని చైతన్య పరచటమే.

పనిపాటల వర్గ ప్రజలకు ప్రతీకగా చెప్పుకోబడుతది అనేది ఇక్కడ మనం గుర్తించాలె. “నలుపు“ పేరుతో తెలుగులో గతంలో ఒక సాహిత్య మాస పత్రిక కూడా వెలువడ్డది. దళిత కళా మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మాష్టార్జీ రాసిన “బ్యూటీ బ్యూటీ – బ్లాక్ ఈజ్ బ్యూటీ“ పాట నలుపు గొప్పతనాన్ని చెప్పే పాటగా ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలె.

“నేను క్షేమం“ అనే కవితలో పుస్తకం గొప్పతనం అనగా చదువు విలువను చెప్పడం జరిగింది. “చాలా జన్మలకు చదువుకోవలసిన పుస్తకాలను గుండెలో కట్టుకొని తెచ్చుకున్నాను‘‘ – ఈ కవితలో ‘‘మరణించినందుకు బాధ లేదు‘‘ అంటూ బాధను తుంచిన పారసిటమాల్ మాత్రతో పోల్చటం చదువు గొప్పతన్నాన్ని తెలుపుతున్నది.

“బీజం“ కవితలో చైతన్యాన్ని రగిలిస్తున్న తీరు సాహితీ లోకంలో చాలా గొప్పది –

‘‘ఈ చేతులకు స్వేచ్ఛగా సంకెళ్ళు పడ్డాయి/ ........./ గుండె కొలిమిలో ఊపిరి తిత్తుల/ గాలి వేడికి/ లోహాలు ఎరుపెక్కి విరుగుతాయి/........../ ఈ నిట్టూర్పుతెగక ముందే/ నా మరణ జ్ఞాపకం చెదిరిపోక ముందే/ మరెన్నో చేతులు/ పైకి లేవాలి/ అడవిని గాలిలా కప్పుకు పోవాలి/......./ ఎండుటాకుల మీది నినాదాలు నిలవ్వు, గోడల మీద ఎరుపుతో విప్లవాలు రావు’’ మార్పు కొరకంటూ ఎరుపు పేర సాగే ఉద్యమాలు నినాదాల వరకే పరిమితం కాకుండా చక్కని కార్యాచరణ ప్రణాళికతో, సరైన లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలనేది కవి కోరుకునేది. దళితోద్యమాలు కూడా ఉద్యమాలుగా గుర్తించబడి, దళితుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం ఎర్ర పోరాటాల్లో జరగాలనేది కవి తపన.

“శవం చుట్టూ నకిలీ విషాదపు తెరలు దింపి, కన్నీళ్ళనీ పట పటా రాలుస్తారెందుకు“ అంటాడు కవి – “నవ్వకుమీ విషాద సన్నివేశమున“ అనే కవితలో. ఈ కవిత ఏడుపులో గల స్వార్థాన్ని పటాపంచలు చేసింది. బహుజన విషాద ఘటనలు

బహుజనేతరులకు వెకిలి నవ్వుల్ని కలిగిస్తాయని, అందుకే అట్టి ప్రవర్తన సరైంది కాదని కవి భావన.

“రహస్య చిత్రం“ కవితలో – “మధ్య యుగాల శిధిలాల్లోకి నడిచి పోతాను అంటున్న రాజస్థాన్, అది నిజంగా ఎడారే, గుజరాతు నడి వీధుల్లో సునీతలు పరుగెడుతూనే ఉంటారు“. ఈ కవిత రాజస్థాను, గుజరాతు రాష్ట్రాల్లో కొనసాగుతున్న మూఢత్వపు అమానవీయ చేష్టల్ని వివరిస్తున్నది. ఈ కవిత రాయబడిన రోజులలో రాజస్థాను, గుజరాతు రాష్ట్రాల్లో జరిగిన వాస్తవిక సంఘటనలు ఈ కవిత రచనకు ఆధారం. “కన్నీటి

పుండు" కవితలో –

"ఎక్కడెక్కడ నా గుండె మాంసం చిందిందో/ అక్కడొక ఉడా పర్వతం మొలుస్తుంది./ అక్కడొక చీకటి పువ్వు విచ్చుకుంటుంది./ సప్త సముద్రాలు తెగిన దేహాల్తో/ నాలుకల్తో/ రోధిస్తుంటాయి అవిశ్రాంతంగా" –

ఈ కవితలో వ్యక్తి ఏకవచనానికి ప్రతీకగా కాక అణిచివేతకు గురైన సమాజానికి గుర్తుగా చెప్పబడి, సమస్యల పరిష్కారం కొరకు ఉద్యమించే చైతన్యాన్ని అందించడం జరిగింది. బహుజనులు ఎక్కడ హత్య కావించబడ్డారో అక్కడే ఆందోళనలు ఉద్భవిస్తాయని, అవి క్రమంగా ఉద్యమ రూపం దాలుస్తాయని, ఆ విధంగా జరిగినప్పుడే సామాజిక మార్పు సాధ్యమయితదని ధ్వన్యార్థం.

''స్వర్గ నరకాల మధ్య వైతరణి కెరటాల మీద ఊయలూగే బల్లచెక్క ఈ సమాజం" (వైతరణి) – అశాస్త్రీయ మూఢత్వం పాటిస్తున్న సమాజ డోలాయమాన పరిస్థితిని చక్కగా వివరించిందీ కవిత. టెక్నాలజీ పరంగా ఎంతో ఉన్నతిని సాధించిన నేటి కంప్యూటరు యుగంలో కూడా మార్పు జరగకుండా ఉన్నట్టి సమాజ జడత్వ జాడ్యంపై ఇదొక వ్యంగాస్త్రం.

"నెత్తుటి దారులు" కవితలో–

"విత్తనం/ జన్మించడానికి ముందు/ నశిస్తుంది" అంటూ ప్రకృతి సహజత్వం కవిత్వీకరించబడింది. భవిష్యత్తరాలకు మేలు జరగడం కొరకు నేడు మనం త్యాగాలు చెయ్యాలంటుందీ కవిత. సాధారణ విషయానికి అసాధారణ రూపం. "నిశ్శబ్ద స్మశానం" కవిత –

''చచ్చిన ప్రతివాడ్నీ దహనం/చెయ్యాలనేది నియమమైతే,/ ఇక్కడెవడూ బ్రతికిన వాడు కాదు./ అంతా ఎప్పుడో మరణించారు. పులి వెంటపడి లేడిని చంపితే చూసి కళ్ళు మూయని కళ్ళున్నాయా? కనీసం రక్తపు మరకల వద్ద ఉరితీసిన చూపులున్నాయా? పిల్లి మెడలో గంట కట్టాలనే ఎలుకలు నడిపిన రహస్య ఉద్యమానికి నాయకత్వం వహించిన ధన్యజీవి ఎక్కడైనా ఉందంటావా" అంటాడు కవి. సమాజంలో మానవత్వం పెంపొందాల్సిన అవసరతను బలంగా చెప్పిందీ కవిత. సమాజంలో జరిగే హింసను హింసగా గుర్తించి, దాని నిర్మూలనకు ప్రయత్నించాలనేదే ఈ కవిత ముఖ్యోద్దేశం.

తెలుగు సాహిత్యంలో "స్మృతి కవిత" అనే ఒక ప్రక్రియ కొనసాగుతూ ఉన్నది. ఈ కోవకు చెందిందే "చీకటి చిత్ర పటం వెనుక" కవిత –

"కాల సముద్రం అమ్మ కంటిలో/ ఆడుకుంటుంది, అన్నయ్యా!/ అమ్మ గుండె మైదానంలో/ నడిచిన నీ పసి పాదాల సవ్వడి విని/ అర్ధరాత్రి ఉలిక్కిపడి లేచినపుడు/ నిన్ను కంటి చేత్తో తడుముతుంటే/ నేనేం చెప్పను?/ ఏ ఆచూకీ ఇవ్వకుండానే / నువ్వూ, నాయనా చెట్టపట్టాలేసుకొని/ మీ ఆటల్లోంచి మమ్మల్ని వెలేసి/ వెళ్ళి పోయారెందుకో/......./ మేమిప్పుడు ఒంటరులం/ ఎన్ని సార్లు అనుకుంటామో/ మిమ్మల్ని వెతకటానికి బయలుదేరుదామని/ ఇంత మంది మధ్య/ ఇన్ని రోజుల తరువాత/ ఏ మార్గాన వెళ్ళి పోయారో/ తెలిస్తే గదా!/ ఎక్కడ అన్వేషించాలి?/ ఎక్కడ దొరుకుతారు?"

హృదయ విదారక కవిత ఇది. కవి గారి అన్నయ్య, నాన్న మరణించిన సందర్భంలో రాసిన కవిత ఇది. అందుకే ఈ కవిత స్మృతి కవిత. ఎంతటి కఠినాత్ముడైనా ఈ కవిత చదివి కన్నీళ్ళు కార్చాల్సిందే. కవి గుండెలోని ఆవేదనకు అక్షర రూపం ఈ కవిత.

> ***"రహస్య చిత్రం" పుస్తకంలో కవితలన్నీ కవి ఆవేశంగా రాసినవి కాదు, ఆలోచనతో రాసినవి. "ఆవేశంతో రాసేదే కవిత'' అనే నానుడిని తిరగరాసి, "ఆలోచనతో రాసేదే కవిత" అని చెప్పకనే చెప్పిన కవి బన్న ఐలయ్య. తొలి పుస్తకంతో సాహిత్య లోకంలో కవిగా నిలబడ గలిగాడంటే, ఆ పుస్తకంలోని కవిత్వ బలమే, ఆలంబనగా నిలించిందని చెప్పవచ్చు.***

"రహస్య చిత్రం" పుస్తకంలో గల కవితలన్నీ కవి ఆవేశంగా రాసినవి కాదు, ఆలోచనతో రాసినవి. "ఆవేశంతో రాసేదే కవిత" అనే నానుడిని తిరగరాసి, "ఆలోచనతో రాసేదే కవిత" అని చెప్పకనే చెప్పిన కవి బన్న ఐలయ్య. తొలి పుస్తకంతో సాహిత్యలోకంలో కవిగా నిలబడగలిగాడంటే, ఆ పుస్తకంలోని కవిత్వ బలమే, ఆలంబనగా నిలించిందని చెప్పవచ్చు.

"నిప్పు కణిక" దీర్ఘ కవిత సమాజంలో ముఖ్యంగా దళితుల్లో చైతన్యాన్ని కలిగించింది.

"చరిత్ర బాన కడుపులోకి తొంగి చూడు/ మా జీవితాలను చెజేతులా ఎట్లా కోల్పోయామో!"

చరిత్రలో జరిగిన''దగా'' దళితులకు తీరని అన్యాయం చేసిన వాస్తవికతను బట్టబయలు చేసిండు కవి.

"జీవన విషాద వర్ణమే/ ఇప్పటి కవిత్వానికి బీజాక్షరం"/ "కొత్త బీజాక్షరాలను రాస్తున్నాను చూడు/ పంచాక్షరీ అంతా/ పంచమ వర్ణాక్షరమే కాక తప్పదు"–

దళితుల్ని అన్ని రకాలుగా అణగదొక్కిన వైదిక హైందవార్య మనువాదపు అమానవీయతను ప్రశ్నించిండు. "దెబ్బతిన్న కులమే పెడబొబ్బ పెట్టాలె" అన్న జ్యోతిబా పూలేను గుర్తు చేస్తుతుందీ కవిత. ఎట్లాగంటే బహుజన జీవితంలో విషాదాన్ని కలిగించిన సమస్యలే ఇప్పుడు కవిత్వ వస్తువులని, కవిత్వం బహుజనుల్ని చైతన్య పరిచి, సమతను సాధించే తందుకు తోడ్పాటు నిస్తుందని ఈ కవిత చెప్పకనే చెప్పకనే చెప్తుంది.

"ఎన్ని హరిత వనాలు మావి/ కాకుండా పోయాయి?/ ఎన్ని అడవుల మీది గాలులు మమ్మల్ని/ తాక కుండా వీచాయి?"-

అభ్యుదయం, ప్రగతిశీలం పేర్లతో జరిగిన ఎర్ర జెండా పోరాటాలు మూలనివాసి బహుజన ద్రావిడుల్లో ఎటువంటి మార్పును తీసుకొచ్చే ప్రయత్నం చెయ్యలేదనే నిప్పులాంటి నిజాన్ని తేటతెల్లం జేసిండు కవి.

"ఏది పోయి ఏది మిగులుగా ఉందో/ ఏది ఎందుకు ఎవరి మిగులయ్యిందో/ చరిత్రకు తెలుసు/ చరిత్ర ప్రక్కనే వంచించబడ్డ నాకు తెలుసు పోగొట్టుకొన్నదేదో దొరికేదాకా పోరాటం తప్పదు"- ఎంతటి సెల్ఫ్‌కాన్ఫిడెన్స్! ఇంతటి ధైర్యంతో దళితులకు అండగా నిలిచిన కవికి భవిష్యత్తు పై నమ్మకం ఉండబట్టే ఇలాంటి కవిత్వం రాయడం సాధ్యమయింది. "అడుక్కుంటే వచ్చేది బిక్షం, పోరాడితే దక్కేది హక్కు, అధికారం"- అనే డా॥ అంబేద్కరు స్ఫూర్తిని దళితులకు అందించి, పోరాడాల్సిన అవసరాన్ని చెప్పిండు ఐలయ్య.

"కలలే దారి దీపాలు నాకు, అసలు నా కల ఒక్కడిదే కాదు సమూహ నయనంలోంచి తొంగి చూచే నక్షత్ర కాంతే నా కవిత" కలలు కనడం వల్లనే, అవి సాకారం చేసుకునే ప్రయత్నం మొదలయితది. ఇక్కడ "కలలు" కవి వ్యక్తిగతం కాదు, సమూహానికి సంబంధించినవి.

"జారవిడుచుకున్నది తిరిగి/ చేజిక్కే దాకా/ ఎన్ని నదుల ఆనకట్టలు తెగాలో?/ నా చేతులకు తెలుసు,/ ఎన్ని సముద్రాలు ఉప్పొంగాలో?/ నా గుండెకు తెలుసు"- సమస్యల/ పరిష్కారం గురించి జనాల్ని/ "పోరాడుండ్లి" అని చెప్పి, పలాయనవాదిగా పారిపోకుండా తనూ పోరాటంలో ఉన్నానని కార్యాచరణను ప్రకటించడం అందరికీ సాధ్యం కాదు. సామాజిక అవగాహన కలిగి ఉన్న ఐలయ్యలాంటి వారికే సాధ్యం.

"మా చరిత్రకు ఇంతింత మసిబూసి/ మమ్మల్ని అంటరాని వాళ్ళని చేశారు"

అంటరానితనం ఆవిర్భావానికి కారకుల్ని గుర్తించడం, చరిత్రలో దళితులకు జరిగిన అన్యాయాన్ని కళ్ళకు గట్టినట్లు కవిత్వీకరించడం అద్భుతం. ఇలా సామాన్య జనాలకు సులువుగా అర్థమయ్యే విధంగా రాయడం సామాన్యుడిగా జీవితాన్ని గడపడం అనే అనుభవాల అనుభూతులే ఐలయ్య చేతిలో కవిత్వమైంది.

"కలలే దారి దీపాలు నాకు, అసలు నా కల ఒక్కడిదే కాదు సమూహ నయనంలోంచి తొంగి చూచే నక్షత్ర కాంతే నా కవిత" కలలు కనడం వల్లనే, అవి సాకారం చేసుకునే ప్రయత్నం మొదలయితది. ఇక్కడ "కలలు" కవి వ్యక్తిగతం కాదు, సమూహానికి సంబంధించినవి. తాను పుట్టి పెరిగిన సమాజం మొత్తానికి సంబంధించిన సమస్యల పరిష్కార మార్గాన్ని స్వప్నించే ప్రయత్నం చేసిండు కవి. "మార్పు" అనివార్యత కవి కోరుకునేది.

"ఇన్నాళ్ళు మా కున్న భాష కన్నీళ్ళు/ ఇంతకాలం మా కొచ్చిన మాటలు ఆకలి/ ఇప్పటి దాకా మేం నేర్చుకొన్నది వినయంగా/ ఒంగి పోయి తలలు దించటం/ ఇప్పుడు/ మా మాట ఆత్మగౌరవం (స్వాభిమానం)/ ఇప్పుడు మా బాట విముక్తి"-కష్టాలు, కన్నీళ్ళు, ఆకలి అరుపులు గతకాలం మాటలు, ప్రస్తుతం జరుగుతున్న పూలే - పెరియార్ - డా॥ అంబేద్కరు సామాజికోద్యమాల చైతన్యంలో ఆత్మగౌరవం, విముక్తి అనేవి నేటి ఆయుధాలుగా చెప్తున్నాడు కవి.

"మాక్కావాల్సింది/ నిజానిజాల చరిత్ర/ పంచవర్ణాల చరిత్ర పేజీల మీద ఏనాడో మీరు కట్టిన ఉమ్మి ముంతలు పగుల గొట్టాం, మీరు కట్టిన తాటాకు చీపుళ్ళు పట్టాం"- సమాజానికి పట్టిన దుష్టకులం దుమ్ము దులిపేతందుకు తాటాకు చీపుళ్ళు ఆయుధాలుగా ప్రకటించిన కవికి సమాజంలో రానున్న "పరివర్తన" పట్ల ఎంతో నమ్మకం. ఉమ్మి ముంతల్ని పగుల గొట్టిన చైతన్యంతో పంచవర్ణాల చరిత్ర డొల్లతనాన్ని పటాపంచలు చేసిండు.

"ఏ కత్తి మీద ఎవరి/ వేలి ముద్రలున్నాయో/ చెప్పనా?/ ఏ ఉరి తీసిన తల మీద ఎవడి దౌష్ట్యం/ ఉందో చూపనా?/ ఏ పోగొట్టుకున్న మానం మీద/ ఎవడి పతనం ఉందో విన్పించనా!/ ఎందుకంటే/ బతుకులోని విషాదమే ఇప్పటి వర్ణం"

చారిత్రక అన్యాయాల లెక్కల్ని సరిచేసే ఉద్యమ చైతన్యంతో దళితుల్ని మేల్కొల్పుతున్న కవి తాను కోరుకుంటున్నది మానవీయ సమాజమే తప్ప మరొకటి కాదు.

"మా బ్రతుకుల్లో కారు మేఘాలు/ కమ్మినప్పుడం/ కొందరి బ్రతుకుల్లో కాంతి మెరుపులు మెరిశాయి/....../ చేలల్లో ఉరికించి చంపిన/ ఉదంతమేంటి?/ ఎవడి హక్కుల పక్కరా ఈనేలా?/ ఎవడి కాపలా కుక్కరా ఈ చరిత?"

దళితుల బతుకుల్లో కమ్మిన కారుమేఘాల కుట్రల కారకులు కులతత్వవాదులు. వీరి ఆగడాల్ని ఆగ్రహంతో కవిత్వీకరించిండు కవి.

"మేం దస్యులం, మేం శూద్రులం,/ మేం పంచములం, మేం అంత్యజులం,/ మేం అవర్ణులం, మేం కువర్ణులం,/ మేం అనార్యులం" - అంటూ మూలనివాసి బహుజన ద్రావిడ జనాల అస్తిత్వాన్ని స్వాభిమానంతో ప్రకటించిండు.

"మా ఉనికి నాగరికత/ మా అస్తిత్వం మానవత్వం/ కులమే లేనివాడికి, కులమే తెలీనివాడికి/ సహధర్మచారిణులమై/ ఆకాశంలో అరుంధతీ నక్షత్రాలుగా/ నిలిచి పోలేదా?/ నాగలి కనుగొన్న జాతి మాది/ గొడ్డలికి పదును పెట్టిన నీతి మాది"-

దేశ చరిత్ర, నాగరికత నిర్మాణాల మూలకారకులు మూలనివాసి బహుజన ద్రావిడులే అనేది చరిత్ర చెప్తున్న నగ్న సత్యం. దళిత వనిత అరుంధతి గొప్పతనాన్ని చెప్తూ, నాగలి, గొడ్డలి లాంటి ఉత్పత్తిసాధనాల్ని సృష్టించి, సకల జనాలకు తిండిని అందించినోళ్ళు

దళితులే అని స్వాభిమానాన్ని ప్రకటించడం అద్భుతం. కవి కోకిల గుర్రం జాషువా "గబ్బిలం" కావ్య కథా నాయకుడు దళితుడు. అతడి తల్లి పేరు "అరుంధతి", అట్లాగే "నిప్పు కణిక" కావ్యంలో ఐలయ్య

"అరుంధతి"ని ఉన్నతీకరించిన తీరు చూస్తే దళితుల్లో సెల్ఫ్‌కాన్ఫిడెన్స్ నింపుతంది. పి. కృపాకర్ తన "మా అరుంధతి ఆకాశంలో...'' అనే రచనతో సాహితీ లోకాన్ని ఆలోచింపజేసిన విషయం ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవడం అసందర్భంకాదనిపిస్తుంది.

"అరుంధతీయ సమాజం" అనే స్వచ్ఛంధ సంస్థ హైదరాబాదులో దళితోద్యమ తొలినాళ్ళలో ఏర్పడింది. "అరుంధతి" అనే కలం పేరుతో ఒక రచయిత ఉన్నాడు. "అరుంధతీవాణి" పేరుతో ఒక పత్రిక వెలువడుతున్నది.

> ***దళితుల ఆగ్రహం అగ్ని పర్వతాలై బద్దలయిన్నాడే, దళిత సమస్య పరిష్కారమయితదని కవి తండ్లాట."మన దారి దీపం ఆత్మగౌరవం (స్వాభిమానం)/ మన వర్తమానం ఆత్మ విశ్వాసం (సెల్ఫ్‌కాన్ఫిడెన్స్)/ మన భవిష్యత్తు వెల్తురు పర్వతాలు'' అంటూ దళితుల్లో నూతనోత్తేజాన్ని నింపుతున్నడు కవి.***

ఇట్టి ఘన చరితురాలు అయిన "అరుంధతి" పేరును ఇటీవలి కాలంలో ఒక సినిమాకు పెట్టి, దయ్యం, ప్రేతాత్మల వంటి అశాస్త్రీయ కల్పనలతో మనువాదపు కౌటిల్య కుట్రల్నీ సమాజంపై రుద్దడం మూలనివాసి బహుజన ద్రావిడులను అవమానపరచడమే.

"సోదుతో జాతి మురికిని కడిగిన/ చేతులు మావి/......./ బట్టలు కట్టడం నేర్పిన చేతులివి/....../ తలల మాలిన్యాన్ని కత్తిరించినం/....../వేసవి భూముల్లో దేహం/ పగిలిన వాళ్ళం/ మట్టిని లాలించిన చేతులివి/......./ నాగరికతా చక్రాన్ని వేగంగా/ తిప్పాక/ గురువుల ఘాతుకానికి బలైపోయిన/ బొటనవేళ్ళం, అంగుష్టులం"–

సామాజిక ప్రయోజనాన్ని కోరింది పనిపాటల వర్గ ప్రజలే అని కవి వాక్కు . పని చేస్తేనే పంట చేతికి వస్తుంది, కాబట్టి పని చేసే వారికి గుర్తింపు, ఆదరణ రావాలని కవి ఆకాంక్ష.

"మీ మనువు పుట్టక ముందే/ సంస్కృతికి కీర్తి సౌధాన్ని నిర్మించిన/ వాళ్ళం,/ పురుష సూక్తం బీజమైనా పడక ముందే/ నేలనంతా లాలించి ఊయల్లూపాం,/ ఋగ్వేదం అంకురమైనా కన్పించక ముందే/ మేం అన్ని మండలాల్లోను వ్యాపించి ఉన్నాం"–

"దళితులు సాంస్కృతికోన్నతులు'' అనే చారిత్రక వాస్తవికతకు చక్కటి కవితా రూపాన్ని ఇచ్చిండు కవి. ఇట్టి గొప్పతనాన్ని పాలకులు ఇకనైనా గుర్తించాల్సి ఉంది.

"ఈ భూమ్మీద పండిన పంటతో/ ఎవరి గాదెలు నిండాయో?/ ఎవరి బతుకులు ఎండాయో/ మీకు తెలీదా?"–

ఈ ప్రశ్నతో పరాన్న భుక్కుల బండారం బట్టబయలు చేసిండు కవి. దళితులశ్రమ దోపిడీ చెయ్యబడుతున్న తీరుకు ధ్వన్యార్థం ఈ కవిత.

"సూర్యుడిక నుంచి/ బొమికల గూళ్ళలాంటి/ దళితుల శరీరాల్లోంచి/ ఉదాయిస్తాడనే ఆశ ఉంది/ చేరాల్సిన గమ్యం మన గుండెల్లోనే/ ఉంది/ ప్రతి వాడొక గురిపెట్టిన/బాణం కావాలి/ ప్రతి మనిషొక పేలేందుకు సిద్దమైన/ మందుపాతర కావాలి"

దళితుల ఆగ్రహం అగ్ని పర్వతాలై బద్దలయిన్నాడే, దళిత సమస్య పరిష్కారమయితదని కవి తండ్లాట.

"మన దారి దీపం ఆత్మగౌరవం (స్వాభిమానం)/ మన వర్తమానం ఆత్మ విశ్వాసం (సెల్ఫ్‌కాన్ఫిడెన్స్)/ మన భవిష్యత్తు వెల్తురు పర్వతాలు"

అంటూ దళితుల్లో నూతనోత్తేజాన్ని నింపుతున్నడు కవి.

"మాయలతో, మంత్రాలతో/ శుష్కనీతులతో నిండిన/ మరణశాసనం ప్రకటిస్తున్న"–

అశాస్త్రీయ, అమానవీయ, దుర్మార్గపు సాహిత్యాన్ని నిషేధించాల్సిన చారిత్రక నిజాన్ని నిక్కచ్చిగా చెప్తున్నడు కవి.

33 కోట్ల దేవతలెగబడి దళితుల రక్తాన్ని జున్నులాగా జుర్రుతున్న విధానాన్ని గుర్రం జాషువా ప్రశ్నించినట్లుగా బన్న ఐలయ్య కవిత్వీకరిస్తున్నడు.

"అదిగో! 33 కోట్ల దేవతలకు ఉరి తాళ్ళలాంటి వెలుగు కొసలతో మండుతున్న దళిత సూర్యుడు అదిగో! ప్రతి దళితుడూ పుక్కిట పట్టిన నిప్పు కణిక"–

దళితోద్యమానికి వందేళ్ళు చరిత్ర ఉన్నదని చెప్తూ, ఈ చరిత్రే దళితుల దైన్యాన్ని తొలగించే బాధ్యతను నిర్వర్తించినట్లు కవి వ్యక్తీకరించిండు. ఈ చరిత్రలో పూలే–పెరియార్–బాబా సాహెబ్ లాంటి మహనీయులను మైలు రాళ్ళుగా చెప్తూ, ఈ పోరాటాన్ని "నల్ల పిడికిళ్ళ పోరాటంగా" చెప్పిండు కవి.

ఈ దేశ సింహాసనం మూలనివాసి బహుజన ద్రావిడులు అధిష్టించే రోజు వచ్చేంతందుకు ఆచార్య బన్న ఐలయ్య కవిత్వం ఊపిరులూదుతదని, అక్షరాలా అటువంటి రోజు అతి త్వరలోనే వస్తదని ఆశించడం అతిశయోక్తి కాదు.

కథ

*అనువాద కథ*



# నాన్నకు నేనెందుకు చెప్పాలి?

*తమిళ మూలం:* ***అశోకమిత్రన్***

*తెలుగు:* ***చీమలిమర్రి శ్రీనివాసమూర్తి***

***98494 41252***

సరిగ్గా ఎనిమిదింబావుకు, బెంగుళూరు కంటోన్మెంట్ స్టేషన్ ప్లాట్‌ఫామ్ దాదాపు నిర్మానుష్యంగా వుండి, వెలుగు మసకబారింది. ఆ సమయంలో చేతిలో పక్క చుట్ట, మరో చేతిలో పెట్టెతో ప్లాట్‌పాం మీదికొచ్చింది ముసలావిడ. ఏదైనా వివరాలడగటానికి ఎవ్వరూ కన్పించలేదు. ఆమెతోపాటే పన్నెండు, పదమూడేళ్ళ పిల్ల కూడా వుంది, మరో పెట్టెతో.

ఆ ముసలామె అటూ యిటూ చూడటం గమనించి 'నానమ్మా! ఈ పెట్టెలో ఏం పెట్టావు ? అని అడిగింది.

ఎందుకు? బరువుగా వుందా? యిలాగివ్వు నేను తీసుకొస్తాను' అంది.

"ఇప్పటికే రెండు మూటలు మోస్తున్నావు"....

నీవు యింటికి పోవటానికి బస్ వుందా? అడిగింది ముసలావిడ.

"ఉంది నానమ్మా. లేకపోయినా నేను నడిచి పోగలను".

"ఒంటరిగా చీకట్లో నడిచి పోవద్దు"

కానీ మనం వచ్చేటప్పుడు యిద్దరం ఒంటరిగానే వచ్చాంగదా

"మీ నాన్న యింకా యింటికి వచ్చిఉండడు. నన్ను వెళ్ళమని చెప్పిన తర్వాత రైలెక్కించటానికి రాలేదు".

ఆ పిల్ల ఏమీ మాట్లాడలేదు.

కొద్దిదూరంలో స్టేషన్‌లో నున్న టీస్టాల్ గోడకు సమాంతరంగా వుంది. దాని పక్కనే ఉన్న బుక్‌స్టాల్‌లో ఎవరూ లేరు.

"ఆ టీ స్టాల్ వాణ్ణి అడిగి కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ యిదే ప్లాట్‌పామ్ మీదికి వస్తుందో రాదో కనుకోమ్మా" అంది ముసలావిడ.

ఆ పిల్ల ట్రంకు పెట్టె నేలమీద పెట్టి టీ స్టాల్ వైపు నడిచింది. ఆ ముసలామె రెండు చేతులు ట్రంక్ మీద పెట్టి గట్టిగా చుట్టూ వినిపించేలా శ్వాస పీల్చుకుంది.

యిదేనట ఈ ప్లాట్‌ఫామ్ మీదికే వస్తుందట. ఆ పిల్ల తిరిగొచ్చి చెప్పింది.

"లేడీస్ కంపార్ట్‌మెంట్ ఎక్కడొస్తుందో అడక్కపోయావా".

ఆ పిల్ల మొఖంలో ఫిర్యాదులాంటి ఫీలింగ్ మెదిలి మాయమైంది. టీ స్టాల్ లాంటి ప్రదేశానికి ఆ సమయంలో పసిపిల్లలను పంపకూడదని ముసలావిడకు తట్టింది.

"నువ్విక్కడే ఉండు. నేను కనుక్కుని వస్తాను" ఆ ముసలామే స్వయంగా టీ స్టాల్‌కు పోయింది. ఆమె నడిచే తీరు చూస్తే ఆమె కాళ్ళు నొప్పెడుతున్నాయని యిట్టే తెలిసిపోతుంది. తిరిగొచ్చి "ప్లాట్‌పామ్ చివర కొస్తుందట. మనం అక్కడికెళ్ళాలి" అని ట్రంకును ఈ సారి తనే చేతిలోకి తీసుకుంది.

వద్దు నానమ్మా అంటూ ఆ పిల్ల లాక్కోటానికి ప్రయత్నించింది. కానీ అప్పటికే ముసలావిడ ముందుకు అడుగేసింది.

అకస్మాత్తుగా వాతావరణం చల్లగా మారింది. చలిగాలి వీచింది.

ప్లాట్‌పామ్ స్టేషన్ బిల్డింగ్‌ను దాటి చాలా దూరం సాగింది. అక్కడ పైన సిమెంటు రేకులున్నాయి. గానీ నాలుగువేపులా ఖాళీగా వుండటం వల్ల చలిగా వుంది. ఆ ముసలామె ప్లాట్‌పాం చివరకు చేరి ఆగింది. స్టేషన్‌లో మనుషుల కదలిక మొదలయింది. కాని యిరవై, ముప్పయి కంటే ఎక్కువున్నట్లు లేదు.

"నువ్వు వెళ్ళమ్మా రైలొస్తే నేను ఎక్కుతాన్లే" అంది ముసలామె.

రైలు వచ్చిన తర్వాత వెళ్తాను లే బామ్మా"

రైలొచ్చేసరికి చాలా సమయం పట్టొచ్చు. ఇప్పటికే ఆలస్యమైంది. వద్దంటున్నా వినిపించుకోకుండా వచ్చావు. నేను రమ్మన్నానా?

నేను రాకపోతే ఈ సామానంతా ఎలా తెస్తావు బామ్మా?

ఇక్కడికి వచ్చేటప్పుడు ఎలామోసుకువచ్చానో అలాగే. నా సామాను నేను మోసుకోవటం అలవాటయిపోయింది.



"నీ ట్రంకు పెట్టె చాలా బరువుగా వుంది బామ్మా"

అందుకనే దాన్ని నేనే మోస్తాను అన్నాను. కాని నీవు మంకుపిల్లవు"

మద్రాస్ సే బెంగుళూర్ అనే వాలి బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్... లౌడ్ స్పీకర్ నుండి అర్థం కాని గరుకు స్వరంతో ప్రకటన వెలువడింది.

"బామ్మా నీ రైలోస్తోంది

అది యిక్కడికొచ్చే రైలు. యిక్కడి నుండి పోయేది కాదు" అందావిడ.

"నీ కెలా తెలుసు బామ్మా? అమాయకంగా అడిగింది.

"నాకు యివన్నీ బాగా తెలుసు. కాని ఎక్కడ ఎలా బ్రతకాలో తెలియదు" అంది.

"మాతోనే ఉండొచ్చుగా"

నీ వంటే సరిపోతుందా? ఆ ముసలావిడ ట్రంకు మీద కూర్చుంది. ఆ పిల్ల అకస్మాత్తుగా ఏడుపు మొదలుపెట్టింది.

"చూడు తల్లి యిలా చూడు. ఎందుకేడుస్తున్నావ్? ఏమయింది. నా బంగారు కొండవు గదూ. ఏడవొద్దు. మాను...."

ఆ పిల్ల మానలేదు

నా మంచి అమ్మాయివి కదూ ఏడవ కూడదు"

ప్రయత్నపూర్వకంగా ఆ పిల్ల ఏడుపు ఆపుకుంది.

"నాకు చాలా బాధగా వుంది బామ్మా"

ఆ ముసలావిడ మౌనంగా వుండిపోయింది.

ఒక కుటుంబం వచ్చి వారి సమీపంలో నిల్చుంది. భార్య, భర్త, నలుగురు పిల్లలు. మగ పిల్లలిద్దరూ పది సంవత్సరాల ప్రాయంలో కవలల్లా వున్నారు. ఒక చిన్న పిల్ల, చంకలో మరో శిశువు, వాళ్ళు ముసలావిడ వైపే చూస్తూ నిల్చున్నారు. చంకలో పిల్లను మొగుడి కందించి "యిది లేడీస్ కంపార్ట్‌మెంట్ ఆగే చోటే గదా? అంది" ముసలామెతో

"అవును"

కన్యాకుమారి రైలేనా?

"అవును"

"జనం రద్దీ వుంటుందా?

జనం ఎక్కువగా ఈ రైల్లో ఎక్కరు వాళ్ళిద్దరూ కవలలా?

"అవును" ఆయాసపడుతూ చెప్పి" ఈ పిల్ల నీ మనుమరాలా? అని అడిగింది.

అవును నా కొడుకు మునిరెడ్డి పాల్యంలో ఉంటాడు. యిది వాడి కూతురు.

''ఆ పిల్లను ఎక్కడికి తీసుకుపోతున్నారు"?

"నాతో తీసుకుపోవటం లేదు. నన్ను రైలెక్కించటానికి సహాయంగా వచ్చింది"

"యింత రాత్రిలోనా?" ఆమె భర్త కొద్దిగా ఆశ్చర్యంగా అడిగాడు. "నేను వద్దని నచ్చచెప్పాను. కాని మాట వినకుండా వచ్చింది.

"మునిరెడ్డి పాళ్యంలో ఎక్కడ?

మార్కెట్ ఎదురుగా స్మశానం వుంది. దానికి దగ్గర్లోనే"

"నేను పోయేటప్పుడా పిల్లను దిగవిడుస్తాను."

"లేదు నేను నడిచే వెళతాను" వెంటనే అనిందా అమ్మాయి.

ముసలామె అతని వైపు క్షణకాలం చూసింది.

నువ్వు నేరుగా యిక్కడి నుండి నైట్‌డ్యూటీకి పోవాలిగదా అని ఆయనకీ వేళ రాత్రిడ్యూటీ" అని సంజాయిషీగా అనిందా భార్య, రెండో మాట ముసలామెనుద్దేశించి.

అప్పటికే ప్లాట్‌ఫామ్ మనుషులతో నిండిపోయింది.

"జనాలు ఎక్కువ ఉండరన్నారు? అంది భార్య ముసలామెతో

వీళ్ళంతా మద్రాసు రైలుకోసం వచ్చారు. ఈ సమయంలో రెండుమూడు రైళ్ళున్నాయి".

మీకు రైళ్ళ వివరాలు బాగా తెలుసల్లే వుందే"

ముసలామె తన మనుమరాలి ముఖం వైపు చూసింది. ఆ పిల్ల తిరిగీ మౌనంగా వెక్కిళ్ళు పెడుతోంది. పిల్ల భుజం మీద ఆప్యాయంగా చెయ్యేసి ప్రక్కకు తీసుకెళ్ళింది.

"నువ్వు అనవసరంగా ఏడిస్తే ప్రయోజనమేముంది తల్లీ" అంది అనునయిస్తూ.

"అమ్మా నాన్నలు ఎందుకిలా తయారైనారు బామ్మా" అమ్మాయి అడిగింది వెక్కిళ్ళ మధ్య.

"ఏమయిందిప్పుడు? వాళ్ళిద్దరూ బాగానే వున్నారు గదా. కుటుంబాన్ని సజావుగా నడపటానికి పడరాని తంటాలు పడుతున్నారు."

"కాదు బామ్మా. నీవు మా దగ్గరే వుండాల్సింది. అవునా? మరి వాళ్ళు నిన్నెందుకు వెళ్ళమన్నారు?"

పిచ్చిపిల్లా! వాళ్ళు నన్ను వెళ్ళమనలేదు. నేనే మాయింటికి వెళ్ళి పోవాలనిపించి పోతున్నాను. యిదంతా నీవు మనసులో ఉంచుకోకు. యిక నువ్వు వెళ్ళటమే మంచిది. వీళ్ళున్నారుగా. వీళ్ళ సహాయంతో నేను రైలు ఎక్కేస్తాను. ఒక్క దానివే యింటికి పోగలవు గదా?" అంది. ఆ పిల్ల కన్నీరు తుడుచుకుంది.

"నేను వెళ్ళిపోతాను బామ్మా" అంది

ముసలామె ఆ పిల్లను దగ్గరగా తీసుకుని ప్రేమగా ముద్దాడింది.

నేను పాపను దింపి వెళ్తాను. మళ్ళా అన్నాడు భర్త.

వద్దులెండి. అదే వెళుతుంది. దారి తెలుసు. మునిరెడ్డి పాళ్యంరోడ్ పట్టుకుంటే నేరుగా వెళ్ళిపోవచ్చు. భయపడాల్సిందేమీ లేదు అంది ముసలామె. తిరిగి మనుమరాలి వైపు చూస్తూ నువ్వెళ్ళమ్మా, స్టేషన్‌కు వెళ్తానని మీ అమ్మతో చెప్పాడు వాడు యింకా ఎందుకు రాలేదో.



బుగ్గలు కళ్ళు తుడుచుకుంటూ ఆ పిల్ల వెళ్ళి పోయింది. మాటి మాటికి వెనక్కు తిరిగి చూస్తూ, ప్లాట్‌ఫామ్ మీద గంట కొట్టారు. యింకో రైలు రాక గురించి మైకులో మరో అనౌన్స్‌మెంటు. ముసలామె వెనుక నిల్చున్న ఆ వ్యక్తి శిశువును భార్యకందించి, సూట్‌కేసును బ్యాగ్‌ను అందుకున్నాడు. ముసలావిడ తన సామానంతా ఒక చోట చేర్చుకుంది. తిరిగి చూస్తే తన మనుమరాలు కన్పించింది.

"ఏమయిందమ్మా" అడిగిందామె

నీవు రైలుక్కిన తర్వాతే వెళతాను బామ్మా

మొదటిసారిగా ముసలావిడ కళ్ళు చెమ్మగిల్లి మసకబారాయి.

మెల్లగా ఒక రైలు స్టేషన్‌లో కొచ్చి ఆగింది. కుటుంబంతో వచ్చిన యువత ఎక్కటానికి ప్రయత్నించింది. కాని ముసలావిడకు అనుమానమేసింది. "యిది కన్యాకుమారి పొయ్యేదో తిరుపతి పొయ్యేదో అడగండి" అనింది. ఆమె అనుమానం నిజమైంది. అది తిరుపతి పోయే రైలు. అరగంట లేటుగా నడుస్తోంది.

"అయితే మన రైలు కూడా లేటవుతుంది" అతనన్నాడు భార్యతో రైలు రాగానే నీవు ఎక్కగలుగుతావా? అవ్వగారు కూడా తోడున్నారుగా. నాకు డ్యూటీ టైము అయింది. వెళ్ళిపోవాలి.

అర్ధ మనసుతో భార్య సరేనంది

అతను ముసలామె వైపు తిరిగి "మీ పాప వచ్చేట్లయితే యింటి దగ్గర దింపి వెళ్తాను వస్తావా పాపా" అన్నాడు.

మనుమరాలికి మాత్రమే అర్థమయేలా ముసలామె వద్దని సైగ చేసింది." దాని నాన్న వస్తానన్నాడు. బహుశా వస్తుండొచ్చు అదుగో..."

ముసలామె చూపించిన వైపు ఆ పిల్ల ఆతృతగా చూసింది ఆ పిల్ల ఎవరూ కనిపించకపోయేసరికి నిరాశ చెందింది.

కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ వచ్చేసరికి రాత్రి తొమ్మిదింబావు అయింది. మద్రాసు పోయే రైలు ఎక్కటానికి వచ్చిన జనాలతో ప్లాట్‌ఫామ్ కిట కిటలాడుతోంది, గుంపులు గుంపులుగా, తాము ఎక్కాల్సిన కంపార్ట్‌మెంట్సు అక్కడే ఆగుతాయని వాళ్ళకు తెలుసు. కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఆడవాళ్ళ బోగీ ఎదుట జనం ఎక్కువగా లేరు. ముసలామె తన సామానుతో రైలెక్కిన తర్వాత పిల్లల తల్లి కూడా ఎక్కేసింది. పిల్లలతో ముసలామెకు కిటికీ ప్రక్క సీటు దొరక్కపోయినా కిటికీలోనుండి చెమ్మగిల్లిన కళ్ళతో చూస్తూ నిల్చుంది. బామ్మను చూడటానికి భయపడుతున్న దానిలా ఆ పిల్ల వేరే ఎటో చూస్తోంది. రైలు బయలుదేరుతుంటే, దగ్గరకు పిలిచి "యిది ఉంచుకో" అంటూ మడిచిన పది రూపాయల నోటు ఆ పిల్ల చేతిలో కుక్కి పిడికిలి మూసింది.

"నీకు డబ్బుల్లేవుగా బామ్మా! నాకిస్తే ఎలా?"

నాకు అవసరమైనంత డబ్బుందమ్మా. నీవు జాగ్రత్తగా యింటికి వెళ్ళు" అంటూ అరిచిందామె. నడిచే రైలుతోపాటే ఆ పిల్ల నడవాలని ప్రయత్నిస్తూ నాలుగైదు అడుగులు వేసింది. కాని రైలు వేగం పుంజుకుని స్టేషన్‌ను దాటి వెళ్ళిపోయింది.

త్వర త్వరగా నడుస్తూ ఆ పిల్ల ప్లాట్‌ఫాం దాటింది.

"బామ్మ వెళ్ళిపోయిందా"

సుపరిచితమైన కంఠం తిరిగి చూసింది... ఆ పిల్ల తండ్రి

"లోపలికెందుకు రాలేదు నాన్నా" అడిగిందా పిల్ల తండ్రిని

టికెట్ కౌంటర్ దగ్గర రద్దీ ఎక్కువగా ఉందమ్మా. ప్లాట్‌పామ్ టికెట్ దొరకలేదు అన్నాడు సంజాయిషి యిస్తూ...

తను కూడా ప్లాట్‌పాం టికెట్ తీసుకోలేదు

తండ్రికి ఆ విషయం చెప్పలేదు.

## కవిత

# మాటల మడుగు

- మెర్సీ మార్గరెట్
9052809952

ఒకప్పుడు
నోటి నిండా మాటలుండేవి
మాటలకు మొలకల వేళ్ళుండేవి
పచ్చగా మొలకెత్తేందుకు అవి
సారవంతమైన నేలలు వెతికేవి

ఒకప్పుడు
నోటినిండా మాటలుండేవి
మాటలన్నీ శిల్పాలుగా మారేందుకు
ఒకదాన్నొకటి పెనవేసుకుని, అంటిపెట్టుకుని
ఉలి మొన స్పర్శ కోసం సిద్ధమై
శిల్పాలవడానికి ఆత్రంగా ఉవ్విల్లూరేవి



ఒకప్పుడు
నోటినిండా మాటలుండేవి
మాటలన్నిటి కాళ్ళకి ఘల్లున మ్రోగే
మువ్వలుండేవి
మువ్వలన్నీ సంతోషంగా నృత్యం చేస్తూ
మాటలకు విలువ పెంచేవి

అవును
ఒకప్పుడు నోటి నిండా మాటలుండేవి
మాటలకు రుచుండేది
మసక కన్నుల్ని వెలిగించే నిప్పు రవ్వలుండేవి
చెమట చుక్కల్ని కౌగలించుకునే చేతులుండేవి
కడుపు నింపే ధాన్యపు గింజల్లా ఉండేవి

కాని ఇప్పుడేమయ్యిందో
నోటినిండా మాటలున్నాయి
మాటలన్నీ గాలికి తేలిపోయే తాలులా
వరిపొట్టులా ఉన్నాయి

మాటల్ని తోడుకునే నాలుక చివరనుండి
గొంతుకపై కొన్ని చేతుల ఉరి కాపలాకాస్తుంది
మాటలన్నీ గవ్వలై
మట్టి పెళ్లలై
కాళ్ళు చేతులు విరిగిన బొమ్మలై
నిస్తేజంగా ఉన్నాయి

ఇప్పుడూ నోటినిండా మాటలున్నాయి
మాటలన్నీ ఆ పహారాకి ఘనీభవించి
గడ్డకట్టి
మంచు శిలలై , మౌన తపస్సు చేస్తున్నాయి

ఎవరైనా సహాయానికి రండి నాతోపాటు
ఆ చేతుల్ని నరికి మంటజేసి
మాటల్ని కరిగించడానికి
మళ్ళీ ఆ మాటల్ని ప్రాణమూర్తుల్ని
చేయడానికి

ప్రస్థానం వెబ్‌సైట్: www.prasthanam.com

'ప్రస్థానం' కు చందా కట్టండి!
నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!

అయిదేళ్లకు : రు. 500 /-, పదేళ్లకు : రు. 1000/-,
సంవత్సర చందా (వ్యక్తులకు) : రు. 120/-,
సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-
విడి ప్రతి : రు. 10/-



5,10 సం॥ల చందా కట్టిన వారికి సుమారు 1000/-లు విలువ చేసే పాత ప్రస్థానం పుస్తకాలు ఉచితం.
■ ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు అదనం

ఒక మంచి పత్రికకు చందా కట్టండి! - తెలుగు సాహిత్య కృషిని ప్రోత్సహించండి!!

ప్రస్థానం

ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20
వివరాలకు : 040-27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్ : ssprasthanam_@gmail.com ; www. prasthanam.com

## విశ్లేషణ

# బాధల గాథలు 'గుడిసె ఏసోబు కథలు'




- డా॥ విజయబక్ష్
9441382303

***ఈ కథల్లోని సంఘటనలన్నీ వాస్తవాలే; ఈ కథల్లోని పాత్రలన్నీ సజీవంగా నడయాడేవే! ఏ పల్లె కెళ్ళి చూచిన ఇట్లాంటి మనుషులు, వారి అమాయకత, వెతలు, అవిద్య, దారిద్ర్యం, అసమానతలు మనకు కనబడేవే! రచయితే చెప్పినట్లు అట్టడుగు వర్గాల్లో ఏం జరుగుతుందోననే విషయాల్ని తెలియచెప్పాలనే తపనే ఈ కథలన్నింట వ్యక్తమౌతోంది.***

**డి.** గోపి రాసిన చిన్న కథల పుస్తకం గుడిసెఏసోబు కథలు' "గుడిసెఏసోబు" దళిత కథలు అనే టైటిల్‌తో దళిత స్త్రీ సాహిత్యపరిషత్ విజయవాడ వారు ప్రచురించిన ఈ పుస్తకంలో మొత్తం ఏడు కథలు వున్నాయి. రచయిత ముందు మాటలో చెప్పినట్లుగా 'నే విన్న బాధలే నే కన్న కథలు' అనేది నూటికి నూరుపాళ్ళూ నిజం. కథ అనగానే కథా కథనశిల్పం, ఎత్తుగడ –కొసమెరుపు లాటి వగైరా వగైరా కథ కుండవలసిన లక్షణాలన్నీ ఈ ఏడు కథల్లో వెతికి చూచే ప్రయత్నం చేయకుండా కేవలం సంఘటనల్నీ, అదీ వాస్తవిక సంఘటనల్ని కథలుగా మలిచిన తీరు, ప్రయత్నాన్ని తప్పక అభినందించవలసిందే.

ఈ కథల్లోని సంఘటనలన్నీ వాస్తవాలే; ఈ కథల్లోని పాత్రలన్నీ సజీవంగా నడయాడేవే! ఏ పల్లె కెళ్ళి చూచిన ఇట్లాంటి మనుషులు, వారి అమాయకత, వెతలు, అవిద్య, దారిద్ర్యం, అసమానతలు మనకు కనబడేవే! రచయితే చెప్పినట్లు అట్టడుగు వర్గాల్లో ఏం జరుగుతుందోననే విషయాల్ని తెలియచెప్పాలనే తపనే ఈ కథలన్నింట వ్యక్తమౌతోంది.

సమాజంలోని కింది కులాల వాళ్ క్రైస్తవంలోకి మారినంత మాత్రాన ఒనగూడే ప్రయోజనాలు ఏమి లేవని అదే అగ్రవర్ణాలు వారు మారితే అక్కడ కూడా వారి ఆధిపత్యం కొనసాగుతుందని వారి కులం కూడా వారితోపాటే వస్తోందని (అందుకే జాన్సన్ రెడ్డి, లాజర్ చౌదరిలు కనబడతారు) అంటాడు.

ఈ అన్ని కథల్లో 'ఏసోబు' కనబడతాడు. తన కథ, తన తోటి వారి కథ, తన రక్తసంబంధీకుల కథ అన్నింటిలోను ఏసోబు ప్రమేయం వుంటుంది. అతని బాధా తప్త జీవితం రగిలే గుండె, పరిస్థితులతో రాజీ, ఎదిరించలేని అశక్తత వెంటాడే బీదరికం వున్నాయి. వీటన్నింటితోపాటు 'దేవుని' పట్ల గాఢమైన విశ్వాసమూ వుంది.

'మా కాన్మెంటు కథ'లో ఏసోబు అతని భార్యా తమ ఒకగానొక్క కొడుకును కాన్వెంట్‌లో చేర్చాలనుకొంటారు. వాళ్ళలాగ వెట్టిచాకిరి చేయకుండా పిల్లాడు చక్కగ చదువుకొని ఏదో ఓ నౌకరి చేయాలనేది తల్లిదండ్రుల ఆశ... ఎందుకంటే ఏసోబు తండ్రి ఏసోబు చిన్నతనంలోనే చనిపోతాడు. ఏసోబుకి ఎనిమిదేళ్ళు నిండినప్పటి నుండి పెద్దరెడ్డి గారి గేదెల దగ్గర 'బుడ్డపాలేరు'గ కుదురుతాడు. ఆ తర్వాత పెళ్ళయ్యేక పాలేరు అయ్యేడు. ఆ పని మానేసి సొంతగా బతకాలని కూలీ అయ్యేడు. పిల్లాడు పుట్టేడు. నాలుగేళ్ళొచ్చేయి వాడికి వాడ్ని కాన్వెంట్‌లో చేర్చి చదివించాలనే గాఢమైన కోర్కె. ఆ కాన్వేంటులో చదివేది అంతా పెద్ద పెద్ద వాళ్ళ పిల్లలు. ఆ కాన్వెంటు పెద్దమ్మగారు ఏసోబు కొడుకుని కాన్వెంటులో చేర్పించుకోటానికి ఒప్పుకోరు. బోలెడన్ని ఖర్చులు చెప్పి భరించటం నీ వల్ల కాదు వెళ్ళిపొమ్మంటుంది. గేటు దగ్గరి పోలీసోడు జబ్బపట్టుకొని బయటకి గెంటుతాడు. ఏసోబు బతిమాల్తాడు "అమ్మా! పెద్దమ్మగోరుకొత్త దయ సూడండమ్మా.... నేనమ్మ యేసోబుగోణ్ణి. సాములోరి మతపోణ్ణి తల్లి... ఈ కాన్వెంటు మా పిల్లల కోసమే అన్నారుగామ్మా ఆ యేల. మీరు కూకున్న గది మేం కట్టించేదేనమ్మా! అమ్మా పెద్దమ్మగోరు మేం మతపోల్లమే తల్లి! బీదల్లమమ్మా... అని రకరకాలుగా వేడుకొంటాడు.

ఆ కాన్వెంటు నిర్మాణంలో పాలుపంచుకొని, తమ పిల్లల భవిష్యత్తు కోసమని పోరంబోకు భూమిలో రాళ్ళూరప్పల్నీ పగలగొట్టి, పునాదులు తీసి, సిమెంటు కట్టలు మోసి, యినుప చువ్వలు వంచి, ఎన్నెన్నో పనులు చేసారు. అదీ సంతోషంతో

ఎక్కువ కూలీ తీసుకోకుండా! ఎందుకు? తమ పిల్లల చదువు కోసమని, పిల్లల భవిష్యత్ కోసమని! అయితే జరిగిందేమిటి! ఆ కాన్వెంటులో చదువుకొనేదంత పెద్దోళ్ళ పిల్లలే! పైగా పనులు చేసే వారంతా ఎక్కడి నుండో పెద్దమ్మగోరు తెచ్చుకొన్న వాళ్ళే! పైసా తీసుకోకుండా అంత కష్టపడ్డ తమ పిల్లలకి చదువుకోటానికి హక్కు లేదు కాని 'ఉన్నోళ్ళ' పిల్లలకది జన్మతః వచ్చిన హక్కా? అని వాపోతాడు.

''పట్టుపరుపు'' అనే కథలో ఏసోబు భార్య పురిటినొప్పులతో సతమతమవుతోంటే ప్రసవానికి పట్టణానికి తీసుకువెళ్ళాల్సివస్తోంది. ఆసుపత్రి ఖర్చులకు నూట ఏభై రూపాలకుగాను' లాగుకట్టుకోటం' కూడా రాని తన నాలుగేళ్ళ కొడుకుని భవిష్యత్తుని, రక్తాన్ని తాకట్టుపెడతాడు. పెద్దరెడ్డి గారి బర్రెల కాడ పిల్లగాడ్ని పెట్టటానికి ఒప్పుకొంటాడు. ఆ డబ్బుతో భార్య ప్రసవం ఖర్చులు జరుగుతాయి. షరా మామూలే. పేదోళ్ళకు ఎట్లాంటి వైద్యం దొరుకుతుందో అటువంటి వైద్యమే దొరుకుతుంది. అడిగినంత డబ్బు యివ్వలేని కారణంగా ఏసోబు భార్యకు వైద్య మాలన్యమై బిడ్డ పుడుతోంది. కాని 'చచ్చిన బిడ్డ' నర్సు ఈసడిస్తూ ఏసోబుతో 'చచ్చిన పిల్లని కన్నందుకు ఇంటికి తీసికెళ్ళి పట్టెమంచం పట్టుపరుపు వేసి పూజించుకో నీ పెళ్ళాన్ని అంటోంది.

ఆర్థికావసరం, భార్య ప్రాణాలు నిలుపుకోవాలనే తాపత్రయంతో ముక్కుపచ్చలారని బిడ్డడ్ని పెద్దరెడ్డిగారి దగ్గర తాకట్టు పెట్టాడు. ఏసోబు. భార్య చచ్చిపోయిన బిడ్డని కన్న దాని కంటే తన సంటోన్ని తాకట్టు పెట్టిన విషయమే ఏసోబుని ఎక్కువ బాధిస్తోంది. పేదోళ్ళకు ఉన్నోళ్ళు చేసే అవసరార్థం సాయం చివరికి వారి నెటువంటి బానిసత్వపు ఊబిలోకి దించుతోందో ఈ చిన్న కథ చెబ్తోంది.

'బీదోల్ల యేసు' కథలో వచ్చే జాను' పాత్ర తన వారిని మేలుకొల్పాలనే ఆశ, ఆశయం గల ఫాదర్ పాత్ర ఏసు ప్రభువు పేదోళ్ళ కోసమే బతికాడని చెబుతుంటాడు. దేవుని పేరిట లేని వాళ్ళంతా డబ్బులేనుకొని, చందాలు పోగుచేసి ఖర్చుపెట్టనవసరం లేదంటాడు. అందుకే క్రిస్మస్ రోజున పెద్ద లైటింగ్ పెట్టి డబ్బు ఖర్చు పెట్టి ఆర్భాటం చేసే దాని కంటే ఎవరో ఒకరి పాకలో ఏసు స్వరూపాన్ని పెట్టి పూజ చేద్దామంటాడు. అట్లా చేస్తే సాములోరికి, పెద్దమ్మగారికి కోపం వచ్చి మనల్ని ప్రశ్నించుతారేమో అంటే జాను గూడెపోళ్ళని ప్రశ్నిస్తాడు "ఇపుడు మాత్రం మన అవసరాలు తీరుస్తున్నారా? ఎంతమందికి పెద్దమ్మగారు మందులిస్తున్నారు? అసలు ఈ పెద్దమ్మగారు గాని, సాములోరు గాని మన గుడిసెలకు వస్తున్నారా? మన సాదక బాధలు వాళ్ళకేమన్నా తెలుసా?

***ఆర్థికావసరం, భార్య ప్రాణాలు నిలుపుకోవాలనే తాపత్రయంతో ముక్కుపచ్చలారని బిడ్డడ్ని పెద్దరెడ్డిగారి దగ్గర తాకట్టు పెట్టాడు. ఏసోబు. భార్య చచ్చిపోయిన బిడ్డని కన్న దాని కంటే తన సంటోన్ని తాకట్టు పెట్టిన విషయమే ఏసోబుని ఎక్కువ బాధిస్తోంది.***

'ఈ సాములోరు పెద్దమ్మగారికి మనం కావాలే గాని, వాళ్ళకి మన కష్టసుఖాల అవసరం లేదు. ఆకలి కడుపుతోనైనా మనం బ్రతికి వుండి వాళ్ళ పూజకి రమ్మంటే వెళ్ళాలి. చందాలిమ్మంటే యివ్వాలి అంతే. మన అవసరం వాళ్ళ గుళ్ళు నింపుకోవడానికే! మన సంఖ్య వాళ్ళు యితర దేశాల నుండి లెక్కలేనన్ని డబ్బులు తెచ్చుకోడానికే నిజం చెప్పాలంటే మనం యింత మందిమి పేదవాళ్ళమున్నామని చెప్పి సంచులనిండా డబ్బులు తెచ్చుకోవచ్చు. అంటే మనల్ని ఇతర దేశాలకి అమ్ముకొని సొమ్ము చేసు కుంటున్నారు."

దాంతో అందరిలో ఆలోచన బయలుదేరి యాకోబు పాకలో బాలఏసుని పెట్టి ప్రార్థన జరిపి క్రిస్మస్‌ను చేసుకోవాలని నిర్ణయానికి వస్తారు. దేవుడైనా అంతే మా పాకల్లోనే వుండాలి. మాకు మల్లే బతకాలి. బీదోళ్ళతోనే వుండాలి అని రచయిత ఓ విప్లవాత్మక మైన మార్పు కోరుకొంటాడు.

ఏ మతంలో అయినా దేవుని పేరిట జరిగే అక్రమార్జన తీరు తెన్నులెట్లా వుంటాయో ఈ కథ చెబుతోంది.

'ఆ బోర్డింగుకి యెల్లను' కథలో ఏసోబు బామ్మర్ది బోర్డింగ్‌లో చదువుతుంటాడు. కాని వెళ్ళనని మారాం చేస్తుంటాడు. అక్కడ బోర్డింగులో బ్రదర్‌గారు పిల్లల్ని ఎంత నీచంగా చూస్తాడో చెబుతాడు. ఇంటికి పోతే తింటానికి మెతుకులు వుండవ్ మీకు. ఇక్కడేమో వెధవ వేషాలా? పొట్టకోస్తే అక్షరం ముక్క రాదు. గొడ్లని కాసుకుని బ్రతకాల్సిన వాళ్ళని సదువుకోండి రా అని తీసుకొచ్చి హాస్టల్లో సీటిచ్చి, ఉచితంగా తిండి పెడతా వుంటే మీకు పొగరెక్కిందిరా...' అని అక్కడ పిల్లల్ని కొట్టడం, చిత్రహింసలు పెట్టడం చేస్తుంటాడు.

"మాయదారి తుపాను' కథలో ఏసోబు అనుకొంటాడు. ''ఈ ఉప్పెన ఎప్పుడొచ్చినా మాగుడిసెలేనా నాశనం అవుతున్నాయి. మేం చేసిన పాపం యేంటో తెలవదు.

తుఫాను బాధితుల సహాయార్థం గవర్నమెంట్ వారి జీపు వస్తోందని కళ్ళు కాయలు కాసేట్టు చూచే జనాలకి అంతకంటే ముందుగ వచ్చిన "సాములోరి" జీపు కనబడ్డది. ఎంతో సాయం చేస్తారని కొండంత ఆశతో ఎదురు చూస్తోన్న ఆ అమాయకులకి కావాలంటే గుడిసెలు కప్పుకోటానికి తాటాకు మాత్రం యిస్తామని మొండి చేయి చూపారు సాములోరు. అంతే కాదు ఎంత నష్టం జరిగిందో, వారి పరిస్థితి ఎట్లా వుందో తెలుసుకొని రిపోర్టురాసి, వారి చేత సంతకాలు మాత్రమే తీసుకొని రమ్మన్నారు తండ్రిగారని చెబుతారు. జనాలకు కోపం పెల్లుబుకుతోంది. పైగా వాళ్ళ

ఇంగ్లీషు సంభాషణ. అది ఒక్క జాను బాబుకు తప్ప వేరెవరికి అర్థం కాదు. వీళ్ళు తక్షణ సహాయంగా అడిగే డబ్బు వారివ్వక పోగా పైనున్న తండ్రి గారికి పంపి, అవి మంజూరు అయేక తండ్రిగారు విచారణ జరిపి ఎవరికెంతివ్వాలో అవి ఆ సాములోరి కిస్తే అప్పుడు జనాలకిస్తామంటారు. దానికి వారితో ఒకడు ఒళ్ళు మండి – తండ్రిగారిచ్చే డబ్బుల్లో మీ మోటారు సైకిలుకీ, పండ్లు పలాలకే సాలవాయే' అంటారు.

మతం పేరుతో దైవం పేరుతో జరుగుతోన్న దళారి వ్యవస్థకిది అద్దం పడుతోంది. పళ్ళూడగొట్టుకొంటానికి ఏ రాయైతే ఏం అన్నట్లు మోసగింప బడటానికి ఏ మతంలో వుంటే ఏం అన్న నిజం కనబడుతోంది.

ఆ తర్వాతి కథ 'అమ్మగార్లేనా మనుషులు'. కథలో ఇద్దరు నన్స్ (అమ్మగార్లు) పై అత్యాచారం జరగటం గురించి. వారిపై జరిగిన అత్యాచారం ఖండిస్తూ స్వాములోర్లు, అమ్మగార్లు దేశవ్యాప్తంగా ఆందోళనలు, బందులు చేపడ్తారు. వారిపై జరిగితే ఇంత సీరియస్‌గా తీసుకొన్నారు కదా, మరి మన కంచికచర్ల ఆర్లప్పను నిలువనా చంపితే ఎవరు ఎందుకని పట్టించుకోలేదు అనేది ప్రశ్న. అంతా ఒక మతపోళ్ళే అయినా బీదోళ్ళ మీద జరిగే అన్యాయం అన్యాయం కాదా? అని ఆ సందర్భంలో రకరకాల ప్రశ్నలు లేవనెత్తుతారు. శత్రువులకు సైతం ప్రేమించమని ప్రభువు చెప్పాడని, మన విషయాల్లో చెప్పేవారు. మరి అమ్మగార్ల విషయంలో శత్రువును శిక్షించమనటం ఏమిటి? అని చిట్టచివరికి దళిత క్రైస్తవుల పట్ల స్వాములోర్ల దొంగబుద్ధిని ఖండిస్తూనే, అమ్మగార్లపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ న్యాయం కోసం కృషి చేయాలని జానుబాబు చెప్పిందానికి అంతా అంగీకరిస్తారు.

> ***వాస్తవ సంఘటనలకు అతనిచ్చిన కథారూపం ఇది. కొన్ని ప్రాంతాలతో సహా తాను విన్న కన్న వాస్తవాలను చెప్పాడు. ముఖ్యంగా ఈ కథల్లో మనకు కనిపించే అంశం ఏమిటంటే క్రైస్తవ మతంలో చేరి ముందుగ బాగుపడ్డ వారు తమ తర్వాత వారిని అభివృద్ధి చెందనివారిని చూచే చిన్న చూపు.***

ఇక చిట్టచివరి కథ 'మీ కోసం.... మీ పిల్లల కోసం' కథకి 'ఆ బోర్డింగుకి యెల్లను' కథ కంట్యూనేషన్– అదే పొడిగింపు ఏసోబు బావమర్ది బోర్డింగులో చదువుకొనేవాడు, అక్కడ వార్డెను పెట్టే హింసలకు బెదిరిపోయి మళ్ళీ అక్కడికెళ్ళమని మొండికెత్తినా అందరూ తలోమాట చెప్పి పంపిస్తారు అక్కడికే. తిరిగి అక్కడ వార్డను చేతిలో చివాట్లు – తన్నులు తినటం అంతే కాక ఆయన కోపంతో ఈ పిల్లోడికి గుండు చేయించటం. తల్లిదండ్రులని పిలుచుక రమ్మని పంపటం. పిల్లాడు ప్రమాదవశాత్తో, కావాలనో కాలవలలో పడి శవమై తేలటం– ఇదీ కథ. ఏసోబు, అతని భార్యతో ఆ చుట్టు పక్కలుండే యాకోబు, సామేలు, మోసే, ఏసుపాదం, శౌరితాత, జానుబాబు అంతా గుమిగూడతారు. ఓదారుస్తారు వాళ్ళిద్దర్ని. ఇప్పుడేం చేయాలా అన్న దానికి 'ఏం సేత్తంలే మనం. మీ కోసం– మీ పిల్లల కోసం యేడ్వండని యేసు ప్రభువు సెప్పలేదూ? అంతకంటే యేం సేత్తం' అంటాడు యాకోబు.

ఆ మాటల్లో వ్యవస్థని ఏమి చేయలేని కసితో పాటు ఆ కనిపించే దేవుడు తమపై విధించిన పెద్ద కర్తవ్యం పట్ల ఈసడింపు కూడా కనబడ్తోంది.

కథలన్ని చదివేక రచయిత గోపి ముందుమాటతో చెప్పినట్లుగా 'నేవిన్న బాధలే నే కన్నకథలు' అనేది సత్యదూరం కాదు. వాస్తవ సంఘటనలకు అతనిచ్చిన కథారూపం ఇది. కొన్ని ప్రాంతాలతో సహా తాను విన్న కన్న వాస్తవాలను చెప్పాడు. ముఖ్యంగా ఈ కథల్లో మనకు కనిపించే అంశం ఏమిటంటే క్రైస్తవ మతంలో చేరి ముందుగ బాగుపడ్డ వారు తమ తర్వాత వారిని అభివృద్ధి చెందనివారిని చూచే చిన్న చూపు. ఈ విషయమే ప్రఖ్యాత దళిత రచయిత, తత్వవేత్త బి.ఎస్. రాములు అంటాడు. నిజానికి ఇటువంటి ఓ సంఘటనే నా అనుభవంలోకి వచ్చింది – భార్యాభర్తలిద్దరు టీచర్ల ఉద్యోగాలు చేస్తూ తాము సంపాదిస్తూ, పిల్లల్ని చక్కగా కాన్వెంట్లలో ఫీజులు కట్టి చదివిస్తూ, మంచి ఇల్లు కట్టుకొని, తమ వాకిట ఉన్న చేతిపంపులో నీళ్ళు తీసుకెళ్ళటానికి వచ్చే తమ కులపోళ్ళనే 'అలగాజనం'తో పడలేకపోతున్నామనే మాట నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. వాళ్ళు ప్రభుత్వం నుండి అన్ని విధాల రిజర్వేషను లాభాలు పొందుతూ, చదువుకొని చక్కగ స్థిరపడినందుకు తమ వారికి గూడ చేయి సాయమిచ్చి పైకి తేవటానికి సహకారమందించక పోగా యీ వ్యాఖ్యానమేమిటని చాలా బాధపడ్డాను. అదే సమయంలో ఈ గుడిసె ఏసోబు కథలు నా చేతికి రావటం, నేను చదవటం– ఇట్లా తమవారే తమని తక్కువ చేసే విధానాన్ని యింత చక్కగ చెప్పటం ఎంతో నచ్చింది. ఏసోబు పాత్ర నొక్కదాన్నే ప్రధానంగా ఈ ఏడు కథల్లో దళిత క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయాల్ని, అసమానతలను హృదయం కరిగించేలా చెప్పాడు.

కథల పుస్తకం చిన్నదే! కథలూ చిన్నవే. కాని ఇందులో ప్రస్తావించబడిన అంశాలు ఎంత పెద్దవో, ఎంత వాస్తవమో చదివితే గాని తెలీదు! ప్రతి ఒక్కరూ తప్పక చదవవలసిన కథలు 'గుడిసె ఏసోబు' దళిత కథలు– పుస్తకాన్ని ప్రచురించిన దళిత స్త్రీ సాహిత్య పరిషత్ వారికి కన్వీనర్ బి.ఎం.వీరాకుమారికి అభినందనలు చెప్పకుండా ఉండలేము.

నివాళి



# ప్రజాశక్తి రేఖా శేఖరుడు

**- తెలకపల్లి రవి**

*శేఖర్ వరసగా కొన్ని దజన్ల ఐడియాలు వేసుకొచ్చేవాడు. బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేసేవరకూ వేస్తూనే ఉండేవాడు. నిజంగా అది అరుదైన పరిశ్రమ. తన అభివృద్ధితో పాటు శేఖర్ భార్య చంద్రకళకు కూడా చదువు, కంప్యూటర్ అన్నీ నేర్పించాడు. కార్టూనిస్టులను సంఘటితం చేయడంలో చొరవ చూపించాడు. నిజానికి ఈ రకరకాల కార్యక్రమాలతో కార్టూన్ రేఖలను మెరుగు పర్చుకోవడంపై శ్రద్ధ పెట్టడం లేదని నేను అప్పుడప్పుడు అంటుంటే నిజమే అనేవాడు.*

కార్టూనిస్టు కంబాలపల్లి శేఖర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్నప్పుడు ఆపుకోవాలనుకున్నా కళ్లలో నీళ్లు తిరిగాయి. యూనివర్సిటీలో చదువు పూర్తిచేశాక కేవలం కార్టూన్ కళ మీద, జర్నలిజం మీద ఆసక్తితో తను వచ్చాడు. మలిదశలో ప్రజాశక్తికీ తనే మొదటి పూర్తిస్థాయి కార్టూనిస్టు. అంతకు ముందు కొందరు బయిటి మిత్రులు, కొంత కాలం పత్రికలో ఇతర ఉద్యోగాలు చేసేవారు కార్టూన్లు వేసి అందించేవారు. వాటిలో కొన్ని బాగున్నా పూర్తిస్థాయి కార్టూను లేని లోపం కొట్టవచ్చినట్టు కనిపించేది. ఆ దశలో వచ్చాడు తను సూర్యాపేట నుంచి. ఎప్పుడూ అదే తపన. సాధన. ఇద్దరం కూచోవడం, చర్చించడం. కొద్దిసేపట్లో ప్రాథమిక నమూనా తయారు చేసుకుని రావడం ఒక నిరంతర క్రమంలో సాగేది. తనకు వేరే ధ్యాస కూడా ఉండేది కాదు. కాకుంటే సాహిత్యం, కళల పట్ల, వ్యంగ్య రచనల పట్ల ప్రత్యేక ఆసక్తి చూపేవాడు. ప్రజాశక్తిలో చేరాకే నెమ్మదిగా నిలదొక్కుకున్నాడు.

అది చాలా సవాళ్ల కాలం. అంతర్జాతీయంగా సోవియట్ విచ్ఛిన్నం, బిజెపి పెరుగుదల వంటి పరిణామాలన్నీ సంభవించాయి. వాటిని ఎన్నెన్ని విధాలుగా చిత్రించాలో అదంతా చేసేవాడు. ప్యాకెట్ కార్టూన్, పెద్ద కార్టూన్, ఆదివారంలో పావు పేజీ, వ్యాసాలలో క్యారికేచర్లు, పార్టీ ప్రచార కరపత్రాలు, పోస్టర్లకు బొమ్మలు పుంఖానుపుంఖంగా వేసుకొచ్చేవాడు. 1996లో వాజ్‌పేయి బలం లేకున్నా ప్రభుత్వం ఏర్పాటు చేసి 13 రోజుల్లో దిగిపోయింది. ఆ సమయంలో ఒక అగ్రశ్రేణి పత్రిక అదేపనిగా బిజెపి ప్రచారం చేసింది. దానిపై రాజకీయ వ్యాఖ్యాత పేరుతో నేనో వ్యాసం రాశాను. మధ్యలో శేఖర్ పెద్ద కార్టూన్ వేశాడు. అందులో పత్రిక పేరు రాయలేదు గాని అర్థమవుతుంది. అది ఎంత ప్రభావం చూపిందంటే సంబంధిత అధినేత కొన్నేళ్ల వరకూ ఆ కోపం తగ్గించుకోలేకపోయారు. తెలుగు పత్రికల కార్టూన్లలో స్థూలంగా రెండు, మూడు ధోరణులు ఉండేవి. కొన్ని రాజకీయ ప్రధానం, కొన్ని హాస్య ప్రధానం. ఈ రెంటినీ మేళవించి మేలైన కార్టూన్లు వెలువరించాలన్నది మా ప్రయత్నం. ఈ క్రమంలో శేఖర్ వరసగా కొన్ని దజన్ల ఐడియాలు వేసుకొచ్చేవాడు. బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేసేవరకూ వేస్తూనే ఉండేవాడు. నిజంగా అది అరుదైన పరిశ్రమ. తన అభివృద్ధితో పాటు శేఖర్ భార్య చంద్రకళకు కూడా చదువు, కంప్యూటర్ అన్నీ నేర్పించాడు. కార్టూనిస్టులను సంఘటితం చేయడంలో చొరవ చూపించాడు. నిజానికి ఈ రకరకాల కార్యక్రమాలతో కార్టూన్ రేఖలను మెరుగుపర్చుకోవడంపై శ్రద్ధ పెట్టడం లేదని నేను అప్పుడప్పుడు అంటుంటే నిజమే అనేవాడు. కాని తన తపన తగ్గదు గనక మళ్లీ అదే ధోరణిలో పడిపోయేవాడు.

కార్టూన్ల మీద ప్రేమ తప్ప పత్రికారంగంతోనూ, అసలు ఉద్యోగంతోనూ సంబంధం లేని శేఖర్ వాటన్నిటినీ అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టింది. తన కార్టూన్లకు కంబా అని పేరు పెట్టుకుని ప్రారంభించాడు. అయితే అంతకంటే శేఖర్ అన్న పేరు బాగా గుర్తుండిపోతుందంటే నిజమేనని అంగీకరించి ఆ పేరునే స్థిరపర్చుకున్నాడు. అప్పుడే ఆయనను ఈ రంగం నుంచి మార్చి ఏదో ఉద్యోగం వేయిస్తానని వాళ్లన్నయ్య వచ్చాడు. శేఖర్‌కు ఇష్టం లేదు. ఆయనకు నచ్చజెప్పాను. తనలో కళను పెంపొందిస్తే అతి తక్కువగా ఉన్న కార్టూనిస్టులలో ఒకడుగా మిగిలిపోతాడనీ, ఉద్యోగం చేస్తే బతుకు తెరువు దక్కినా అసంతృప్తి మిగిలిపోతుందని వివరిస్తే ఆయనా పెద్దమనసుతో సరేనంటూ అనుమతించి వెళ్లిపోయాడు. మోటూరు హనుమంతరావు గారు, బొమ్మారెడ్డి గారి వంటి పెద్దలు కూడా శేఖర్‌ను ఎప్పుడూ

ప్రోత్సహించేవారు గాని వయస్సు రీత్యా, బాధ్యతల రీత్యా నాతో ఎక్కువ దగ్గరగా ఉండేవాడు. ఒకసారి ఏదో పత్రికలో ఉద్యోగ అవకాశం వస్తే కొంత వరకూ వెళ్లి చేరలేక వెనక్కు వచ్చాడు. ఆ వచ్చే ముందు ఒక ఉత్తరం రాశాడు. ఇంత జరిగాక మళ్లీ చేర్చుకుంటారా అని. ఆర్థిక ఒత్తిళ్ల వల్ల అలాటి ప్రయత్నం చేస్తే పెద్ద అపరాధం కాదని మళ్లీ చేర్చుకున్నాము. తర్వాత తను మరింతగా కృషి చేశాడు. అయితే మరో మూడేళ్ల తర్వాత జీవితం ఆయనను ఇతర పత్రికల వైపు నడిపింది. మొదట ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, అప్పుడే చంద్రబాబు పరిపాలన ప్రపంచ బ్యాంకు సంస్కరణలు వంటివాటిపై రేఖాస్త్రాలు. తర్వాత చివరి వరకూ ఆంధ్రజ్యోతిలో నిర్విరామంగా కార్టూన్లు వేస్తూ తనకంటూ ఒక ముద్ర వేసుకున్నాడు.

ఏ పత్రికలో పనిచేసినా తనను ప్రజాశక్తి ప్రొడక్టుగా, నా దగ్గర తర్ఫీదు పొందిన వ్యక్తిగా చెప్పుకునేవాడు. ఇతరులూ అంటుండేవారు. నిజానికి అతని స్వయం కృషే ప్రధానమైంది. ఇతర పత్రికల్లో చేరిన తర్వాత కూడా శేఖర్ ప్రజాశక్తికి అడపాదడపా సహకరిస్తూ రేఖాచిత్రాలందిస్తూ వచ్చాడు. పుస్తకాల టైటిల్ పేజీలు చేసేవాడు. ఇవన్నీ పెద్ద మొత్తాలేమీ ఆశించకుండా ఆసక్తి ప్రధానంగానే చేస్తూ వచ్చాడు. మా ఇద్దరితో పాటు మరికొందరు మిత్రులు కూడా ఈ మొత్తం ప్రస్తానంలో నడుస్తూ వచ్చారు. తన తమ్ముడు కంభాలపల్లి కృష్ణ కూడా ప్రజాశక్తిలో పనిచేసి ఆ తర్వాత టీవీ మీడియా వైపు వెళ్లాడు.

2000 సంవత్సరం విద్యుచ్ఛక్తి ఉద్యమం బషీర్ బాగ్ కాల్పుల తర్వాత ఫొటోలతో ఆల్బం ప్రచురణ, ఫొటో ఎగ్జిబిషన్ ప్రయోగాలు చేయాలని నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి రాఘవులు సూచించారు. వ్యాఖ్యానం రాసి ఫొటోలు ఎంపిక చేసి శేఖర్‌కు అప్పగిస్తే చాలా హృద్యంగా రూపొందించాడు. అది పూర్తవుతున్న తరుణంలో రామకృష్ణ మరణవార్త వచ్చింది. దాన్ని తనకు తానే మంచి వ్యాఖ్యతో కలిపి తీసుకొచ్చాడు. అప్పటి నుంచి అదొక వొరవడిగా స్థిరపడింది. నూతన ఆర్థిక విధానాలు, ప్రపంచబ్యాంకు, బిజెపి మతోన్మాదం వంటివాటిపై తను వేసినన్ని కార్టూన్లు మరెవరూ వేసి ఉండరేమో. ఈ సమయంలోనే సాహితీ స్రవంతి ప్రారంభ దశలోనూ శేఖర్ బాగా సహకరించాడు. ప్రస్థానం లేఔట్ నమూనా కొంతవరకూ ఆయన అందించిందే. గత పదేళ్లలోనూ ఆ పత్రికకు చిత్రాలు వేస్తుండేవాడు. తన కార్టూన్ల తొలి పుస్తకం ముందు మాట నాతో, ఎబికె ప్రసాద్‌తో రాయించి మాష్టార్లు సర్టిఫికెట్ ఇచ్చారని ప్రత్యేకంగా వేయించుకున్నాడు. బయిటకు వెళ్లగానే ఉద్యమాన్ని, ప్రారంభాన్ని మర్చిపోయే చాలామందితో పోల్చితే శేఖర్ పూర్తి భిన్నంగా కనిపిస్తాడు. బి.వి.రాఘవులు అంటే బీదల విప్లవం రాఘవులు అని వివరణ ఇవ్వడం ఆయన అభిమానానికి ఒక ఉదాహరణ. ఒక విధంగా తననెప్పుడూ ప్రజాశక్తి బృందంలో భాగంగా భావించుకునేవాడు. దేశ వ్యాపితంగానూ అందరూ గుర్తించే కొన్ని సాంకేతిక ప్రక్రియలు ప్రవేశపెట్టి శభాషనిపించుకున్నాడు. ఈ మధ్య అమెరికా పర్యటనకు అవకాశం వచ్చింది.

> ***గత మూడు నాలుగేళ్లలో శేఖర్ తెలంగాణ వాదం, అస్తిత్వవాదంపై కేంద్రీకరించి పనిచేస్తూ వచ్చాడు. అభిప్రాయాల కారణంగా ఒకింత ఎడం పెరిగిందని భావించేవాడు. అయినా హఠాత్తుగా ఊడిపడి మీరు కాస్తయినా విమర్శ శ్లేష కలిపి మాట్లాడితేగాని తుప్పు వదలదంటూ అలా గంట గంటన్నర కూచుని పోయేవాడు.***

గత మూడు నాలుగేళ్లలో శేఖర్ తెలంగాణ వాదం, అస్తిత్వవాదంపై కేంద్రీకరించి పనిచేస్తూ వచ్చాడు. అభిప్రాయాల కారణంగా ఒకింత ఎడం పెరిగిందని భావించేవాడు. అయినా హఠాత్తుగా ఊడిపడి మీరు కాస్తయినా విమర్శ శ్లేష కలిపి మాట్లాడితేగాని తుప్పు వదలదంటూ అలా గంట గంటన్నర కూచుని పోయేవాడు. ఈ క్రమంలో తను చెప్పేవి, వినేవి ఎన్నో. ఏదైనా బాగా నచ్చితే ఫోన్ చేసి అలా మాట్లాడుతుండేవాడు. తన మీద వ్యాఖ్యలు చేస్తే ఆనందించేవాడు. అయినా బాధ్యతలు, బరువులు బాగానే ప్రభావం చూపించాయి. పిల్లల చదువులు, ఇల్లు వంటివి పూర్తి చేసుకునేలోగానే కాన్సర్ దాపురించింది. ఆ మాట విన్నప్పుడు చాలా బాధనిపించింది. మనిషిని చూశాక ఇంకా పెరిగింది. ఎందుకంటే బాగా ముదిరిపోయాక గాని గుర్తించలేదు. అన్ని విషయాల్లో ఎంతో ఆరాటం చూపే నీవు ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయడం ఎలా జరిగిందని ఆశ్చర్యం, ఆవేదన కలిగాయి. కానీ అది అంతిమఘట్టం అని వైద్యులు చెప్పకతప్పలేదు.

శేఖరం అంటే గట్టితనం. శేఖర్ మొదట్లో దుర్బలంగా ఉండి తర్వాత లావయ్యాడు. చివరలో మళ్లీ శల్యావస్థకు వచ్చాడు. కానీ ఆయన దృఢత్వం పెరిగింది. కులం కాన్సర్ పేరిట ఈ దశలో ఒక పుస్తకం తీసుకువచ్చి అందరినీ కదిలించాడు. ఆంధ్రజ్యోతి అధినేత రాధాకృష్ణ, సంపాదకుడు కె శ్రీనివాస్‌ల సహాయంతో అనారోగ్యంలోనూ ఆఖరి వరకూ– ఇంకా చెప్పాలంటే ఆఖరి రోజు వరకూ కార్టూన్లు వేశాడు. ఎందుకంటే సోమవారం కూడా ఆ పత్రికలో ఆయన బొమ్మ వచ్చింది. ఇది చాలా అసాధారణమైన విషయంగా నిలిచిపోతుంది.

శేఖర్ గురించి పత్రికల్లో పెద్దలు రాస్తున్నా ప్రగాఢ పరిచయమున్న నాకు ఆఖరి మాటల తరహాలో రాయడానికి మనసొప్పలేదు. అవన్నీ కలిపి ఇప్పుడు మిత్రునికి ప్రజాశక్తిలో తయారైన ఆ ప్రగతిశీల వ్యంగ్య చిత్రకారుడికి సాశ్రునయనాలతో నివాళులు రాయడం చాలా బాధాకరమైన అనుభవం. జోహార్ శేఖర్.

# స్వీకారం

## శివారెడ్డి పీఠికలు




సంపాదకులు: పెన్నా శివరామకృష్ణ, గుడిపాటి

వెల : రూ.40/- పేజీలు : 500

ప్రతులకు : 040-23244088

వారి ముందుమాటలు చదివినప్పుడు ఇంతటి అద్భుత వచనం ఎలా రాయగలుగుతున్నారనిపించేది. కానీ శివారెడ్డిలోని గొప్ప కవిని గురించే తప్ప వారిలోని సృజనాత్మకమైన వచన రచయిత గురించి ఎవరూ పెద్దగా మాట్లాడిన దాఖలాలు లేవు. అంతేగాక భిన్నకాలాల్లో వారు రాసిన ముందుమాటలు వారి వచన శైలినే గాక, ఆయా కాలాల సామాజిక, సాహిత్యచరిత్రని రికార్డు చేసే విలక్షణ సంపద కదా అనిపించింది.

**- గుడిపాటి**

## కొల్లేటి జాడలు




నవల

- అక్కినేని కుటుంబరావు

వెల : రూ.100/- పేజీలు : 221

ప్రతులకు : ప్రముఖ పుస్తకాల షాపుల్లో

కుటుంబరావుగారు మంచి సినిమాలు తీశారు. ఆ మాధ్యమం పట్ల ఆయనకి గాఢమైన ఆసక్తి ఉంది. అందుకే ఆ దృశ్య విభజన, దృశ్యమాలిక మనకి ప్రత్యక్షమై దోనెలో కూచుని కొల్లేటిలో తిరుగుతున్న అనుభూతిని కలగచేస్తున్నాయి. మంచి సినిమా చూసిన కొన్ని రోజుల వరకూ ఆ దృశ్యాలు మనలోనే ఉంటాయి. ఈ నవల ముగించిన కొన్ని రోజుల వరకూ కొల్లేటి దృశ్యాలు మనసుని కమ్ముకుంటాయి. కమ్ముకోవడం ఎందుకంటే కొల్లేరు ఒక జీవావరణ, జీవన, పాలనాపరమైన విషాదం ఇప్పుడు.

**- తల్లావఝ్ఝుల పతంజలి శాస్త్రి**

## బహెన్




- బా రహమతుల్లా కథలు

వెల : రూ.100/- పేజీలు : 218

ప్రతులకు : 9490806022

అల్ప సంఖ్యాక వర్గంగా సమాజం చివరి అంచులకు నెట్టబడిన ముస్లిం మత మానవ సమూహాల జీవన అస్తిత్వ వేదనలను కథలుగా మలుస్తూ తెలుగు కథా సాహిత్యానికి వస్తుగౌరవం పెంచుతున్న నేటి రచయిత రహమతుల్లా. రహమతుల్లా కథల ప్రత్యేకతను, విశిష్టతను తెలియచెప్పే ఒక ప్రతినిధి కథ 'నర్గిస్'.

**- కాత్యాయనీ విద్మహే**

## కార్టూన్లు - 2




- చలపాక ప్రకాష్

వెల : రూ.40/- పేజీలు : 55

ప్రతులకు : 9247475975

ఈ చిరు గ్రంథంలో కొన్ని కార్టూనులను సమాజానికి అర్పిస్తున్నాడు. అవి నవ్వించడమే కాదు, ఆలోచింపజేస్తున్నాయి. సమాజంలోని చెడుగులను కడిగేస్తున్నాయి. రోగులకు తియ్యటి మందుతో చికిత్స చేస్తుంటాయి. సమాజంలోని అలవాట్లను, ఆలోచనలను శుద్ధి చేస్తున్నాడు. చలపాక సామాజిక వైద్యుడు.

**- టీ.వీ.**

## రాతిచిగుళ్ళు




కవితా సంపుటి

- శైలజామిత్ర

వెల : రూ.100/-పేజీలు :151

ప్రతులకు : 9290900879

ఆత్మాశ్రయ అస్తిత్వ వేదన, సామాజిక అస్తిత్వ సంవేదన, సమ్మిళితంగా కొనసాగుతూ, అభివ్యక్తిలో సాంద్రమైన భావచిత్ర రచనకూ, శైలిలో సౌందర్యవంతమైన లయకూ ప్రాధాన్యమిచ్చే శైలజామిత్ర 'రాతిచిగుళ్ళు' మంచి స్థాయి కల కవిత్వంతో నిండి ఉంది. ఏది చెప్పినా, వచనత్వాన్ని వదిలి కవితాత్మకంగా చెప్పాలనే ప్రయత్నం అభినందనీయం.

**- డా॥ అద్దేపల్లి రామమోహనరావు**

## నైతిక కథాదర్శనం




- విద్వాన్ చొప్ప వీరభద్రప్ప

వెల : రూ.150/- పేజీలు : 262

ప్రతులకు : 9492450984

ప్రతి పాఠశాలలో ఉండాల్సిన పుస్తకమిది. పాఠశాలల్లో వారానికి ఒకటీ రెండు పీరియడ్స్ అయినా కథల కోసం కేటాయించాలి. ఆ సమయంలో ఈ కథల్ని వినిపించాలి. చదివించాలి. చిన్నతనంలో మోసం, ద్వేషం ఎరగని పిల్లలు, భవిష్యత్తులో కూడా చక్కగా, బుద్ధిగా మెలగాలంటే ఇలాంటి కథలు ఎంతగానో ఉపయోగపడతాయి.

**- గుడిపాటి**

# స్వీకారం

## అమ్మ కథలు




కథలు

- సమ్మెట ఉమాదేవి

వెల : రూ.150/- పేజీలు : 190

ప్రతులకు : 9849406722

తనదైన వ్యక్తిత్వంగల ఉమాదేవి కథలన్నింటిలో స్త్రీ మూర్తులే కథా నాయికలు. వాళ్ళు స్వాభిమానం, ఆత్మ నిబ్బరత, తనదైనా వ్యక్తిత్వం, అభిప్రాయాలు కలిగిన వాళ్ళు. ఒకరి చేతిలో నలిగేవాళ్ళు కారు. ఒకరి పంచన దీనంగా బతికేవాళ్ళు కారు. ఒకరికి భావదాస్యం చేసేవాళ్ళు కారు. అంత బలంగా స్త్రీ పాత్రలను చిత్రించి సమాజంలో స్త్రీలు ఈ విధంగా ఉండాలని ఉమాదేవి తన కథలలో ప్రబోధించింది.

**- ముదిగంటి సుజాతారెడ్డి**

## సూర

దళిత నవల

- భూతం ముత్యాలు



వెల : రూ.100/- పేజీలు : 92

ప్రతులకు : 9490437978

దళిత రచయితల నుంచి కొంత విరామం తర్వాతనైనా మంచి నవల రాయడం ఆనందించదగ్గ విషయం. తెలంగాణ మాండలికంలో కథలు, నవలలు హెచ్చుస్థాయిలో రావల్సింది అని కోరుకునే అభిమానులకు ఈ నవల కొంత ఊరటని కలిగిస్తుంది. ఏది ఏమైనా తెలుగు నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేసే ప్రక్రియకు తన వంతు చేయూత నిచ్చింది 'సూర' నవల అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**- డా॥ నసుమాసస్వామి**

## బుగాడ




కథలు

- భూతం ముత్యాలు

వెల : రూ.75/- పేజీలు : 120

ప్రతులకు : 9490437978

తను, తన చుట్టూ అల్లుకుని వున్న మనుషులు మాట్లాడే సజీవ మాండలీకంలో రాసిన కథలు ఇవి. ఈ సంపుటిలో ఉన్న మొత్తం 16 కథలూ కూడా తెలంగాణాలోని తన ప్రాంతపు మాండలీకంతో మమేకమై రాసారు భూతం ముత్యాలు. మట్టి మనుషుల జీవితాలు పచ్చి పచ్చిగా మాండలీకపు సొంపుతో పాఠకుడి మనసును గాఢంగా హత్తుకుంటాయి.

## పొడిచే పొద్దు




కథానికలు

- కన్నెగంటి అనసూయ

వెల : రూ.150/- పేజీలు : 152

ప్రతులకు : 9246541249

అనసూయ గారి కథల వెనుక ఆమె ఆర్ద్ర హృదయం, సమాజ పరిశీలనా దృష్టి, పరిణత మనస్కత, మానవీయ విలువల పట్ల ఆమెకున్న మన్నన చదువరుల మనసును హత్తుకుంటాయి, వారి ఆలోచనల్ని కదిలిస్తాయి.

**- విహారి**

## జలగ




దీర్ఘ కవిత

- డా॥ అప్పాల చక్రధారి

వెల : రూ.60/-పేజీలు :99

ప్రతులకు : 9441629693

ఈ దీర్ఘ కవితలో డా॥ చక్రధారి రాజకీయ చదరంగం వికృత రూపం, ప్రజల్ని ఎలా తప్పుదోవ పట్టిస్తున్నాయో, ఎలా విష వలయంలోకి తోస్తున్నాయో కూలంకుషంగా కుంతలజలపాతంలా అశ్రుధారగా, కవిత్వం ఒక ఊపులో చిక్కగా సూటిగా మనసుకు హత్తుకునేట్టుగా వ్యక్తీకరించాడు.

**- డా॥ దామెర రాములు**

## బాటే.... తన బ్రతుకంతా...



వచన కవిత్వం

- అవధానుల మణిబాబు

వెల : రూ.60/- పేజీలు : 54

ప్రతులకు : 9948179437

ఎప్పుడో వచ్చే ఒకానొక శాశ్వతవాక్యం కోసం జీవితాంతం రాస్తూనే వుండాలి. రాసీ రాసీ గుండెలరిగిపోవాలి అంటాడు కొప్పర్తి. మణిబాబు రాస్తూ వున్నాడు. అతడి కవిత్వం శాశ్వత వాక్యాన్ని ప్రామిస్ చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆశించడం పోరాటుకూడా కాదని ఇందులో కవితలు తెలియజేస్తున్నాయి.

**- ఎల్.కె. సుధాకర్**

# స్వీకారం

## చికాగోలో నానమ్మ




**- బి.ఎస్. రాములు కథలు**

**వెల : రూ.150- పేజీలు : 220**

ప్రతులకు : 8331966987

గ్రామాలను రచనా కేంద్రాలుగా చేసుకుని రాములు రాసిన ఈ కథల్లో సన్నివేశాలన్నీ రోజూ జరుగుతున్నవే. వాటిని తన మనసుకెక్కించుకుని, చిన్న చిన్న కథలుగా మలచుకొని, కథనంలో నేటివిటీ నిలుపుకొని, అవసరమైనప్పుడు స్థానిక మాండలిక భాషను పొదుగుకొని రచయిత చూపిన నేర్పును మెచ్చుకోకుండా ఉండలేము. ఆ కథల్లో కలిసిపోకుండా ఉండలేము.

**- డా. సి. నారాయణరెడ్డి**

## వెంకటగిరి సంస్థాన చరిత్ర- సాహిత్యం




**- డాక్టర్ కాళిదాసు పురుషోత్తం**

**వెల : రూ.250/- పేజీలు : 390**

ప్రతులకు : 919247564044

లోతైన పరిశోధన గ్రంథం యిది. ఈ గ్రంథప్రాచుర్యాన్ని రెండు పార్శ్వాల్లో చూడాలి. ఒకటి, యిది సాహిత్య పరిశోధనా ప్రక్రియకే పరిమితం కాకపోవడం, రెండవ అంశం, వెంకటగిరి సంస్థానచరిత్ర నేపథ్యంగా, రాజకీయ పరిణామాలకే పరిమితం కాకుండా, సమాజంలో సమాంతరంగా చోటుచేసుకొంటున్న మార్పులతో మేళవించి, సాహిత్యసృష్టిని పరికించడం యిందులోని ప్రత్యేకత.

**- వకుళాభరణం రామకృష్ణ**

## బతుకు పాఠాలు!




**కథాచిత్రాలు**

**- చిలకపాటి రవీంద్రకుమార్**

**వెల : రూ.22- పేజీలు : 51**

ప్రతులకు : 0866-2862424

ఈ రోజుల్లో కథలకు కరువొచ్చి పడింది. ఆంగ్ల భాష మీద మోజుతో పిల్లలకు తెలుగు చదవడం రాక, అద్భుతమైన కథల పుస్తకాలకు దూరమై పోతున్నారు. బాల్యానందాన్ని కోల్పోవడం కన్న విషాదమే ముంది. బాలబాలికలకు! ఇందులోని 25 కథలు మనలను ఆలోచింపచేస్తాయి. ఆర్ద్రత కలిగిస్తాయి. కళ్ళు చెమర్చేలా చేసి, చివరకు ఔరా అనిపిస్తాయి. కథకు ఇంతకన్నా పెద్ద ప్రయోజనం ఏముంటుంది.

**- దేవినేని మధుసూదనరావు**

## విభజన రేఖలు




**కథలు**

**- డా॥ ఎం. హరికిషన్, జి. వెంకటకృష్ణ, డా॥ కె. సుభాషిణి**

**వెల : రూ.20/- పేజీలు : 52**

ప్రతులకు : 8985034894

రాయలసీమకు జరిగిన అన్యాయాలు సమైక్య రాష్ట్ర ముసుగులో కనపడకుండా వున్నవన్నీ యిప్పుడు దిగంబరంగా దర్శనమివ్వనున్న సందర్భంలోకి చరిత్ర నడుస్తున్నది. ఆ సందర్భాన్ని ఎత్తి పట్టుకోవడానికీ, అటువైపుగా యీ ప్రాంత రచయితలు తమ కలాల్ని పదును పెట్టుకోవటానికీ, యీ కథలు పురిగొల్పుతాయని ఆశిస్తున్నాం.

**- సాహితీమిత్రులు, కర్నూలు**

## మరో మహాసంగ్రామం




**-పత్తి సుమతి**

**వెల : రూ.50/- పేజీలు : 48**

ప్రతులకు : 8790499405

నిర్భయ సంఘటన దేశ రాజధానిలో జరిగినప్పుడు - ఒక మహిళగా నేను చాలా ఉద్వేగం, ఉద్రేకం, ఆక్రోశం, అంతులేని ఆవేదనకు గురయ్యాను. నాకు అంతగా సాహిత్య పరిజ్ఞానం లేకపోయినా 'జరగకూడనిది జరిగింది' (16-12-2013)... అత్యాచారాలు యిప్పటికీ జరుగుతూనే ఉన్నాయి...ఈ విష సంస్కృతికి అడ్డుకట్ట వేయలేని మన దౌర్భాగ్య సామాజిక పరిస్థితులకు కలతచెంది ఆ సంఘటనను రికార్డ్ చేయడానికి ఈ చిన్ని పుస్తకం వ్రాశాను.

**- పత్తి సుమతి**

## శ్రీలత కథలు - పరిశీలన




**- డా॥ కోడూరు స్వతంత్రబాబు**

**వెల : రూ.150/- పేజీలు : 252**

ప్రతులకు : 9440314367

డా॥ స్వతంత్రబాబు శ్రీలత కథల్లోని అన్ని అంశాలను చక్కగా వివిధ అధ్యాయాల్లో విశ్లేషించారు. శ్రీలత జీవనరేఖలు, ఇతివృత్తం, పాత్రచిత్రణ, సాంఘిక సాంస్కృతిక అంశాలు, భాషా విశేషాలను క్షుణ్ణంగా పరిశీలించి సఫలీకృతుడయ్యాడు.

**- ఆచార్య పి. నరసింహారెడ్డి**

## నివేదిక

# కవుల కర్మాగారం సాహితీస్రవంతి



కాకినాడలో 15 నెలలుగా 'ప్రతినెలా – సాహిత్యహేల' పేరిట సాహితీస్రవంతి నిర్వహిస్తున్న సాహిత్య కార్యక్రమాల వార్షికోత్సవ సభ మే 18న స్థానిక రోటరీ క్లబ్‌హాల్‌లో ఉత్సాహంగా జరిగింది. ఐదు విభాగాలుగా జరిగిన ఈ కార్యక్రమం ప్రథమ సమావేశానికి ప్రముఖ కవి, విమర్శకులు డా॥ అద్దేపల్లి రామమోహనరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు, వ్యాసకర్తలు, వక్తలను తయారుచేసే 'సాహిత్య కర్మాగారం'గా ఈ కార్యక్రమాన్ని వర్ణించారు. అవధానుల మణిబాబు ప్రయోక్తగా వ్యవహరించారు.

సాహితీస్రవంతి కాకినాడ కన్వీనర్ గనారా సాహితీస్రవంతి నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. మేడిశెట్టి శ్రీరాములు ప్రార్థనాగీతం ఆలపించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆకాశవాణి విశాఖపట్నం డైరెక్టర్ మాట్లాడుతూ ఈ సాహిత్య కర్మాగారం ప్రాణవాయువు లాంటి సాహిత్యాన్నందించి కొత్త ఊపిరులూదుతోందన్నారు. ప్రతి సంస్థ గదులను కట్టుకుని వారి వారి పరిధిలో ఉండిపోతున్న తరుణంలో భావప్రసార వినిమయానికి చక్కని వేదికగా నిలవడం అభినందనీయమన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న డా॥ పి. చిరంజీవినీ కుమారి మాట్లాడుతూ కార్యక్రమాల నిర్వహణతో పాటు వాటిని డాక్యుమెంట్ చేసినపుడు భవిష్యత్ తరాలకు ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా॥ పూషా మాట్లాడుతూ సాహిత్యం 'రోగ నిదాన సాధనం' అన్నారు. భాష, శబ్దం, అర్థం, వ్యాకరణం వంటి విషయాల్ని ప్రాథమిక అవగాహన పెంచుకోవాలని యువతకు సూచించారు.

రెండవ సమావేశానికి ప్రముఖ రచయిత డా॥ వుయ్యూరు హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సామర్లకోటకు చెందిన 'వద్దిపర్తి రామకృష్ణ శ్రీవత్స' దీర్ఘకవిత 'నడక కడలి వరకే' ను డా॥ చిరంజీవినీ కుమారి ఆవిష్కరించారు. డా॥ అద్దేపల్లికి అంకితమీయబడిన ఈ గ్రంథంపై విశ్రాంత తెలుగు అధ్యాపకులు జోస్యుల కృష్ణబాబు సమీక్షించారు. ఉత్తమస్థాయి కవిగానే కాక ఉన్నత వ్యక్తిత్వం గల వానిగా కవిని ప్రశంసించారు. కడలి గురించి ఊహ తెలిసనప్పటి నుండి నేటివరకూ కవికి గల భావనలన్నీ ఈ దీర్ఘకవితలో అభివ్యక్తమయ్యాయన్నారు. ఈ గ్రంథంలో అద్దేపల్లిని నేలపైగల జాబిల్లిగా అభివర్ణించారన్నారు. ఈ గ్రంథంలో 4వరుసల పంక్తులలో ప్రతి ముక్తకం ఒక కెరటంలా పాఠక హృదయాన్ని తడుపుతుందన్నారు. వీరు ప్రయోగించిన అలంకారాలు ప్రబంధస్థాయిలో ఉన్నాయన్నారు. సముద్రాన్ని త్యాగమయిగా, శ్రామికునిగా, మానవాళికి మార్గదర్శిగా వర్ణించారు.

కవి రామకృష్ణ శ్రీవత్స తన స్పందనలో ఈ దీర్ఘకవితకు ప్రేరణనందజేసిన సాహితీస్రవంతికి కృతజ్ఞతలు తెలియజేసారు. తంత్రవహి శ్రీరామమూర్తి తూర్పుగోదావరి జిల్లా ప్రాశస్త్యాన్ని వివరించే గీతాన్ని ఆలపించారు. అధ్యక్షులు వుయ్యూరు హనుమంతరావు మాట్లాడుతూ ప్రపంచీకరణ దుష్ప్రభావాలు భారతదేశంలో అధికమయ్యాయని అన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన వేంకటేశ్వరా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా॥ మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచమంతటా ఇంజనీర్లు, డాక్టర్లు ఇతర మానవ వనరులను తయారుచేస్తున్నాం గానీ అచ్చమైన మనుషుల తయారీ జరగటం లేదని ఆ లోటును సాహితీస్రవంతి తీరుస్తుందన్నారు. ప్రపంచీకరణ అవగాహన చేసుకునేందుకు సాహిత్యమొక్కటే ప్రధాన సాధనమన్నారు. ప్రస్తుతం ఉన్న సామాజిక అవలక్షణాలన్నింటినీ ప్రపంచీకరణ పోషిస్తుందన్నారు. ఇల్లు అంటే అనుబంధాల నిలయంగా కాక వస్తు వ్యామోహసంస్కృతి పెచ్చుపెరిగి ఖరీదైన వస్తువుల ప్రదర్శనశాలగా మారిందన్నారు.

అనంతరం జరిగిన సాహిత్య సదస్సుకు డా॥ జి. సీతారామస్వామి అధ్యక్షత వహించారు. వీరబాబు గీతాలాపన చేశారు. తన అధ్యక్షోపన్యాసంలో వచన కవిత్వ ఆరంభం పాశ్చాత్య దేశాలలో జరిగిందని అన్నారు. తెలుగులో కుందుర్తి, శ్రీశ్రీ, సోమసుందర్ ఇత్యాదుల కవిత్వాన్ని ఉదహరించి మాట్లాడారు. సి.నా.రె. పేర్కొన్న వచన కవిత్వ లక్షణాలు ఈనాటి కవుల వరకూ అందులో మారుతున్న



అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రాచీన ప్రబంధ సాహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. సమకాలీన అంశాలపట్ల అవగాహన, ఆవేదన, అభివ్యక్తి సాహిత్యకారులకే సాధ్యమవుతుందన్నారు.

ప్రముఖ సాహిత్యవేత్త నియోగి కీలకోపన్యాసం చేశారు. మనిషిని కౌగిలించుకోండి మట్టి భాష మాట్లాడండి అంటూ సాహిత్యవేత్తలకు సూచించారు. ఆయన 'శ్రీశ్రీ కవితా ప్రస్థాన–విశ్లేషణలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ పుస్తకాన్ని కె.వి. రమణారెడ్డి సమీక్షించారు. తరువాత జరిగిన సాహిత్యసదస్సును ప్రొఫెసర్ టి. విశ్వనాథరావు అధ్యక్షతన ప్రారంభించారు. ప్రముఖ సాహిత్యవేత్త డా॥ ద్వానా శాస్త్రి 'కవిత్వ రచనా రీతులు' అంశంపై ప్రసంగించారు. అనంతరం ఆయన గడల శివప్రసాద్ నానీల సంపుటి



హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్‌లోని పాపడమ్స్ హోటల్‌లో మే 5న బారహమతుల్లా కుమారుడు మేరాజ్ వివాహ రిసెప్షన్ సందర్భంగా బారహమతుల్లా కథల పుస్తకం 'బహెన్' ఆవిష్కరణ. ఫొటోలో ప్రముఖ సాహితీవేత్తలు కె. శివారెడ్డి, నగ్నముని, దీవి సుబ్బారావు. చింతపట్ల సుదర్శన్, ప్రసాదమూర్తి, యాకూబ్, శిలాలోలిత, రమణజీవి, పౌరప్రసాద్, అసుర, దర్భశయనం శ్రీనివాసాచార్య, బండి నారాయణస్వామి, సురేందర్ రాజు, బారహమతుల్లా దంపతులతో నూతన వధూవరులు.



హైదరాబాద్, తెలుగు విశ్వవిద్యాలయంలో మే 11న జరిగిన 'అమృతలత అపురూప పురస్కారాల' ప్రదానోత్సవ సభ. ఫొటోలో అనిశెట్టి రజిత, ఎన్. అరుణ, వేదవతీ ప్రభాకర్, డా॥ వాసా ప్రభావతి, మల్లు స్వరాజ్యం, డి. కామేశ్వరి, జమున, డా॥ సి. నారాయణ రెడ్డి, రావు బాలసరస్వతి, వి. ప్రతిమ, కాత్యాయనీ విద్మహే, డా॥ అఖిలేశ్వరీ రామాగౌడ్, అమృతలత, డా॥ అలేఖ్య, ఉదయభాను, నెల్లుట్ల రమాదేవి

'చెరుకుగడల నానీలు' ఆవిష్కరించారు. కవి రామచంద్రారెడ్డి ఆ పుస్తకాన్ని సమీక్షించారు. ప్రొఫెసర్ విశ్వనాథరావు మాట్లాడుతూ అల్పాక్షరాలతో అనంతార్థాన్నిచ్చేదే కవిత్వం అన్నారు. ద్వానా శాస్త్రి మాట్లాడుతూ తెలుగులో 35కు పైగా ప్రక్రియలున్నా అన్నిటిలో ఉదాత్తమైనది కవిత్వం అన్నారు. ఏ పదం తీసినా మొత్తం భావం పడిపోతుంది అనేట్లుగా ప్రతీపదం ప్రయోజనకరంగా ఉండాలన్నారు. అనంతరం రెక్కలు ప్రక్రియపై డా॥ అద్దేపల్లి ప్రసంగించారు. శిరీష రెక్కల సంపుటి 'సిరిగమల – గలగలలు' ని మల్లేశ్వరరావు ఆవిష్కరించారు. కారుప్రోలు గౌరునాయుడు పుస్తక సమీక్ష చేశారు. అభివ్యక్తిలో నవ్యతను, పరిణతిని కొనియాడారు. అనంతరం ప్రసిద్ధ కవులు మాకినీడి సూర్యభాస్కర్, జి. సుబ్బారావు, కుమారి పసుమర్తి పద్మజవాణి, విఎస్ఆర్ఎస్ సామయాజులు కవిసమ్మేళనాన్ని నిర్వహించారు. సభ చివరిలో గత 15 నెలలుగా కవి సమ్మేళనాల్లో చదివిన కవితలతో ప్రచురించిన కవితా సంపుటి 'కడలి చిరునామా'ను



ఆవిష్కరించారు. తంగిరాల చక్రవర్తి పుస్తక సమీక్ష చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– గనారా

# దళిత మహిళల దేవిపోతలే 'రాయక్క మాన్యమ్'




*హైదరాబాద్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మే 12న జరిగిన జూపాక సుభద్ర కథల సంపుటి 'రాయక్క మాన్యమ్' ఆవిష్కరణ సభ.*

ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర రాసిన కథల సంపుటి 'రాయక్క మాన్యమ్' ను మే12న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జోగినీ వ్యవస్థ నిర్మూలనా ఉద్యమ నాయకురాలు ఆజమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆజమ్మ మాట్లాడుతూ అనాదిగా అంటరానితనం, అణచివేతలకు గురౌతున్న దళిత మహిళల జీవితానుభవాలను కథలుగా రాసినందుకు జూపాక సుభద్ర అభినందనీయురాలు అన్నారు. ఈ పుస్తకావిష్కరణ సభకు అధ్యక్షత వహించిన ద్రావిడ విశ్వవిద్యాలయం ఆచార్య పులికొండ సుబ్బాచారి మాట్లాడుతూ ఈ కథల ద్వారా తెలంగాణ మట్టి మనుషుల సాంస్కృతిక సౌందర్యం, యాస, భాషల పరిమళాలను రచయిత్రి సుభద్ర మనముందు ఉంచారన్నారు. ఎస్వీ విశ్వవిద్యాలయం ఆచార్య ఎన్. మునిరత్నమ్మ మాట్లాడుతూ ఈ కథా సంకలనంలో 17 కథలున్నాయని, దళిత మహిళల కష్టాలను, వారి జీవన వైవిధ్యాలను గతంలో ఎవ్వరూ రాయలేనంత లోతుగా, సవివరంగా రచయిత్రి ఈ కథల్లో ఆవిష్కరించారని అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క మాట్లాడుతూ 'గద్దెత్క పోయిన బత్కమ్మ' కథ దళిత మహిళల జీవితాలకు అద్దం పడుతున్నదని, తెలంగాణ నవ నిర్మాణంలో దళిత బహుజన మహిళలకు గౌరవం, సమాన హక్కులు దక్కాలని ఆకాంక్షించారు. రుంజ పూర్వ అధ్యక్షురాలు, మట్టిపూల రచయిత్రి జ్వలిత మాట్లాడుతూ దళిత మహిళలపై నేటికీ కొనసాగుతున్న తీవ్రమైన దోపిడీ వివక్షలు, అణచివేతలకు సుభద్ర కథలు అద్దం పడుతున్నాయన్నారు. మట్టిపూల కవయిత్రి డాక్టర్ షాజహానా మాట్లాడుతూ దేశంలో గాయాలు లేని దళిత స్త్రీ లేదని, కుల వివక్ష రూపాలు మార్చుకుంటున్నదిగానీ, సమసి పోలేదన్నారు. సుభద్ర కథల్లోని పాత్రలన్నీ సజీవమైనవేనని అన్నారు. మరో మట్టిపూల రచయిత్రి, ఉపాధ్యాయురాలు గంధం విజయలక్ష్మి మాట్లాడుతూ సుభద్ర కథల్లో తెలంగాణ మట్టి మనుషుల భాషా మాధుర్యం, నానుడులు, చాటువులు, పలుకుబడులు, జాతీయాలు కళ్ళకు కట్టినట్టు కన్పిస్తాయని, వినిపిస్తాయని తెలిపారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సీనియర్ అధ్యాపకులు డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచీకరణకు మూలసూత్రమైన సాంస్కృతిక ఏకీకరణను తిప్పికొట్టగల సామర్థ్యం ఈ కథల్లోనే ఉన్నదన్నారు. నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ జి.వి. రత్నాకర్ మాట్లాడుతూ దళిత సాహిత్యంలో జూపాక సుభద్ర రచనలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అట్టడుగు మహిళా సమాజాలను ఉద్యమ స్థాయిలో అక్షరబద్ధం చేస్తున్న జూపాక సుభద్ర రచనలపై వివరమైన పరిశోధన జరగాలన్నారు. మాదిగ మహాశక్తి జాతీయ కన్వీనర్, రచయిత కృపాకర్ మాదిగ మాట్లాడుతూ రచయిత్రి సుభద్ర రచనలు, ఇతర మట్టిపూల రచయిత్రుల సాహిత్యాల వెనకనున్న సామాజిక జెండర్, సాహిత్య వస్తు తత్వాలపై సమగ్రమైన విశ్లేషణ, అధ్యయనం, పరిశోధన, ప్రచారం జరగాలన్నారు. బహుజనులైన మట్టిపూల రచయిత్రుల రచనలే ఇకపై ప్రధాన స్రవంతి సాహిత్యం అవుతుందన్నారు. చివరగా ఈ 'రాయక్క మాన్యం' కథా సంకలనం రచయిత్రి జూపాక సుభద్ర మాట్లాడుతూ తన చుట్టూ ఉన్న అట్టడుగు దళిత సమాజాల మహిళల జీవితాలే తన కథలకు మూలము, స్ఫూర్తి అని తెలిపారు.

– కృపాకర్ మాదిగ

# మహాకవి 103వ జయంతి

పశ్చిమగోదావరి జిల్లా, పోడూరు మండలంలోని పండితవల్లూరు గ్రామం శాఖా గ్రంథాలయంలో ఏప్రిల్ 30న మహాకవి శ్రీశ్రీ 103వ జయంతి సభ జరిగింది. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆచంట సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విశ్రాంత అధ్యాపకులు తోరం సూర్యనారాయణ 'మహాప్రస్థానం' విశిష్టతను వివరిస్తూ ప్రసంగించారు. అనంతరం కమ్మ నరసింహారావు మాట్లాడుతూ ప్రజాకవిగా అణగారిన మానవాళి అభ్యున్నతికై రచించిన గేయ కవితలను విశ్లేషించారు. సభాధ్యక్షులు మాట్లాడుతూ ప్రజల కష్టాలు, తన బాధలుగా, జీవితాంతం జనాభ్యుదయానికి తన కవితల ద్వారా శ్రీశ్రీ చైతన్యపరిచారని అన్నారు. మరికొందరు ప్రసంగించిన అనంతరం షేక్ జహీర్ వందన సమర్పణతో సభ ముగిసింది.

# సాహిత్య పురస్కారానికి ఆహ్వానం

గుంటూరు జిల్లా రచయితల సంఘం కథ, కవిత ప్రక్రియల్లో పురస్కారాలకు గాను పోటీ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి ఎస్.ఎమ్. సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగులో ప్రచురించిన స్వీయ వచన కవితా సంపుటులు, స్వీయ కథా సంపుటులు ఈ పోటీకి పంపించవచ్చు. 2013 జనవరి నుండి డిసెంబరు మధ్య కాలంలో ప్రచురించిన పుస్తకాలను మూడు కాపీలను జూన్ 30వ తేదీలోపు 'కోసూరి రవికుమార్, గ్రంథాలయం దగ్గర, దాచేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా – 522 414 చిరునామాకు పంపించవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 9490776184, 9441409749 ద్వారా సంప్రదించవచ్చును.

# డైరీ

## సాహితీస్రవంతి ఆధ్వర్యంలో చలం జయంతి




సాహితీస్రవంతి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన చలం జయంతి సభలో ప్రసంగిస్తున్న సాహిత్య విమర్శకులు గుడిపాటి. చిత్రంలో టి.కిషోర్, శాంతిశ్రీ, తంగిరాల చక్రవర్తి

స్త్రీ, పురుషుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలో, స్త్రీని ఏ విధంగా గౌరవించాలో చలం తన రచనల్లో గొప్పగా చెప్పారని ప్రముఖ సాహిత్య విమర్శకులు గుడిపాటి అన్నారు. సాహితీస్రవంతి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మే 24న జరిగిన చలం జయంతిని పురస్కరించుకుని జరిగిన 'చలం సాహితీ సమాలోచనం' సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. చలం రచనల్లో మైదానం, జీవితాదర్శం, అరుణ రచనలు అందర్నీ ఆలోచింపజేసేవిగానూ, విస్మయపరిచేవిగానూ ఉంటాయని తెలిపారు. స్త్రీని ఎలా అర్థం చేసుకోవాలో, తనను కూడా సాటి మనిషిలా గుర్తించాలని చలం తన రచనల్లో అద్భుతంగా రాశాడని అన్నారు. కానుక, ఫలసేకరణ, గీతాంజలి రచనలు మళ్ళీ మళ్ళీ చదవుతామని అన్నారు. చలం రచనల్లోని పాత్రలు, సంభాషణలు పాఠకులను వెంటాడతాయని అన్నారు. మహిళ కుటుంబంలో అందరికోసం ఆలోచిస్తుంది కానీ తన కోసం ఎప్పుడూ ఆలోచించదని సాహితీస్రవంతి నగర కమిటీ సభ్యురాలు శాంతిశ్రీ అన్నారు. సమాజ విముక్తితో స్త్రీ విముక్తి ముడిపడి వుందని ఆమె అన్నారు. సాహితీస్రవంతి హైదరాబాద్ నగర కమిటీ అధ్యక్షులు తంగిరాల చక్రవర్తి సభాధ్యక్షత వహించారు. నగర కమిటీ ప్రధాన కార్యదర్శి జి. యాదగిరి రావు సభకు స్వాగతం పలికారు. నగర కమిటీ సభ్యుడు టి. కిషోర్ 'మహిళా సాధికారత' అంశంపై జనకవనం నిర్వహించారు. 22 మంది కవులు తమ కవితలను చదివి వినిపించారు. పూసల రజనీగంగాధర్, పొత్తూరి సుబ్బారావు, ఒబ్బిని సన్యాసిరావు, రత్నా మహీధర్, ఆచార్య నరేంద్ర, విల్సన్‌రావు, స్ఫూర్తి, కొంపెల్ల కామేశ్వరరావు, వి.ఎస్.వి. ప్రసాద్, ఆలువాల సురేష్, పెద్దూరి వెంకటదాసు, గుళ్ళపల్లి ఆంజనేయులు, జె. శ్రీనివాసరావు, ఎస్. వివేకానంద, కె. రాజ్యలక్ష్మి, బొపార తదితర కవులు తమ స్వీయ కవితలు వినిపించారు. సీనియర్ కవులు అద్దేపల్లి రామమోహన రావు, నాళేశ్వరం శంకరం, సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి వొర ప్రసాద్, ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజర్ కె. లక్ష్మయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గజల్ కవిగాయక సమ్మేళనం



ఖమ్మం జిల్లా బూర్గంపాడు మండలంలోని ఇరవెండి గ్రామంలో తాళ్ళూరి పంచాక్షరయ్య గృహ ప్రాంగణంలో భద్రాచలం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో గజల్ కవిగాయక సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి భద్రాచలం సాహితీస్రవంతి గౌరవ అధ్యక్షులు మాల్యశ్రీ సమన్వయకర్తగా వ్యవహరించారు. అధ్యక్షులు వీధుల రాంబాబు సభాధ్యక్షత వహించారు. తాళ్ళూరి పంచాక్షరయ్య, తానా ఫౌండేషన్ ఛైర్మన్ తాళ్ళూరి జయశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సభాధ్యక్షులు వీధుల రాంబాబు మాట్లాడుతూ గజల్ ప్రక్రియ పారశీకం నుంచి వచ్చిందనీ, ఉర్దూ భాషలోకి స్వాగతింపబడిందనీ, తరువాత క్రమంగా భారతీయ భాషలన్నింటిలోకి ప్రవేశించిందనీ అన్నారు. కన్నెగంటి వెంకటయ్య తను స్వయంగా రాసి ఆలపించిన గజల్ సభికులను ఆకట్టుకుంది. తాళ్ళూరి పంచాక్షరయ్య మాట్లాడుతూ గజల్ కవిత్వం సరళంగా, రసాత్మకంగా ఉందని, ఇది నేటి పాఠకులకు, శ్రోతలకు ఉపయోగకరంగా ఉందని అభిప్రాయపడ్డారు. తాళ్ళూరి జయశేఖర్ మాట్లాడుతూ తెలుగు భాష సాహిత్యం వెనకపట్టుపడుతున్న దశలో సాహితీస్రవంతి వంటి సంస్థలు ముందుకు వచ్చి గజల్ వంటి వినూత్న ప్రక్రియ ద్వారా సాహిత్యాభిరుచిని పెంపొందింపజేయడం ముదావహం అన్నారు. భవిష్యత్తులో భద్రాచలంలో నిర్వహించబోయే 'చైతన్య స్రవంతి' సాంస్కృతిక కార్యక్రమంలో సాహితీస్రవంతికి సముచిత స్థానం కల్పిస్తామని ప్రకటించారు. టి. సిద్దులు, చావా లక్ష్మీనారాయణ, జి.యస్. శంకరరావు, ఏగిసూర్యనారాయణ తదితర విద్యాసంస్థల ప్రముఖులు, ఉపాధ్యాయులు, మేధావులు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, ఖమ్మం జిల్లా సాహితీస్రవంతి ప్రధాన కార్యదర్శి రౌతురవి, సంపటం దుర్గాప్రసాద్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. షాజహాన్, యం. వీరభద్రా రెడ్డి, శ్రీధిరాల వెంకటాచారి, సి. నాగేంద్ర ప్రసాద్, వర్ణం, యం. పద్మావతి, సంగీత విద్వాన్ జీవన్ లు పాటలు, పద్యాలు పాడి అలరించారు. యం.వి.ఎల్. చారి వాద్య సహకారం అందించారు. బిజెఎల్‌జి. దాను, జి.హరి నిర్వహణలో సహకరించారు. ప్రచార కార్యదర్శి జి. రామరాజు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యం అందించారు. వల్లూరిపాటి వంశీకృష్ణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

– వీధుల రాంబాబు

## ఖమ్మంలో సాహిత్య అధ్యయన వేదిక

ఖమ్మంలో బి.వి.కె. గ్రంథాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో క్రమబద్ధంగా నిర్వహించబడుతున్న సాహిత్య అధ్యయనవేదిక మే 18న జరిగింది. ఇటీవల కన్నుమూసిన ప్రసిద్ధ సంఘసేవకురాలు, రచయిత్రి మల్లాది సుబ్బమ్మకు సభకు హాజరయిన కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సమావేశానికి కొత్తగా వచ్చిన పి. వెంకటేశ్వర్లు "మందూరు దళితుల మారణకాండ", వురిమళ్ళ సునంద "రండి మీరింక ఆలస్యం చేయొద్దు " – అనే వ్యంగ్య కవితలో కార్పొరేట్ స్కూళ్ళు, కాన్వెంట్‌లు చేసే హడావుడిని చిత్రీకరించారు. యదవల్లి శైలజ " నగరం" అనే కవితలో రోజువారి నగర జీవన గమనాన్నీ తనదైన శైలిలో వినిపించారు. ఆధునిక జీవనంలో సంప్రదాయాలు ఎలా మారిపోతున్నాయో వివరించే కవిత నాగేశ్వరావు వినిపించారు. ఈ శకం నాది అనే కవితలో దళిత ధిక్కర స్వరంతో పాటు, ఆత్మ స్థైర్యం ప్రతిబింబించింది " మానవతా వాదం నా మదినిండ వుంది ", " బంగారు తల్లి " అనే కథానికను " అమ్మాయి " ని వస్తువుగా తీసుకుని (ఆడపిల్ల – అక్కడపిల్లా ?) నేటి సామాజిక పరిస్థితులు, అమ్మాయిలపైని ఎటువంటి సానుకూల, ప్రతికూల ప్రభావాలు పడతాయో, తండ్రి ఆలోచన, తల్లి ఆరాటం ఎలా ఊగిసలాటలో వుంటాయో చక్కగా చదివి వినిపించారు సంపటం దుర్గా ప్రసాద్. రౌతు రవి, కన్నెగంటి వెంకటయ్య, తమ తమ సందేశాలను అందించారు. రాబోయే సెప్టెంబరు 2014 కు సంవత్సరం పూర్తి అవుతుంది కాబట్టి ఒక ప్రత్యేక సంచిక తేవాలని అందులో కార్యక్రమాల నివేదిక, చదివిన కవితలు, ప్రసంగాల సంక్షిప్త సమాచారం వుండేలా చూడాలని తీర్మానించారు. అలాగే సాహితీ స్రవంతి 15 వ వార్షికోత్సవం జూన్ 14–15 తేదీలలో జరుగవచ్చునని దానికి ఒక ప్రత్యేక సంచికకై కవితలను, వ్యాసాలను, జూన్ నెల 5 వ తేదీలోగా బి.వి,.కె. గ్రంథాలయ నిర్వహకుడు, సాహితీ స్రవంతి అధ్యయనవేదిక నిర్వాహకుడు కపిల రాంకుమార్ అందించాలని కోరారు. కె. ఆనందాచారి మాట్లాడుతూ కాలానికి, కవిత్వానికి వున్న బంధం, సంబంధం రాజకీయలకి, సాహిత్యానికి కూడ అవినాభావ సంబంధం వుండటం నేడు అనివార్యం అని నొక్కి చెప్పారు. మతం, కులం, స్త్రీ పురుష తేడాలు, వివక్షతలపై మన సాహితీకారులు పోరాటం చేయాలన్నారు. ప్రస్తుత సాంస్కృతిక వ్యవస్థపై దాడిచేయడానికే మతచాందసుల లక్ష్యంగా కనబడుతోందని, మనం సాహితీ సృజనకారులంగా ఆ దుష్ట వైఖరిని ముక్త కంఠంతో ఖండించాన్నారు. చివరగా ఆసు ప్రసాద్ పోలవరం ముంపు బాధితులపై ఒక పాట ఆలపించాడు. సీనియర్ కవి డా॥ సీతారాం కవితలను విశ్లేషిస్తూ మాట్లాడారు. రౌతు రవి వందన సమర్పణ చేసారు.




**రంగారెడ్డి జిల్లా, తాండూరులో ఏప్రిల్ 27న నెలవంక–నెమలీక సాహిత్య మాసపత్రిక నిర్వహించిన కార్యక్రమంలో 'హైకూ' కవితలకి గాను కలహంస పురస్కారం స్వీకరిస్తున్న మోపిదేవి రాధాకృష్ణ. చిత్రంలో సంపాదక ద్వయం లక్కరాజు దేవి, యక్కలూరి శ్రీరాములు, గోరటి వెంకన్న.**



**మచిలీపట్నంలో ఏప్రిల్ 19, 20 తేదీలలో ఆంధ్ర సారస్వత సమితి ఆధ్వర్యంలో జరిగిన 13వ ఉగాది సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ. ఫొటోలో కొట్టి రామారావు, శాఖమూరి రామగోపాల్, కొత్తపల్లి బంగార్రాజు, చలమలశెట్టి వెంకటసుబ్బయ్య. ఈ సభలో కె. రాజ్యశ్రీ, భూమయ్య, నరేంద్ర, ఎల్.ఎస్. శాస్త్రి, తమిరిశ జానకి, డా. మురళి, తిక్కన సోమయాజి, డా. వి.వి. కుమారస్వామి, ఉషాగాయత్రి, మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.**




**విశాఖ పౌర గ్రంథాలయంలో ఏప్రిల్ 24న శ్రీమజ్జ వేమనరెడ్డి కథా సంపుటి 'మనోహరం' ఆవిష్కరణ సభ. ఫొటోలో అడపా రామకృష్ణ, కె.జి. వేణు, వి. బాలమోహన్ దాస్, ఎల్.ఆర్. స్వామి, పుస్తక రచయిత వేమనరెడ్డి ఉన్నారు.**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**